12-5Pg1exHMNWJQE.qxd:12-5Pg1exHMNWJQE.qxd 01/01/01 9:43 AM Page 1

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

ఒంగోలు

fb.com/vaartha Digital

Published from Ongole, Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

12-5-2025 సోమవారం సంపుటి: 31 సంచిక: 100 పేజీలు: 12 వెల: 6.50

ఉక్రెయిన్‌తో ప్రత్యక్ష చర్చలకు సిద్ధం: పుతిన్

కాశ్మీర్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తా: ట్రంప్

9లో

# పాక్‌కు గట్టిగా బుద్ధి చెప్పాం




ఆదివారం మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న త్రివిధ దళాధిల డిజిఎంఒలు ఎకె భార్తి,రాజీవ్‌ఘయ్, ప్రమోద్

## దాయాది ప్రాధేయపడిందనే కాల్పుల విరమణకు అంగీకరించాం

### పహల్గాం ఘటనకు ప్రతీకారంగానే ఆపరేషన్ సిందూర్

### 9 ఉగ్ర స్థావరాలు ధ్వంసం చేశాం

### సీజ్‌ఫైర్ తర్వాత జరిగిన దాడులపై పాక్ డిజిఎంఒ వివరణ అడిగాం

### 40 మంది పాక్ జవాన్లు మృతి, ఐదుగురు భారత్ సైనికుల ప్రాణత్యాగం

### మీడియాతో మిలిటరీ ఆపరేషన్స్ డైరెక్టర్ జనరల్ రాజీవ్ ఘయ్

**న్యూఢిల్లీ, మే 11:** ఉగ్రవాదం అంతంకోసమే ఆపరేషన్ సింధూర్‌చేపట్టామని త్రివిధ దళాల డైరెక్టర్ జనరల్స్ స్పష్టంచేసారు. సరిహద్దుల్లో కాల్పులకు తెగబడుతున్న పాక్‌సైన్యాన్ని కట్టడి చేసేందుకు ఆపరేషన్ సిందూర్ ప్రారంభించామని, పహల్గాంలో జరిగిన దాడిలో 26 మంది అమాయక పౌరులను చంపేసారని, దేశం మొత్తం ఆ కుటుంబాల శోకంచూసిందని మిలిటరీ ఆపరేషన్స్ డైరెక్టర్‌జనరల్ రాజీవ్‌ఘాయ్ చెప్పారు. కేవలం ఉగ్రవాదాన్ని సమూలంగా నిర్మూలించే లక్ష్యంతోనే మొత్తం 21 స్థావరాలను గుర్తించామని, ఏకకాలంలో 9 స్థావరాలను ధ్వంసంచేసామన్నారు. వైమానిక దాడులో ప్రత్యేకంగా భారత వైమానిక దళంలోని ఎయిర్‌లైన్స్ ఐసి 814 హైజాకర్లు, పుల్వామా దాడుల్లో పాల్గొన్న ముష్కరులు హతమయ్యారని ఎయిర్ డిజి భార్తి చెప్పారు. వీరిలోయూసుఫ్ అజహర్, అబ్దుల్‌మాలిక్ రవూఫ్, ముదాసిర్ అహ్మద్ తదితరులున్నట్లు ఆర్మీ డిజిఎంఒ రాజీవ్‌ఘాయ్ చెప్పారు. ముందుగా సరిహద్దుకు సమీపంలో ఉన్న మురిడ్కేలోని నాలుగు టార్గెట్లను ధ్వంసంచేసామన్నారు. దాడికి ముందే శిక్షణా కేంద్రాలను ఖాళీచేసారని, మురిద్కే కేంద్రంలో అజ్మల్‌కసబ్, డేవిడ్ హెడ్లీ వంటి వారికి శిక్షణ ఇచ్చారని, మొత్తం తొమ్మిది ఉగ్రశిబిరాలపై జరిపిన దాడుల్లో 100 మందివరకూ ఉగ్రవాదులు హతమయ్యారని, మా వాయుసేన దాడుల్లో నిర్దిష్టమైన వ్యవధిలో కేవలం 25నిమిషాల్లోనే లక్ష్యాలను పూర్తిచేసామని డైరెక్టర్ జనరల్ ఎయిర్ ఫోర్స్ ఆపరేషన్స్ ఎకె భార్తి తెలిపారు. భారత్ వైమానికి దాడులుచేసిన తర్వాతనే పాకిస్తాన్ పివోకే వద్దకాల్పులకు తెగబడిందని, ముందు ఉగ్రవాద శిబిరాలే లక్ష్యంగా దాడులుచేస్తే పాకిస్తాన్ గీత దాటి వచ్చి కాల్పులకు తెగబడిందని ఇకపై ఉపేక్షించ కూడదని పాకిస్తాన్ కీలక స్థావరాలను ఎంపిక చేసామన్నారు. లాహోర్‌నుంచి డ్రోన్, యుఎవిలతో భారత ఎయిర్బస్‌లను, ఆర్మీ >>2



## బుల్లెట్‌కు జవాబు క్షిపణి ప్రయోగమే

### భారత్‌కు ఎవరి మధ్యవర్తిత్వం అవసరం లేదు..

### ఆపరేషన్ సిందూర్ ఇంకా ఉంది: ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, మే 11:** పాక్ ఆక్రమిత కాశ్మీర్‌పై ఎవరి మధ్యవర్తిత్వం అవసరం లేదని ప్రధానిమోడీ స్పష్టంచేసారు. కాశ్మీర్‌పరంగా తమ వైఖరిని మార్చుకునేదిలేదని ఆయన వెల్లడించారు. పివోకేను మాకు అప్పగించడం తప్ప పాక్‌కు వేరే మార్గం లేదనిఅన్నారు. ఆపరేషన్ సిందూర్‌ఇంకా ముగియ లేదని, పాక్ కాల్పులు జరిపితే భారత్ దాడులు చేస్తుందన్నారు. పాక్ ఒక్క తూటా పేలిస్తే మీరు క్షిపణితో దాడిచేయండి అంటూ త్రివిధ దళాలకు మోడీ స్వేచ్ఛ ఇచ్చారు.సోమవారం పాకిస్తాన్‌తో చర్చలవేళ భారత్ వైఖరి ఏమిటో ప్రధానిమోడీ ఒక్కరోజు ముందుగానే ప్రపంచానికి తేల్చిచెప్పారు. పివోకే పరంగా అవసరమైతే తాను మధ్యవర్తిత్వం వహిస్తానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ ప్రకటించిన నేపథ్యంలో మోడీ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. అసలు పివోకేపరంగా తమకు ఎవరి మధ్యవర్తిత్వం అవసరంలేదని, దానిని పాకిస్తాన్ మాకు అప్పగించడం మినహా మరో మార్గంలేదన్నారు. మోడీ వ్యాఖ్యలను బట్టిచూస్తే ట్రంప్ మధ్యవర్తిత్వం >>2

**నేడు భారత్, పాక్ డిజిఎంఒల హాట్‌లైన్ చర్చలు** 2లో

## సరిహద్దుల్లో సద్దుమణిగిన కాల్పులు


### అయినా కేంద్రం రెడ్ అలర్ట్

**శ్రీనగర్; మే 11 :** ముందురోజు రాత్రి వరకూ కాల్పుల మోత మోగిన సరిహద్దు ప్రాంతాల్లో ప్రస్తుతం ప్రశాంతత కొనసాగుతోంది. రాత్రి డ్రోన్లు, పేలుళ్లు, సైరన్ల మోతతో దద్దరిల్లిన జమ్ముకశ్మీర్‌లోని శ్రీనగర్‌లో బ్లాక్ అవుట్ ఎత్తివేశారు. జమ్మూ నగరంలోనూ పరిస్థితి సాధారణంగానే ఉన్నట్లు తెలుస్తోంది. అర్థరాత్రి తర్వాత పాక్ నుంచి డ్రోన్లు, కాల్పులు, బాంబు దాడులు నమోదు కాలేదు. అఖ్నూర్, రాజౌరి, పూంచ్ జిల్లాల్లోనూ పరిస్థితి సాధారణంగానే ఉన్నట్లు తెలుస్తోంది. అర్థరాత్రి తర్వాత డ్రోన్లు, కాల్పులు, బాంబు దాడులు జరగలేదు. జనజీవనం రోజువారీ కార్యకలాపాల్లో నిమగ్నమైంది. నియంత్రణ రేఖ, వాస్తవాధీన రేఖ వెంబడి కూడా ప్రస్తుతం ఎలాంటి కాల్పులు జరగడంలేదు. భద్రతా బలగాలు మాత్రం పూర్తి స్థాయి అప్రమత్తతో ఉన్నాయి. సున్నిత ప్రాంతాల్లో పహారాను పటిష్టం చేశాయి. అనుమానం వచ్చిన వ్యక్తులను, వాహనాలను తనిఖీ చేస్తున్నాయి. పాకిస్థాన్‌తో సరిహద్దులు పంచుకుంటున్న పంజాబ్‌లోని పఠాన్‌కోట్, ఫిరోజ్‌పూర్, అమృత్‌సర్‌లోనూ పరిస్థితి సాధారణంగానే ఉన్నట్లు తెలుస్తోంది.

అర్థరాత్రి తర్వాత నుంచి డ్రోన్లు, కాల్పులు, బాంబు దాడులు జరగలేదు. ప్రస్తుతం పరిస్థితి ప్రశాంతంగా ఉంది. కాల్పుల విరమణకు అంగీరించిన పాక్ గంటల్లోనే డ్రోన్లు పంపడం వల్ల రాత్రి అమృత్‌సర్‌లో బ్లాక్‌అవుట్ అమలు చేశారు. ఆ బ్లాక్ అవుట్‌ను ఉదయం ఎత్తివేశారు.

# అమరావతిలో క్వాంటం వ్యాలీ

### • వచ్చే జనవరి 1న ప్రారంభం • 2028 కల్లా అన్ని నియోజకవర్గాల్లో ఎంఎస్‌ఎంఇ పార్కులు • దేశంలో క్వాంటం విప్లవానికి నాయకత్వం వహిస్తానన్న సిఎం చంద్రబాబు



**విజయవాడ.మే11,ప్రభాతవార్త ప్రతినిధి:** అంతర్జాతీయ నగరంగా అమరావతిని తీర్చిదిద్దే క్రమంలో పెట్టుబడులుకు అవకాశం కల్పిస్తున్నామని సిఎం నారా చంద్రబాబునాయుడు స్పష్టం చేసారు. ఐటి, ఎఐతో పాటు ఆధునిక ప్రపంచ అవసరాలకు అనుగుణంగా అమరావతికి రూ.వేల కోట్లులో పెట్టుబడులు వస్తున్నాయన్నారు. మనం తీసుకుంటున్న కీలక నిర్ణయాల్లో క్వాంటం కంప్యూటింగ్‌లో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే ముందువరుసలో నిలపాలన్నదే తన లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పారు. సంబంధిత అధికారులతో ఆయన వర్చువల్‌గా పలు అంశాలు మాట్లాడారు.వివిధ అంశాలపై వారికి మార్గదర్శనం చేసారు.అమరావతిలో భారతదేశపు మొట్టమొదటి, అత్యాధునిక క్వాంటమ్ వ్యాలీ టెక్ పార్క్ నిర్మాణం కానున్నదని వివరించారు.. దేశంలోనే తొలిసారి ఐబిఎం అతిపెద్ద క్వాంటమ్ కంప్యూటర్ 156 క్యూబిట్ హెరాన్ ప్రాసెసర్ కలిగిన క్వాంటం సిస్టం2ని అమరావతిలో నెలకొల్పనున్నట్లు తెలిపారు.

ఇటీవలే ఈ అంశంపై కీలక ఒప్పందం చేసుకున్నామన్నారు.గత శతాబ్దం 90దశకలలో దేశంలో ఐటి విప్లవానికి ఆంధ్రప్రదేశ్ కీలకంగా నిలిచిందని, ఇప్పుడు దేశంలో క్వాంటమ్ విప్లవానికికూడా నాయకత్వం వహిస్తుందని అన్నారు. ఐబిఎం, టిసిఎస్, ఎల్ అండ్ టితో జరిగినఒప్పందం ఈ రోజు ఆంధ్రప్రదేశ్‌కే కాదు, భారతదేశానికి కూడా చారిత్రాత్మకం అని ముఖ్యమంత్రి అన్నారు. క్వాంటమ్ కంప్యూటింగ్ భవిష్యత్ పాలనకు, ఆవిష్కరణలకు పునాది అవుతుందని చెప్పారు. సాంకేతికరంగంలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, క్వాంటమ్ కంప్యూటింగ్ వంటి కొత్త అవకాశాలు వస్తున్నాయని, అయితే వాటిని అందిపుచ్చుకోవడం ముఖ్యమని సిఎం చంద్రబాబు అన్నారు. భవిష్యత్ అవసరాలన్నీ క్వాంటం కంప్యూటింగ్‌పైనే ఆధారపడి ఉంటాయని అందుకే అమరావతిని క్వాంటం వ్యాలీ చేయాలనుకున్నట్టు ముఖ్యమంత్రి చెప్పారు. సిలికాన్ వ్యాలీ తరహాలో క్వాంటం వ్యాలీగా అమరావతిని తీర్చిదిద్దాలని ఐబిఎం, టిసిఎస్ సంస్థల ప్రతినిధులకు మనం సూచించామన్నారు. అందుకు వారు అంగీకరించారు. హైటెక్ సిటీని 15 నెలల్లో నిర్మించిన అనుభవాన్ని గుర్తుచేస్తూ, క్వాంటమ్ వ్యాలీ తక్కువ సమయంలోనే నిర్మించవచ్చున్నారు. ఇప్పటికే ఎల్ అండ్ టీకి స్థలాన్ని కేటాయించామని, మౌలిక వసతులను అత్యంత వేగంగా అభివృద్ధి చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇందుకోసం రెండు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.

ఒక కమిటీ నిర్మాణం పురోగతిని పరిశీలిస్తే, మరొక కమిటీ వ్యవస్థ అభివృద్ధిపై దృష్టి సారిస్తాయని చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి త్వరలోనే ఈ ప్రాజెక్టును సవివరంగా తెలియజేస్తామన్నారు. భారతదేశంలో ఐబిఎం క్వాంటం సిస్టం 2 స్థాపన, దేశ క్వాంటం ప్రయాణానికి కీలక మలుపు కానుందని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం టిసిఎస్‌తో కలిసి పని చేయడం వల్ల క్వాంటం >>2



## ఎపి నుంచి అబుదాబికి విమాన సర్వీసులు

**విజయవాడ మే11 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర ప్రజలకు గుడ్‌న్యూస్ ఆంధ్రప్రదేశ్ నుంచి అబుదాబి, బెంగుళూరు, భువనేశ్వర్ ప్రాంతాలకు కొత్త విమాన సర్వీసులు అందుబాటులోకి రానున్నాయి. ఈ విషయాన్ని కేంద్ర విమానయాన శాఖమంత్రి రామ్మోహన్ నాయుడు ప్రకటించారు. విమానయాన సర్వీసుల విస్తరణతో రాష్ట్రమంతటా కనెక్టివిటీని పెంచేందుకు కొత్త విమానాలను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. విశాఖపట్నం- అబుదాబి మధ్య జూన్ 13 నుంచి విమాన సర్వీసులు ప్రారంభమవుతాయని మంత్రి వెల్లడించారు. ఈ విమాన సర్వీసులు వారానికి నాలుగు రోజుల పాటు నడుస్తాయని పేర్కొన్నారు. >>2

## శ్రీలంకలో ఘోర ప్రమాదం

### బస్సు లోయలో పడి 21 మంది దుర్మరణం

### 30 మందికి పైగా తీవ్ర గాయాలు



**కొలంబో, మే 11:** శ్రీలంకలో పెనువిషాదం చోటుచేసుకుంది. కోట్మాలేలోని కరండీ ఎల్లా ప్రాంతంనుంచి 78 మందిప్రయాణీకులతో వెళుతున్న బస్సు లోయలో పడిపోయింది. ఈ రోడ్డు ప్రమాతంలో 21 మంది ప్రయాణీకులు మరణించగా 30 మందికిపైగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు రక్షణ బృందాలు ఆప్రాంతానికిచేరుకుని గాయపడిన క్షతగాత్రులను అత్యవసరచికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించారు. మరోవైపు పరిమితికి మించి ప్రయాణీకులతో వెళ్లడంవల్లనే ప్రమాదంచోటుచేసుకుందని ప్రత్యక్ష సాక్షులు చెపుతున్నారు. ప్రమాదంజరిగే సమయంలో బస్సులో >>2



ఆదివారం వీరజవాన్ పార్థివ కాయానికి నివాళులర్పిస్తున్న డి.సిఎం పవన్, మంత్రులు లోకేష్ తదితరులు

## వీర జవాన్ కుటుంబానికి అండగా ప్రభుత్వం

### రూ.50 లక్షలు, 5 ఎకరాల స్థలం, ఓ ప్రభుత్వ ఉద్యోగం

### తల్లిదండ్రులను హత్తుకొని ఓదార్చిన పవన్

### పార్థివ దేహాన్ని మోసిన లోకేష్

### అమరజవాన్‌కు ఘనంగా నివాళులర్పించిన నేతలు

**శ్రీసత్యసాయి జిల్లా, మే 11, ప్రభాతవార్త ప్రతినిధి:** వీర జవాన్ మురళీ నాయక్ కుటుంబానికి కూటమి ప్రభుత్వం అండదండగా ఉంటుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌లు భరోసా ఇచ్చారు. ఆదివారం శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ నియోజకవర్గంలోని గోరంట్ల మండలం కల్లితండాలో పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధంలో అసువులు బాసిన అమర జవాన్ మురళీనాయక్ అంత్యక్రియల్లో వారితో పాటు హోం మంత్రి వంగలపూడి అనిత, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, బిసి సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ, ఎంపి బి.కె.పార్థసారథి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, కాలువ శ్రీనివాసులు, పల్లె సింధూర రెడ్డి, ఎం.ఎస్.రాజు, జె.సి.అస్మిత్ రెడ్డి, కందికుంట వెంకటప్రసాద్, అనంతపురం ఎమ్మెల్యే వెంకటేశ్వర ప్రసాద్, తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జె.సి. ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పాస్వామి, జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్, ఎస్పి వి.రత్న, కళాకారులు మంగ్లి తదితరులు అమర జవాన్‌కు నివాళులర్పించిన వారిలో ఉన్నారు. కాగా కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ 100 వాహనాల్లో తరలివచ్చి ఘనంగా నివాళులర్పించారు. దేశం కోసం ప్రాణాలర్పించిన వీరజవాన్ మురళీనాయక్ కుటుంబానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎల్లప్పుడూ అండగా ఉంటాయని వారుపేర్కొన్నారు. చిన్నప్పటి నుండే సైని >>2

# పలు నామినేటెడ్ పోస్టుల భర్తీ



ఆలపాటి సురేష్



గన్ని వీరాంజనేయులు



రాయపాటి శైలజ

### ప్రెస్ అకాడెమీ ఛైర్మన్‌గా ఆలపాటి సురేష్

### మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా రాయపాటి శైలజ

### ఆప్కాబ్ ఛైర్మన్‌గా గన్ని వీరాంజనేయులు

**విజయవాడ,మే12,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపి ప్రెస్ అకాడమీ ఛైర్మన్‌గా ఆలపాటి సురేశ్ (అమరావతి జెఎసి)ని నియమించింది. మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా రాయపాటి శైలజ (అమరావతి జెఎసి)ని ఎంపిక చేసింది..రాష్ట్రంలో నామినేటెడ్ పోస్టుల భర్తీ కొనసాగుతోంది. ఇప్పటికే పలు స్థానాలను భర్తీ చేసిన కూటమి ప్రభుత్వం ఇవాళ తాజాగా మరికొన్ని పదవులను భర్తీ చేసింది. ఆంధ్రప్రదేశ్ స్టేట్ కోఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ (ఆప్కాబ్) ఛైర్మన్‌గా మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు (టిడిపి) నియమితులయ్యారు. దీంతో పాటు పలు డిసిసిబి ఛైర్మన్ లను నియమించింది. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏలూరు జిల్లా డిసిసిబి (డిస్ట్రిక్ట్ కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్) ఛైర్మన్‌గానూ ఆయన బాధ్యతలు నిర్వర్తించనున్నారు. ఈ క్రమంలోనే మరికొన్ని నామినేటెడ్ పోస్టులను భర్తీ చేసింది. ఎపి ప్రెస్ అకాడమీ ఛైర్మన్‌గా ఆలపాటి సురేశ్ (అమరావతి జెఎసి)ని నియమించింది. ఏపీ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా రాయపాటి శైలజ (అమరావతి జేఏసీ)ని ఎంపిక చేసింది.

తాజాగా భర్తీ చేసిన నామినేటెడ్ ఛైర్మన్‌ల పోస్టులు ఇవే ఆంధ్రప్రదేశ్ ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ బోర్డు డా. జెడ్. శివప్రసాద్ (నెల్లూరు సిటీ) (టిడిపి), ఆంధ్రప్రదేశ్ విద్య, సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్ ఎస్. రాజశేఖర్ (కుప్పం) (టిడిపి), ఆంధ్రప్రదేశ్ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ సుగుణమ్మ (తిరుపతి) (టిడిపి), ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వాణి వెంకట శివ ప్రసాద్ పెన్నుబోయిన (ఏలూరు) (టిడిపి), ఆంధ్రప్రదేశ్ ఎన్ఆర్టీ సొసైటీ రవి వేమూరు (తెనాలి) (టిడిపి), ఆంధ్రప్రదేశ్ అగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ మలేపాటి సుబ్బానాయుడు (కావలి) (టిడిపి), ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కమిషన్ కె.ఎస్.జవహర్ (కొవ్వూరు)(టిడిపి), ఆంధ్రప్రదేశ్ కార్మిక సంక్షేమ బోర్డు వెంకట శివుడు యాదవ్ (గుంతకల్)(టిడిపి), ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణ కార్మికుల బోర్డు వలవల బాబ్జీ (తాడేపల్లిగూడెం) (టిడిపి), ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి కార్పొరేషన్ బురుగుపల్లి శేషారావు (నిడదవోలు) (టిడిపి), ఆంధ్రప్రదేశ్ మహిళల సహకార ఆర్థిక కార్పొరేషన్ పీతల సుజాత (భీమవరం) (టిడిపి), తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ దివాకర్ రెడ్డి (తిరుపతి) (టిడిపి), ఆంధ్రప్రదేశ్ >>2

# సిబిఐ వలలో ఆదాయపన్ను శాఖ కమిషనర్

### నిందితుడు మాజీ ఎమ్మెల్యే కుమారుడు

### రూ.70 లక్షల లంచం కేసులో మొత్తం ఐదుగురు అరెస్ట్

### సోదాల్లో మరో రూ.69 లక్షలు స్వాధీనం

**విజయవాడ,మే 11,ప్రభాతవార్త ప్రతినిధి:** సిబిఐ అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఒక ఆదాయపన్ను శాఖాధికారి లంచం కేసులో ఏకంగా ఆదాయపన్ను శాఖ కమీషనర్ అరెస్ట్ అయ్యారు. ప్రైవేటు సంస్థలకు అనుకూలంగా వ్యవహరించేందుకు రూ.70లక్షల లంచం తీసుకున్న కేసులో హైదరాబాద్ ఆదాయపన్ను శాఖ కమీషనర్ (మినహాయింపుల విభాగం), మాజీ ఎంఎల్ఎ రాములు నాయక్ కుమారుడు జీవన్‌లాల్ లావుడ్యాతో పాటు శ్రీకాకుళానికి చెందిన సాయిరాం పాలిశెట్టి, విశాఖకు చెందిన నట్ట వీరనాగా శ్రీరాం గోపాల్, ముంబయి షాపూర్‌జీ పల్లోంజీ గ్రూప్ డిజిఎం (టాక్సేషన్) విరాల్ కాంతిలాల్ మెహతా, ముంబయి చెంబూరుకు చెందిన సాజిదా మజహర్ హుస్సేన్‌షా కటకటాల పాలయ్యారు. వివరాల్లోకి వెళ్తే...జీవన్‌లాల్ లావుణ్యా హైదరాబాద్ ఆదాయపన్ను శాఖ కమీషనర్‌గానే కాకుండా హైదరాబాద్ ప్రిన్సిపల్ చీఫ్ కమీషనర్ కార్యాలయంలో అప్పీల్స్ యూనిట్-7, 8లకు కమిషనర్‌గానూ పనిచేస్తున్నారు. ప్రైవేటు సంస్థలకు సంబంధించిన అప్పీళ్లు కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో వారికి అనుకూలంగా వ్యవహరించేందుకు >>2

# అమరావతిలో క్వాంటం వ్యాలీ

>> అల్గోరిథం అభివృద్ధి వేగవంతం అవుతుందని ఐబిఎం క్వాంటం వైస్ ప్రెసిడెంట్ జే గాంబెట్టా అన్నారు. క్వాంటం, క్లాసికల్ సిస్టమ్‌లను కలిపిన హైబ్రిడ్ కంప్యూటింగ్ ద్వారా జీవశాస్త్రం, మెటీరియల్స్, క్రిప్టోగ్రఫీ వంటి రంగాల్లో విప్లవాత్మక ఫలితాలు సాధించవచ్చని ఇది ఒక కీలక ఘట్టమని టిసిఎస్ సిటిఒ డాక్టర్ హారిక్ విన్ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో టిసిఎస్ తొలిసారి రాష్ట్రంలో డిజిటల్ గవర్నెన్స్‌కు బీజం వేసిందని టిసిఎస్ ప్రతినిధులు వి. రాజన్న, సి.వి. శ్రీధర్ గుర్తు చేశారు. క్వాంటం వ్యాలీ ద్వారా పరిశోధన, అభివృద్ధి మరింత ముందుకు సాగుతుందని చెప్పారు. క్వాంటం కంప్యూటింగ్ అనేది రెండో క్వాంటం విప్లవమని, ఇవి బ్యాటరీల నుంచి ఆర్థిక వ్యవస్థ వరకు దీని ఉపయోగాలు విస్తృతంగా ఉంటాయని ఐబిఎం వైస్ ప్రెసిడెంట్ స్కాట్ క్రౌడర్ అన్నారు. తాజా ఒప్పందంతో అమరావతిలో క్వాంటం వ్యాలీ ఏర్పాటుకు తొలి అడుగు పడినట్టయ్యింది. క్వాంటం కంప్యూటింగ్ పరిశోధనలకు ఆంధ్రప్రదేశ్‌ను జాతీయ కేంద్రంగా మార్చడం ద్వారా పెద్దఎత్తున పెట్టుబడులను ఆకర్షించాలనేది రాష్ట్ర ప్రభుత్వ ప్రయత్నం. సూక్ష్మ, మధ్య తరగతి పరిశ్రమలను మన ప్రోత్సహిస్తున్నారు. మరో 14 ఎఫ్‌ఎఫ్‌సీ (ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్)లు, 25 కొత్త ఎంఎస్‌ఎంఈ పార్కులకు కూడా ముఖ్యమంత్రి శంకుస్థాపన చేసామన్నారు. మొత్తం 546 ఎకరాల్లో ఏర్పాటు చేసే 14 ఎఫ్‌ఎఫ్‌సిలకు రూ.359 కోట్లు వ్యయం కానుంది. అలాగే 1,455 ఎకరాల్లో ఏర్పాటు చేసే 25 కొత్త ఎంఎస్‌ఎంఇ పార్కులకు రూ.559 కోట్లు ఖర్చు అవుతుంది. మొత్తం 40 నియోజకవర్గాల్లో మొదటి దశలో ఎంఎస్‌ఎంఇ పార్కులు అభివృద్ధి చేయాలనేది టార్గెట్. ఇటీవలే ఒకే రోజు రూ.49,000 కోట్ల విలువైన 74 పనులకు శంకుస్థాపన చేసుకున్నా వీటికి అదనంగా రూ.5,028 కోట్లతో చేపట్టే 9 కేంద్ర ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. అలాగే, రూ.3,680 కోట్లతో నిర్మాణం పూర్తి చేసుకున్న 8 జాతీయ రహదారులను ప్రధాని ఈ రోజు ప్రారంభించారు. మరో రూ.254 కోట్లతో నిర్మించిన 3 రైల్వే ప్రాజెక్టులను జాతికి అంకితం చేశారు. అమరావతి, కేంద్ర ప్రాజెక్టులు కలిపి మొత్తం రూ.57,962 కోట్ల విలువైన 94 ప్రాజెక్టులకు ఈరోజు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. వరల్డ్ క్లాస్ క్యాపిటల్ : బ్లూ అండ్ గ్రీన్ సిటీగా అమరావతి ఉంటుంది. 30 శాతం ప్రాంతం పచ్చదనం, జలవనరులతో ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతాం. నవ నగరాలను రాజధానిలో భాగంగా ఉంటాయి. రాజధాని నిర్మాణానికి ప్రధాని మోడీ పలు సూచనలు చేశారు. వాటిని అమలుచేస్తాం.

ఇన్నర్ రింగ్ రోడ్, అవుటర్ రింగ్ రోడ్, భవిష్యత్ నగరంగా అమరావతి ఉంటుంది. గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్ పోర్టుతో అన్ని ప్రపంచ దేశాలకు కనెక్టివిటీ పెంచుతాం. ప్రపంచ స్థాయి సంస్థల ఏర్పాటుతో అమరావతి హెల్త్, ఎడ్యుకేషన్ హబ్‌గా ఉండబోతోంది. మోడీ సూచించిన జపాన్ మియావాకీ తరహా పచ్చదనం పెంచే విధానాన్ని అమలు చేస్తాం. అన్నీ వయాడక్ట్ పద్దతిలో అందిస్తాం. గ్రీన్ ఎనర్జీతో పర్యావరణ అనుకూలంగా రాజధానిఇన్ లాండ్ వాటర్ వేస్, సైక్లింగ్ ట్రాక్స్, డిస్ట్రిక్ట్ కూలింగ్ సిస్టం, వాకింగ్ పాత్ తీసుకువస్తాం. బిజినెస్ స్కూల్, గ్లోబల్ లీడర్‌షిప్ సెంటర్, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చ వికేంద్రీకరణ మన సిద్దాంతం. రాజధాని మాత్రమే కాదు26 జిల్లాల్లో ప్రతీ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తాం. అభివృద్ధి వికేంద్రీకరణ చేపడతాం. 2014-19 మధ్య కేంద్ర ప్రభుత్వ సంస్థలను అన్ని ప్రాంతాల్లో ఏర్పాటు చేశాం. కేంద్ర సహకారంతో 2027 నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తి చేస్తాం. రాష్ట్రంలో నదుల అనుసంధానం పూర్తి చేసి ప్రతి ఎకరాకు నీళ్లు ఇస్తామన్నారు. ఈ వేసవిలో మంచినీటి ఎద్దడి సమస్య తలెత్తదన్నారు.

# పాక్‌కు గట్టిగా బుద్ధి చెప్పాం

>> శిబిరాలను పాక్ టార్గెట్‌చేసిందని డిజిఎఓ భార్తి తెలిపారు. అయితే గైడెడ్ మిసైల్స్‌తో ఉగ్రవాదుల శిబిరాలన్నీ ధ్వంసంచేసామన్నారు. లాహోర్‌లోని పాక్ వైమానిక రక్షణ వ్యవస్థను మొత్తం నాశనంచేసామని భార్తి తెలిపారు. అదేవిధంగా మన నావల్‌బేస్, వైమానికబేస్‌లపై ఫోకస్ పెట్టడంతో తక్షణమే స్పందించి దాడులుచేయడంతోపాక్ వెనుకంజవేసిందని డైరెక్టర్‌జనరల్ నావల్ ఆపరేషన్స్ ఎఎన్‌ప్రమోద్ తెలిపారు. లాహోర్, గుజ్రన్‌వాలా రాడార్ కేంద్రాలను ధ్వంసంచేసామని, దాడులుచేసేందుకు పాకిస్థాన్ తన పౌరవిమానాలను కవచంగా వాడుకుని దాడులకు తెగబడిందని చెప్పారు. భారత్ తన దాడులను ముమ్మరంచేసిన వేళ ముందుగా పాక్ డిజిఎంఒ కాల్పుల విరమణకు ప్రతిపాదించారని, శనివారం మధ్యాహ్నం 3.15 గంటలకు పాక్ డిజిఎంఒ మాకు ఫోన్ చేసారనిచెప్పారు. కాల్పుల విరమణకు అంగీకరించాలని పాక్‌ప్రాధేయపడిందని అందుకే విరమణకు అంగీకరించామని, అయితే మేం అంగీకరించినా ఆ తర్వాత మూడు గంటలకే సరిహద్దుల్లో పాక్ కాల్పులకు తెగబడిందని రాజీవ్‌ఘాయ్ తెలిపారు. శ్రీనగర్‌నుంచి నాలియా వరకూ పాకిస్తాన్ మానవరహిత డ్రోన్లతో దాడులుచేసిందని, వెంటనే పాక్ డిజిఎంఒను వివరణ కోరామని ఆయన తెలిపారు. మరోసారి ఇలా జరిగిందంటే తీవ్రంగా ప్రతిఘటిస్తామని స్పష్టంచేసామన్నారు. మా దాడుల్లో పాక్ యుద్ధవిమానాలను అధికసంఖ్యలోనే కూల్చివేసామని, అయితే మావద్ద స్పష్టమైన సమాచారం ఉన్నప్పటికీ ఇపుడు చెప్పలేమని నావల్ డిజి ప్రమోద్ చెప్పారు. పాకిస్తాన్‌చేసిన ప్రతిపాదనలతోనే మేం చర్చలకు అంగీకరించామని, సోమవారం డిజిఎంఒల స్థాయిలో హాట్‌లైన్‌లోనే చర్చలు జరుగుతాయని ముగ్గురు డిజిలు వెల్లడించారు. మొత్తం తాము దాడులు ప్రారంభించిన తర్వాత ఏడవ తేదీ నుంచి పదవ తేదీలోపు 40మందికిపైగా పాక్ జవాన్లు చనిపోయారని 100 మందికిపైగా ఉగ్రవాదులు హతమయ్యారని నావల్ డిజి ప్రమోద్ వెల్లడించారు. పాకిస్తాన్ మన నావల్, ఎయిర్‌బేస్‌లను లక్ష్యంగా చేసుకుంటున్నదన్న సమాచారంతో కరాచి పోర్టుపై దాడికి సిద్ధం అయ్యామని ఈలోపే పాక్ డిజిఎంఒనుంచి ప్రతిపాదన వచ్చిందన్నారు. ఆపరేషన్ సింధూర్‌ప్రారంభించిన తర్వాత దేశసేవలో మన ఐదుగురు సైనికులు ప్రాణత్యాగం చేసారన్నారు. డ్రోన్లు, మానవరహిత వాహికలతో పాక్ దాడులకు పాల్పడిందని, వాటన్నింటినీ మన రక్షణ వ్యవస్థలు నేలకూల్చాయన్నారు. కేవలం ఉగ్రస్థావరాలను మాత్రమే మనం లక్ష్యంగా దాడులుచేస్తే పాకిస్థాన్ మాత్రం సామాన్య పౌరులు, ప్రార్థనామందిరాలు, విద్యాసంస్థలపైనా దాడులుచేసిందని ప్రపంచం మొత్తం ఈ దాడులనుచూసిందన్నారు. ఉగ్రశిబిరాలను ధ్వంసంచేసిన తర్వాత ఆ విడియోలు కూడా విడుదలచేసామని ముగ్గురు డిజిలు స్పష్టంచేసారు. మళ్లీ కాల్పుల విరమణ ఉల్లంఘించిన పక్షంలో ప్రతిఘటించే కఠిన కార్యాచరణ అమలుకు తమకు పూర్తి స్వేచ్ఛ ఉందని వారుస్పష్టంచేసారు. మళ్లీ కాల్పులకు తెగబడితే పాకిస్తాన్ అంతుచూస్తామని వారు హెచ్చరించారు. భారత సైనికుల త్యాగాలు వృధాకానీయబోమని వారన్నారు. ఆదివారం రాత్రిపరిస్థితిని కూడా నిశితంగా పరిశీలిస్తున్నామన్నారు. సరిహద్దు రాష్ట్రాలు గుజరాత్; రాజస్థాన్, జమ్ముకాశ్మీర్, పంజాబ్‌లలోని మన స్థావరాలన్నీ పటిష్టంగా ఉన్నాయని మిలిటరీ ఆపరేషన్స్ డైరెక్టర్‌జనరల్ రాజీవ్‌ఘాయ్ తెలిపారు. సరిహద్దు రాష్ట్రాలన్నింటికంటే జమ్ముకాశ్మీర్ సరిహద్దులను మరింత భద్రతను పెంచామన్నారు. ఇప్పటివరకూ అవాంఛనీయ సంఘటనలు జరగకపోయినా ఆదివారం కూడా కట్టుదిట్టమైన భద్రత గస్తీకొనసాగుతుందని ముగ్గురు డిజిలు వెల్లడించారు.



వీరమరణం పొందిన బిఎస్‌ఎఫ్ సబ్ ఇన్స్‌పెక్టర్ మహమ్మద్ ఇంతియాజ్ భౌతిక కాయంవద్ద ఆదివారం జమ్ములో నివాళులర్పిస్తున్న కాశ్మీర్ గవర్నర్ మనోజ్ సిన్హా

## పోస్టుల భర్తీ

>> మత్స్యకారుల సహకార సంఘాల సమాఖ్య పెదిరాజు కొల్లు (నరసాపురం) (టిడిపి), ఆంధ్రప్రదేశ్ కుమ్మరి శాలివాహన సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ పేరేపి ఈశ్వర్ (విజయవాడ తూర్పు) (టిడిపి), ఆంధ్రప్రదేశ్ వడ్డెర సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ మల్లెల ఈశ్వరరావు (గుంటూరు పశ్చిమ)(టిడిపి), ఆంధ్రప్రదేశ్ టైలర్ అభివృద్ధి సహకార సమాఖ్య ఆకాసపు స్వామి (తాడే పల్లిగూడెం) (టిడిపి), ఆంధ్రప్రదేశ్ లైవ్‌స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ రియాజ్ (ఒంగోలు), (జనసేన), ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ పసుపులేటి హరి ప్రసాద్ (తిరుపతి) (జనసేన), ఆంధ్రప్రదేశ్ నీటిపారుదల అభివృద్ధి సహకార సంస్థ లీలకృష్ణ (మండపేట) (జనసేన), ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ ట్రైబ్స్ కమిషన్ సోల్ల బోజ్జి రెడ్డి (రంపచోడవరం) (బిజెపి)కి దక్కింది.

# తెలంగాణ ఎప్‌సెట్ ఫలితాలు విడుదల

## ఇంజనీరింగ్‌లో టాపర్‌గా ఎపికి చెందిన భరత్ చంద్ర

## అగ్రి, ఫార్మాలో టాపర్‌గా మేడ్చల్‌కు చెందిన సాకేత్‌రెడ్డి

**హైదరాబాద్,మే11:** తెలంగాణలో ఎప్‌సెట్ ఫలితాలు విడుదల అయ్యాయి. ఇంజనీరింగ్,అగ్రికల్చర్,ఫార్మా కామన్ ఎంట్రెన్స్ టెస్ట్-2025 ఫలితాలను రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆదివారం బటన్ నొక్కి విడుదల చేశారు. ఎప్‌సెట్ ఫలితాలు నేరుగా విద్యార్థుల రిజిస్టర్ మొబైల్ (సెల్‌ఫోన్) నంబర్‌కే వచ్చేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇంజనీరింగ్, ఫార్మా, అగ్రికల్చర్ కోర్సుల్లో సీట్ల భర్తీకి ఈ పరీక్షను జెఎన్‌టియు నిర్వహించింది. ఏప్రిల్ 29,30 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మా ప్రవేశ పరీక్షలు పూర్తవ్వగా, మే నెల 2, 3, 4 తేదీల్లో ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్షలను విజయవంతంగా పూర్తి చేశారు. పరీక్షలు జరిగిన వారం రోజుల్లోనే ఫలితాలు వచ్చాయి. ర్యాంకులతో పాటు మార్కులు విడుదల చేశారు.

ఫార్మా, అగ్రికల్చర్ విభాగంలో 81,198 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, ఇందులో 71,309(87.82శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. ఇంజినీరింగ్ విభాగంలో 2.07,190 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, ఇందులో 1,51,779 మంది(73.26శాతం)ఉత్తీర్ణత సాధించారు. ఎప్‌సెట్ ఫలితాలు తెలుసుకు నేందుకు అధికారిక వెబ్‌సైట్‌లోకి వెళ్లి చూసుకోవచ్చు. ఈసారి తెలంగాణ ఎప్‌సెట్ పరీక్షల్లో అబ్బాయిలే హవా కొనసాగించారు. ఎంట్రెన్స్‌లో ఉత్తీర్ణులైన విద్యార్థినీ విద్యార్థులకు,నిర్వాహకులకు ఈ సందర్భంగా ముఖ్య మంత్రి అభినందనలు తెలియజేశారు.

ఈ ఫలితాల విడుదల కార్యక్రమంలో తెలంగాణ ఉన్నతవిద్యామండలి చైర్మన్ ప్రొ.వి.బాలకృష్ణారెడ్డి, ఎప్‌సెట్ 2025 చైర్మన్ ప్రొ.టి.కిషన్ కుమార్‌రెడ్డి, కన్వీనర్ డా.బి.డీన్‌కుమార్‌తో పాటు విద్యాశాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా ఇంజ నీరింగ్ విభాగంలో టాప్ 10 ర్యాంకులలో అబ్బాయిలే తొలి స్థానాల్లో నిలిచారు. అగ్రికల్చర్,ఫార్మా విభాగంలో అబ్బాయిలు 9 ర్యాంకులు సాధించారు. ఇంజనీరింగ్‌లో టాపర్‌గా ఏపికి చెందిన భరత్ చంద్ర, అగ్రి,ఫార్మా టాపర్‌గా మేడ్చల్‌కు చెందిన సాకేత్‌రెడ్డి నిలిచారు. మరోవైపు రెండు రోజుల్లోనే ఎప్‌సెట్ కౌన్సిలింగ్ షెడ్యూల్ విడుదల చేసేందుకు ఉన్నత విద్యామండలి సన్నాహకాలు చేస్తోంది. దీనిపై త్వరలోనే ప్రకటన చేయనున్నారు.

**ర్యాంకులు వరుసగా :** తెలంగాణ ఎప్‌సెట్ ఇంజినీరింగ్ ఫలితాల్లో ఏపీలోని పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడకు చెందిన పల్లా భరత్ చంద్ర (మార్కులు 150.05) మొదటి ర్యాంకు సాధించాడు. రంగారెడ్డి జిల్లా మాదాపూర్‌కు చెందిన ఉదగండ్ల రామచరణ్ రెడ్డి (మార్కులు 148.28) రెండో ర్యాంకు సాధించాడు. మూడో ర్యాంకులో హేమసాయి సూర్య కార్తీక్(మార్కులు 147.08),(విజయనగరం ఏపీ) ఉన్నారు. మెండె లక్ష్మి భార్గవ్(మార్కులు 146.15) (నాచారం)కు 4వ ర్యాంకు, మంత్రిరెడ్డి వెంకట గణేశ్ రాయల్(మార్కులు 144.05) (మాదాపూర్)కు ఐదో ర్యాంకు,సుంకర సాయి రిషంత్‌రెడ్డి (మార్కులు 143.05) (మాదాపూర్)కి 6వ ర్యాంకు, రుష్మిత్ బండారి(మార్కులు 142.58) (మాదాపూర్)కి 7వ ర్యాంకు, బానిబ్రాట మాజీ(మార్కులు 141.08) (బడంగ్‌పేట్)కి 8వ ర్యాంకు, కొత్త ధనుష్ రెడ్డి(మార్కులు 140.24) (హైదరాబాద్)కి 9వ ర్యాంకు, కొమ్మ శ్రీకార్తీక్ (మార్కులు 138.25) (మేడ్చల్)కు 10వ ర్యాంకులు వచ్చాయి.

**అబ్బాయిలే టాప్ :** అగ్రికల్చర్, ఫార్మా విభాగంలో అబ్బాయిలే పైచేయి సాధించారు. మొదటి పది ర్యాంకుల్లో కేవలం ఒక్క విద్యార్థిని మాత్రమే ఉండటం గమనార్హం.

అగ్రికల్చర్, ఫార్మా ఫలితాల్లో పి.సాకేత్‌రెడ్డి(మార్కులు 141.69) (మేడ్చల్)కు మొదటి ర్యాంకు, సబ్బాని లలిత్ వరేణ్య(మార్కులు 140.48) (కరీంనగర్)కు 2వ ర్యాంకు, చందా అక్షిత్(మార్కులు 140) (వరంగల్)కు 3వ ర్యాంకు, పి.ఆర్.శాయినంద్(మార్కులు 138.82) (కొత్త కోట, వనపర్తి)కు 4వ ర్యాంకు, రెండ్ల బ్రాహ్మణి(మార్కులు 138.71) (మాదాపూర్)కి 5వ ర్యాంకు, గుమ్మడిదల తేజస్ (కూకట్‌పల్లి)కు 6వ ర్యాంకు, కె.అఖిరానంద్‌రెడ్డి (నిజాంపేట)కి 7వ ర్యాంకు, భానుప్రకాశ్‌రెడ్డి (సరూర్‌నగర్)కి 8వ ర్యాంకు, ఎ.శామ్యూల్ సాత్విక్ (హైదర్‌గూడ) 9వ ర్యాంకు, అద్దుల శశి కిరణ్‌రెడ్డి (బాలాపూర్)కి 10వ ర్యాంకులు వచ్చాయి.

## 13 న కళ్లి తండా కు జగన్ రాక

**హిందూపురం మే 11 ప్రభాతవార్త:** భారత పాకిస్తాన్ యుద్ధంలో అమరుడైన వీర జవాన్ మురళి నాయక్ కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు ఈనెల 13న కళ్ళి తండకు వైఎస్సార్సీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి రానున్నట్లు ఆ పార్టీ హిందూపురం నియోజకవర్గ ఇన్చార్జి దీపిక వేణు రెడ్డి తెలిపారు. ఉదయం 9:30 గంటలకు బెంగళూరులోని యలహంక నివాసం నుంచి జగన్ రోడ్డు మార్గంలో బయలుదేరి 11:30 గంటలకు కళ్లి తండకు చేరుకుంటారు. జవాన్ కుటుంబ సభ్యులను పరామర్శించిన తర్వాత 12:30 గంటలకు తిరిగి బయలుదేరి బెంగళూరుకు వెళ్తారని తెలిపారు.

## విమాన సర్వీసులు

>>అలాగే విశాఖ-భువనేశ్వర్ విమాన సర్వీసు జూన్ 12 నుంచి ప్రారంభం కానున్నట్లు తెలిపారు. ఈ సర్వీసుల ద్వారా ఎపి, ఒడిశా మధ్య సంబంధాలు బలోపేతమవుతాయని పేర్కొన్నారు. విజయవాడ- బెంగుళూరు మధ్య ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్‌సర్వీసులు జూన్ 2 నుంచి ప్రారంభమవుతాయని మంత్రి తెలిపారు. ఈ సర్వీసుల ద్వారా ఎపి రాజధాని ప్రాంతాన్ని భారతదేశంలోని ప్రధాన టెక్ హబ్‌లలో ఒకటైన బెంగళూరుకు అనుసంధానం కావొచ్చని తెలిపారు.

## 21 మంది దుర్మరణం

>> పరిమితికిమించి ప్రయాణీకులు ఉండటం, కొట్మాలే ప్రాంతంలో బస్సు అదుపు తప్పి లోయలో పడిందని చెవుతున్నారు. కేసు నమోదుచేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. బస్సు ప్రమాదానికి గల కారణాలను అన్వేషిస్తున్నారు. కొలంబోనుంచి 140 కిలోమీటర్ల దూరంలో ఈప్రమాదం జరిగింది. శ్రీలంకలో ఉన్న ఎక్కువ పర్వతప్రాంతాల నడుమ ఈ ప్రమాదం జరిగింది. రవాణా ఉప మంత్రి ప్రసన్న గుణసేన మాట్లాడుతూ 21 మంది చనిపోయారని, 14 మందిని ఆసుపత్రిల్లో చేర్పించినట్లు చెప్పారు. ప్రమాదంలో డ్రైవర్‌కూడా తీవ్రంగా గాయపడ్డాడు. సుమారు 70మందివరకూ ఈబస్సులో ఉన్నట్లు తేలింది. ప్రభుత్వ అధీనంలోని రవాణా సంస్థ బస్సు అని పోలీసులు ధృవీకరించారు. శ్రీలంకలో రోడ్డుప్రమాదాలు తరచూ జరుగుతున్నాయి. పర్వతప్రాంతాల్లో వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలుజరుగుతుంటే, నిర్లక్ష్యపు డ్రైవింగ్ వల్లకూడా జరుగుతున్నాయి. అలాగే రోడ్ల మరమ్మతులు లేకపోవడం, ఇరుకురోడ్లుకూడా ప్రమాదాలకు కారణం అవుతున్నాయి.

## క్షిపణి ప్రయోగమే

>> అవసరంలేదని సూటిగా చెప్పినట్లయింది. ఆపరేషన్ సిందూర్‌పై ప్రధానిమోడీ అధ్యక్షతన ఆదివారం జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్, విదేశాంగమంత్రి ఎస్ జైశంకర్, ఎన్‌ఎస్‌ఎ అజిత్‌దోవల్; సిడిఎస్‌తోపాటు త్రివిధ దళాల అధిపతులు హాజరయ్యారు. ఈ సమావేశంలో ప్రధానిమోడీ పివోకే పరంగా ప్రపంచ దేశాలకు ఒసందేశాన్ని పంపించారు. అదేసమయంలో పాక్‌కు గట్టిగా బదులివ్వాలని త్రివిధ దళాలకు ఆదేశాలివ్వడం సంచలనంగా మారింది. తదనంతరం సరిహద్దుల్లోని ప్రస్తుతపరిస్థితిపైనా సమావేశంలో సమీక్ష జరిగింది. కాల్పుల విరమణపై సోమవారం జరిగే డిజిఎంఒల హాట్‌లైన్ సమావేశంలో అనుసరించాల్సిన వ్యూహం, ప్రతిపాదించాల్సిన అంశాలపైనా సమగ్ర చర్చలుజరిగాయి. ప్రత్యేకించి సరిహద్దు రాష్ట్రాల్లో ఏచిన్న పాటి పేలుడు జరిగినా తీవ్రస్థాయిలో బుద్ధిచెప్పాలని త్రివిధ దళాలకు ప్రధాని స్వేచ్ఛనిచ్చినట్లు తేలింది.

## వారం - వర్జ్యం

తేది : 12-05-2025, సోమవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
వైశాఖ మాసం, ఉత్తరాయణం,
వసంత ఋతువు, కృష్ణ పక్షం
పౌర్ణమి రా.10.24
స్వాతి ఉ.6.17
వర్జ్యం మ.12.33-2.20
దు.మ.12.31-1.22, 2) మ.3.06-3.57
శుభ సమయం : ఉ.9.15-9.55
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం:** పనులలో జాప్యం జరిగినా నిదానంగా పూర్తి చేస్తారు. ఆకస్మిక ప్రయాణాలలో తొందరపాటు వద్దు.

**వృషభం :** కుటుంబ సభ్యులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించు కుంటారు. ఆర్థిక పరిస్థితులు నిరుత్సాహపరుస్తాయి.

**మిథునం:** వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగాలలో కొత్త సమస్యలు ఎదురై చికాకులు పెడతాయి.

**కర్కాటకం:** ఆర్థిక లావాదేవీలు మందకొడిగా ఉంటాయి. ప్రయాణాలు వాయిదావేస్తారు. వస్తుసేకరణ.

**సింహం:** పనులు ముందుకు సాగవు. కుటుంబంలో బాధ్యతలు పెరిగినా సమర్థవంతంగా నిర్వహిస్తారు. వాహనసౌఖ్యం.

**కన్య :** గృహనిర్మాణ ఆలోచనలు కార్యరూపం దాల్చవు. వ్యాపారాలలో ఆటంకాలు ఎదురైన అధిగమిస్తారు.

**తుల :** ఉద్యోగాలలో కొన్ని మార్పులు తప్పవు. నూతన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. వస్తు, వస్త్రాలు కొనుగోలు.

**వృశ్చికం:** దూరప్రాంతాల నుండి శుభవార్తలు అందుకుంటారు. జీవిత భాగస్వామి నుండి ధనలాభం పొందుతారు.

**ధనుస్సు:** ప్రయాణాలలో నూతన పరిచయాలు పెరుగుతాయి. కీలక నిర్ణయాలలో సొంత ఆలోచనలు శ్రేయస్కరం.

**మకరం:** వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగాలలో పదోన్నతులు, హోదాలు పొందుతారు. ధన, వస్తు లాభాలు.

**కుంభం:** పనులలో జాప్యం జరిగినా నిదానంగా పూర్తిచేస్తారు. దూరప్రాంతాల నుండి విలువైన సమాచారం అందుకుంటారు.

**మీనం:** కుటుంబ సభ్యులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. ఆలయాలు సందర్శిస్తారు, వస్తుసేకరణ.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్


వీర జవాన్ పార్థీవ దేహాన్ని భుజంపై మోస్తున్న మంత్రి నారాలోకేష్

# అండగా ప్రభుత్వం

>> కుడు కావాలని మురళీనాయక్ కలలు కనడం, తాను చనిపోతే జాతీయ జెండా కప్పుకొని చనిపోతానని చెప్పడం చూస్తే దేశభక్తిపై అతనికి ఉన్న మమకారమేమిటో అర్థమౌతుందన్నారు. ఈ కుటుంబానికి ఒక్కగానొక్క కుమారుడు కావడం, చిన్నప్పటి నుండి వారి అవ్వతాతల దగ్గరనే పెరిగిన యువజవాన్ చిన్న వయస్సులోనే మరణించడం బాధాకరమన్నారు. మురళీనాయక్ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.50 లక్షల పరిహారం, 5 ఎకరాల పొలం, 300 గజాల ఇంటి స్థలం, తండ్రికి ప్రభుత్వ ఉద్యోగంను క్యాబెనెట్‌లో చర్చించి ఇవ్వనున్నట్లు మంత్రులు వెల్లడించారు. డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ వ్యక్తి గత సహాయం క్రింద రూ.25 లక్షలను ప్రకటించారు. జిల్లా కేంద్రంలో మురళీనాయక్ స్మారకంను ఏర్పాటు చేస్తామన్నారు. అంతకు మునుపు బిసి వెల్ఫేర్ మంత్రి అయిన సవిత రూ.5 లక్షల రూపాయల చెక్కును ఆ కుటుంబానికి అందజేశారు. పవన్ కల్యాణ్ వీరజవాన్ తల్లిదండ్రులైన శ్రీరామ్‌నాయక్, జ్యోతిబాయిలను అక్కున చేర్చుకొని ఓదార్చారు. అదే విధంగా విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ సైతం తల్లిదండ్రులను పరామర్శించి ధైర్యంగా ఉండాలని ఓదార్చారు. అమరజవాన్ మురళీనాయక్ పార్థీవ దేహాన్ని నారాలోకేష్ భుజంపై మోసి ఆయనే దగ్గరుండి ప్రభుత్వ అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. మురళీనాయక్ స్నేహితులు, బంధువులను సైతం ఆయన పరామర్శించారు. యుద్ధానికి ముందు వీరజవాన్ మురళీనాయక్ బంధువులు, స్నేహితుడు రాజశేఖర్‌తో జరిపిన వాట్సాప్ చాట్‌ను పరిశీలించారు. మురళీ నాయక్ వ్యవసాయ క్షేత్రంలో అంత్యక్రియలు పూర్తి చేశారు. వీరజవాన్ అంత్యక్రియల్లో పాల్గొనేందుకు భారీ ఎత్తున వేలాదిగా ప్రజలు తరలి రావడంతో ఆ ప్రాంతమంతా క్రిక్కిరిసి పోయింది. ప్రముఖుల రాకతో ఆ ప్రాంతంలో ఎస్పి వి.రత్న దగ్గరుండి భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## మదర్స్ డే సందర్భంగా శుభాకాంక్షలు

### మానవ వనరుల శాఖా మంత్రి నారా లోకేష్

**విజయవాడ,మే11,ప్రభాతవార్తప్రతినిధి:** అంతర్జాతీయ మాతృదినోత్సవం సందర్భంగా ఎక్స్ వేదికగా ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ కీలక ట్వీట్ చేసారు. నన్ను ఈ లోకానికి పరిచయం చేసింది అమ్మ. నడిపించిందీ, నడత నేర్పిందీ అమ్మే. ఓడినా, గెలిచినా వెంట నిలిచిందీ అమ్మే. ఈ జీవితం ఇచ్చిన అమ్మకు మదర్స్ డే సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. ప్రతీబిడ్డకు నిత్యస్ఫూర్తి మాతృమూర్తి. సహనం, త్యాగం, ప్రేమ మూర్తీభవించిన తల్లులందరికీ మదర్స్ డే సందర్భంగా పాదాభివందనం చేస్తున్నాను.

## రేషన్ కార్డులకు పాత దరఖాస్తులే

**విజయవాడ మే 11 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపిలోలో ఎన్డీయే ప్రభుత్వం పట్టుదలతో అభివృద్ధి లక్ష్యంగా అడుగులు వేస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసే దిశగా వేగంగా ముందుకెళ్తున్నారు. ఈ క్రమంలో ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్న అంశాల్లో కొత్త రేషన్ కార్డుల జారీ. తాజాగా ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. గత వైఎస్సార్సీ ప్రభుత్వ హయాంలో రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసిన వారు మళ్లీ అప్లై చేయాల్సిన అవసరం లేదని అధికార వర్గాలు వెల్లడించాయి. అప్పట్లో దాఖలైన దాదాపు 3.36 లక్షల అప్లికేషన్లు ప్రస్తుతం ప్రభుత్వ పరిశీలనలో ఉన్నట్లు పేర్కొన్నారు. ఇక మే 15 నుండి కొత్త రేషన్ కార్డుల కోసం మనమిత్ర అనే వాట్సాప్ సేవ ద్వారా దరఖాస్తులను స్వీకరించనున్నారు. మంత్రి నాదెండ్ల మనోహర్ ఈ విషయం కొద్ది రోజుల క్రితం ప్రకటించిన సంగతి తెలిసిందే. ప్రజలకు మరింత సులభతరంగా సేవలు అందించాలన్న దృష్టితో ఈ డిజిటల్ విధానం ద్వారా అప్లికేషన్ ప్రక్రియను తీసుకురావడం జరిగింది. జూన్ నెలలో కొత్త రేషన్ కార్డులను మంజూరు చేసే దిశగా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. దీనివల్ల అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ లబ్ధి సులభంగా చేరే అవకాశం ఉంటుంది.

## ఆదాయపన్ను శాఖ కమిషనర్

>> మధ్యవర్తుల ద్వారా లంచం డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై ఫిర్యాదు అందడంతో సిబిఐ బృందం శుక్రవారం జీవన్‌లాల్ సహా 14 మంది ప్రైవేటు వ్యక్తులు, సంస్థలపై కేసు నమోదు చేసింది. ఈ క్రమంలోనే ఓ ప్రైవేటు సంస్థ నుండి రూ.70లక్షల లంచం చేతులు మారుతోందనే పక్కా సమాచారంతో ముంబయిలో నిఘా ఉంచింది. శనివారం లంచం సొమ్మును మధ్యవర్తి తీసుకుంటున్న సమయంలో వల పన్ని పట్టుకుంది. విచారణ క్రమంలో ఆ సొమ్ము కమీషనర్ ఆదేశాల మేరకు తీసుకుంటున్నట్లు మధ్యవర్తి అంగీకరించడంతో ముంబయిలోనే అతడిని అరెస్ట్ చేసి అక్కడి సిబిఐ కేసుల ప్రత్యేక న్యాయస్థానంలో ప్రవేశపెట్టారు. మరోవైపు కమీషనర్‌తో పాటు మరో ముగ్గురుని హైదరాబాద్‌లో అరెస్ట్ చేసింది. జీవన్‌లాల్ తండ్రి,మాజీ ఎంఎల్‌ఏ రాములునాయక్ నివాసం(ఖమ్మం)సహా ముంబయి, హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, ఢిల్లీలోని 18 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించింది. మరో రూ.69 లక్షల నగదుతో పాటు కీలక పత్రాలను స్వాధీనం చేసుకుంది. దర్యాప్తు కొనసాగుతున్నట్లు సిబిఐ ఒక ప్రకటనలో వెల్లడించింది.

## లిక్కర్ కేసులో విచారణకు ఆ ముగ్గురు గైర్హాజరు

**విజయవాడ,మే11,ప్రభాతవార్తప్రతినిధి:** మద్యం కుంభకోణం కేసు దర్యాప్తును ముమ్మరం చేసింది. ఈ కేసులో నిందితులుగా ఉన్న కృష్ణమోహన్ రెడ్డి. ధనుంజయరెడ్డి, బాలాజీ గోవిందప్పలు ఆదివారం విచారణకు హాజరు కావాలని ఇటీవల అధికారులు నోటీసులు ఇచ్చారు. విజయవాడ సిట్ కార్యాలయానికి వచ్చి విచారణకు సహకరించాలని ఆ నోటీసులో పేర్కొన్నారు. నిందితులు ఆదివారం సాయంత్రం వరకు సిట్ కార్యాలయానికి చేరుకోలేదు. అసలు వస్తారా, గైర్హాజరవుతారా అనే అంశాలపై అధికారులలో చర్చ జరుగుతోంది. ఇప్పటి వరకు వారి నుంచి ఎటువంటి సమాచారం రాలేదని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే మద్యం కుంభకోణం కేసులో నిందితులకు సుప్రీం కోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ముగ్గురి ముందస్తు బెయిల్ పిటీషన్లను సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఎపి లిక్కర్ స్కాం కేసులో ఏ 31గా ధనుంజయ రెడ్డి, ఏ 32 కృష్ణ మోహన్ రెడ్డి, ఏ 33 గోవిందప్ప బాలాజీలను సిట్ అధికారులు చేర్చారు. ఇటీవల అరెస్ట్ అయిన కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, చాణక్య రిమాండ్ రిపోర్ట్‌లో కూడా ఈ ముగ్గురు పేర్లను సిట్ అధికారులు ప్రస్తావించారు. ఈ ముగ్గురి ఆదేశాల మేరకు అప్పట్లో డబ్బులు వసూలు చేశామని, ఈ డబ్బులు వాళ్ల వద్దకు చేరాయని విచారణలో నిందితులు పేర్కొన్నారు. ఈ రిమాండ్ రిపోర్టు ఆధారంగానే వాళ్ల పేర్లు చేర్చినట్లు మెమోలో సెట్ అధికారులు పేర్కొన్నారు.

## నేడు భారత్, పాక్ డిజిఎంఒల హాట్‌లైన్ చర్చలు

**న్యూఢిల్లీ, మే 11:** ఇండోపాక్ కాల్పుల విరమణపై మరోసారి సోమవారం మధ్యాహ్నం చర్చలు జరగనున్నాయి. ముందు తటస్త వేదికను నిర్ణయించి చర్చలుజరపాలని నిర్ణయించినా భారత్ అంగీకరించకపోవడంతో హాట్‌లైన్ విధానంలోనే చర్చలు జరపాలని నిర్ణయించారు. పాకిస్తాన్ వైపునుంచి ఆదేశ మిలిటరీ ఆపరేషన్స్ డైరెక్టర్‌జనరల్ కాషిఫ్ అబ్దుల్లా, భారత్‌వైపునుంచి మన దేశ మిలిటరీ ఆపరేషన్స్ డైరెక్టర్‌జనరల్‌రాజీవ్‌ఘాయ్‌లు పాల్గొంటారు. మధ్యాహ్నం 12 గంటలనుంచి కీలక చర్చలుజరగనున్నాయి. కాల్పులవిరమణ కొనసాగింపు, ఉద్రిక్తతలు తగ్గించడం, మరోసారి కాల్పుల విరమణ ఉల్లంఘన లేకుండా చర్యలు తీసుకోవడం వంటి అంశాలేప్రస్తావనకు వస్తాయి. ప్రధానిమోడీ అధ్యక్షతన జరిగిన సమీక్షలో ఆదివారం రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్,విదేశాంగమంత్రి ఎస్‌జైశంకర్, త్రివిధ దళాల అధిపతులు, ఎన్‌ఎస్‌ఎ అజిత్‌దోవల్‌లు పాల్గొన్నారు. ఆ తర్వాత మూడు విభాగాలకు చెందిన డైరెక్టర్‌జనరళ్లు ఆపరేషన్ సింధూర్ వివరాలను వెల్లడించారు. పాక్ ఉద్రిక్తతలను రెచ్చగొట్టడం, పహల్గాంవ్‌లో అమాయక పౌరులను హత్యచేసిన ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించడం పైనే భారత్ తీవ్రంగాపరిగణించింది. కేవలం ఉగ్రటార్గెట్లుమాత్రమే ధ్వంసంచేసామని, 100 మందికిపైగా హతులయ్యారని డైరెక్టర్ ఆపరేషన్స్ డిజిలు రాజీవ్‌ఘాయ్, ఎకెభార్తి, నేవల్ విభాగం డిజి ప్రమోద్‌లు వెల్లడించిన సంగతి తెలిసిందే. భవిష్యత్తులోకూడా ఏనిర్ణయం తీసుకోవా లన్నా తమకు పూర్తిస్వేచ్ఛ ఉందనిమరోసారి కాల్పులు విరమణ ఉల్లంఘిస్తే పాకిస్తాన్ అంతుచూస్తామని కూడా హెచ్చరించారు. ఈక్రమంలోనే సోమవారంమధ్యాహ్నం కాల్పుల విరమణపై చర్చలుజరగనున్నాయి.

# విజయవాడ గాంధీ హిల్‌కు మంచి రోజులు



గాంధీ కొండపై పరిశీలిస్తున్న అధికారులు,ఫౌండేషన్ బాధ్యులు

**విజయవాడ,మే11,ప్రభాతవార్తప్రతినిధి:** గాంధీ హిల్ ఫౌండేషన్ నూతన కమిటీ ఆధ్వర్యంలో ఇకపై గాంధీ హిల్ వేదికగా ఆ సంస్థ కార్యకలాపాలు జరుగుతాయని ఆ సంస్థ చైర్మన్ డా. గాంధీ పిసి కాజా తెలిపారు. ఆయన మాట్లాడుతూ మహాత్మా గాంధీ శతజయంతి ఉత్సవాల సందర్భంగా1968-69లో విజయవాడలో గాంధీ పర్వతాన్ని ప్రారంభించడం జరిగిందని, 1968 అక్టోబర్ 6 వ తేదీ గాంధీ స్థూపాన్ని అప్పటి భారత దేశాధ్యక్షులు డాక్టర్ జాకీర్ హుస్సేన్ ప్రారంభించారని, తదుపరి 1977 లో గాంధీ హిల్ ఫౌండేషన్ ఏర్పాటు చేయటం జరిగిందిని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ విభజన అనంతరం 2017లో గాంధీ హిల్ వద్ద నూతనంగా ఆంధ్రప్రదేశ్ గాంధీ స్మారక నిధి పేరుతో రిజిస్టరై, నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేసుకోవడం జరిగిందని తెలిపారు. అనంతరం ఆ సంస్థ కార్యదర్శి వై. రామచంద్రరావు మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటైన గాంధీ హిల్ ఫౌండేషన్ సమావేశం జరిగిందని. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ ఎక్స్ అఫిషియో మెంబర్లుగా పాల్గొన్న ఈ సమావేశంలో ఈ నూతన కమిటీకి డాక్టర్ గాంధీ పి.సి.కాజ అధ్యక్షులుగా, శ్రీ వై.రామచంద్రరావు కార్యదర్శిగా వ్యవహరిస్తారని వారితో పాటు డాక్టర్ జంధ్యాల శంకర్, డాక్టర్ రావి శారద, ఐ.ప్రసాద రాజు, శ్రీమతి రశ్మీ సమరం, డాక్టర్ జి.వి.మోహన ప్రసాద్ లతో కూడిన 11 మంది కమిటీ ఏర్పాటైంది తెలిపార ఈ సమావేశంలో ఒకప్పుడు విజయవాడ నగరానికే గర్వకారణంగా వున్న గాంధీ పర్వతం ప్రస్తుత పరిస్థితిని సమీక్షించారు. గాంధీ హిల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో, ఆ సంస్థ అభివృద్ధికి చేపట్టవలసిన పనులను, దశలవారీగా వివరించారు. తొలిదశలో (2025-2027) ప్రధాన ప్రాముఖ్యతగల ఉపయుక్తమైన కార్యక్రమాలను చేపట్టాలని నిర్ణయించారు. గాంధీ హిల్ సుందరీకరణలో భాగంగా ప్రధాన ఎంట్రన్స్ వద్ద ఆర్చి అందంగా తీర్చి దిద్దటం, లాండ్ స్కేపింగ్, ఎంట్రన్స్ నుండి స్థూపం వరకు ఉన్న అప్రోచ్ రోడ్డు సరిచేయటం, పిల్లలు ఆడుకునే పార్క్ ప్రాంతాన్ని సరిచేయటం, చుట్టుపక్కల ప్రాంతాన్ని అందంగా, ఆకర్షణీయంగా తీర్చిదిద్ది అత్యాధునిక ట్రైన్ ఏర్పాటుకు చక్కని రూపకల్పన చేసి సందర్శకులను ఆకర్షణగా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఇప్పటికే జర్మనీ టెక్నాలజీతో వి.ఎం.సి. వారు నూతనంగా ఏర్పాటు చేసిన ప్లానిటోరియం యువతకు, పెద్దలకు ఆకర్షణ నిలిచిందని అన్నారు. 2025 గాంధీ జయంతి నాటికి కొంత మార్పులు చేసి గాంధీ హిల్ పైన గాంధీ జయంతి వేడుకలను నిర్వహిస్తామని తెలిపారు. వి.ఎం.సి. తదితర స్థానిక ప్రభుత్వ సంస్థలతో, పారిశ్రామిక సంస్థలతో, జనరల్ పబ్లిక్ తో లీవీగే లు ఉంటాయని, ఆ సంస్థ బై లాస్ ప్రకారం గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి గారు గాంధీ పర్వత సంస్థకు చీఫ్ పాట్రన్ గా ఉంటారని, వారి గైడెన్స్, సలహాల మేరకు గాంధీ హిల్ ను స్థానిక, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ కేంద్రంగా అభివృద్ధి పరచడమే ఆశయమని తెలిపారు.

# తిరుమల సమాచారం

### టిటిడి జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు

## 15నుండి వెబ్‌సైట్ అందుబాటులోకి




**తిరుమల,మే 11ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలోని తిరుపతిలోని జూనియర్‌కళాశాల్లో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి తిరుపతిలోని పద్మావతి మహిళ జూనియర్ కళాశాల, శ్రీవేంకటేశ్వర జూనియర్ కళాశాలలో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థులనుండి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు టిటిడి విద్యాశాఖాధికారి టి.వెంకటసునీలు తెలిపారు. మేనెల 15వతేదీ నుండి 31వరకు పది ఉత్తీర్ణులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు ఆంగ్లభాషలో మాత్రమే ఉంది. విద్యార్థుల సౌకర్యార్థం యూజర్ మాన్యువల్ ఆయా కళాశాలల ప్రాస్పెక్టస్‌ను తెలుగు,ఆంగ్ల భాషల్లో అందుబాటులో ఉంచారు. విద్యార్థులు ' అడ్మిషన్ .తిరుమల. ఓఆర్‌జి' వెబ్‌సైట్‌ను ఓపన్‌చేసిన వెంటనే "స్టూడెంట్‌మాన్యువల్ ఇన్ ఇంగ్లీష్,లేక స్టూడెంట్ మాన్యువల్ ఇన్ తెలుగు"రెండు బాక్సులు కనిపిస్తాయి.విద్యార్థులు తమకు కావలసిన బాక్స్‌పై క్లిక్‌చేయాలి. దరఖాస్తు విధానం ఉంటుంది. కళాశాలల ఎంపిక, గ్రూప్‌లు, వాటిల్లోని సీట్లు, ప్రవేశానికి అర్హతలు, సీట్ల భర్తీవిధానం, మార్గదర్శకాలు తదితర వివరాలు కనిపిస్తాయి. గడువులోపు దరఖాస్తుల చేసుకున్న విద్యార్థులకు వారి ప్రతిభ,రిజర్వేషన్ ఆధారంగా ఆయా కళాశాలల్లో సీట్లు తాత్కాలికంగా ఆన్‌లైన్‌లో కేటాయించి విద్యార్థులకు ఎస్ఎంఎస్ పంపుతారు.విద్యార్థులు ఏదేని అనుమానాలున్నా హెల్ప్‌లైన్ నంబర్‌లో కూడా పరిశీలించుకోవచ్చు. ఇందులో సంబంధిత అద్యాపకుల ఫోన్‌నంబర్లు ఉంటాయి.

# మాజీ సైనికులు, రక్షణ శాఖ సిబ్బందికి ఆస్తి పన్నులో మినహాయింపు

**విజయవాడ,మే11,ప్రభాతవార్తప్రతినిధి:** గ్రామ పంచాయతీల పరిధిలోనివాసం ఉంటున్న మాజీ సైనికులు, రక్షణ శాఖ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు ఆస్తి పన్నులో రాష్ట్ర ప్రభుత్వం మినహాయింపు ఇస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ అంశంపై సైనిక సంక్షేమ అధికారి అభ్యర్థనను పరిశీలించిన అనంతరం ప్రభుత్వం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ 2003 నవంబరు 20న జారీ చేసిన ఉత్తర్వులకు సవరణ చేశారు. ఆయా పంచాయతీల పరిధిలో మాజీ సైనికులు, రక్షణశాఖ సిబ్బంది, వారి కుటుంబ సభ్యుల పేర్లతో ఒకటి కంటే ఎక్కువ ఆస్తులు ఉన్నప్పటికీ ఒక ఆస్తికి మాత్రమే పన్ను మినహాయింపు కల్పిస్తారు.

ఆస్తికి సంబంధించి అంతస్తులపై ఎటువంటి అభ్యంతరాలు లేనప్పటికీ ఆస్తి మొత్తం వారి ఆధీనంలో ఉండాలన్నారు. ఇతరులకు అద్దెకు ఇస్తే పన్ను మినహాయింపు వర్తించదని నిబంధనల్లో పేర్కొన్నారు. ఆయా పంచాయతీలో ఉన్న అసెస్మెంట్లలో ఇటువంటివి 10 శాతం కంటే ఎక్కువ ఉంటే మినహాయింపును 50 శాతానికి పరిమితం చేసే అధికారాన్ని పంచాయతీ పాలకవర్గాలకు కల్పించారు. ఇతర పంచాయతీల్లో 100 శాతం పన్ను మినహాయింపు వర్తిస్తుందని ఉత్తర్వుల్లో వెల్లడించారు.

### నల్లచెరువు వద్ద రోడ్డు ప్రమాదం

# కంటైనర్‌ను ఢీకొన్న కారు: ముగ్గురు మృతి



జయచంద్ర, నాగేంద్రుడు (ఫైల్)

**మదనపల్లెక్రైం, మే 11 ప్రభాతవార్త :** శ్రీసత్యసాయి జిల్లా నల్లచెరువు వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో మదనపల్లె పట్టణంకుకు చెందిన ముగ్గురు అన్నదమ్ములు దుర్మరణం చెందిన విషాదకర సంఘటన ఆదివారం జరిగింది. నల్లచెరువు మండలం పెద్ద ఎల్లంపల్లి 205 జాతీయ రహదారిపై కారు అగివున్న వున్న కంటైనర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంతో బిటి కళాశాల విశ్రాంత అధ్యాపకులు నాగేంద్రుడు (65), జయచంద్ర (72), చలపతి (74)లు మృతి చెందారు. అన్నదమ్ములు ముగ్గురు మృతి చెందటంతో ఆ కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. వివరాలిలా వున్నాయి. మదనపల్లె పట్టణం జడ్డీబంగ్లా వద్ద నివాసం వున్న మునస్వామి, సావిత్రమ్మ దంపతలకు చలపతి, జయచంద్ర, నాగేంద్రుడు ముగ్గురు కుమారులు. వీరిలో జయచంద్ర జడ్డీబంగా వద్ద నివాసం వున్నాడు. ఇతనికి భార్య సౌభాగ్య, కుమార్తె, కుమారులు వున్నారు. కుమార్తె అమెరికా వుండగా, కుమారుడు కెనడాలో వున్నారు. జయచంద్ర ప్రశాంత్‌నగర్‌లో నివాసం వున్నాడు. అతనికి భార్య శారద, కుమార్తె, కుమారుడులు వున్నారు. చలపతి తిరుపతిలో నివాసం వున్నారు. ఇతనికి భార్య లక్ష్మి, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు వున్నారు. ముగ్గురు అన్నదమ్ములు ఆదివారం అనంతపురంలో చిన్నాన కుమారుడు మృతి చెందటంతో అంత్యక్రియలకు హాజరుకావటానికి కారులో వెళ్లారు. అంత్యక్రియల అనంతరం తిరిగి ముగ్గురు తిరిగి మదనపల్లెకు వస్తుండగా మార్గమధ్యంలోని నల్లచెరువు వద్ద ఆగివున్న కంటైనర్‌ను ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ముగ్గురు మృతి చెందగా, ఇదే కారులో వున్న వేణుగోపాల్‌కు గాయాలైయ్యాయి. విషయం తెలిసిన నల్లచెరువు పోలీసులు సంఘటనా స్థలంకు చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి, మృతదేహాలను కదిరి ఆసుపత్రికి తరలించారు. విద్యారంగంలో విశేష కృషి చేసిన నాగేంద్రుడు మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు. ఒకే కుటుంబకు చెందిన అన్న దమ్ములు రోడ్డు ప్రమాదంలో మరణించటంతో పట్టణంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# 'అన్నదాత సుఖీభవ' ప్రతి కౌలురైతుకి ఇవ్వాలి

### కౌలు రైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు



**గూడూరు, మే 11 ప్రభాతవార్త:** అన్నదాత సుఖీభవ రూ.20,000లు ప్రతి కౌలు రైతుకు ఇవ్వాలని, పాత కౌలు చట్టాన్ని రద్దుచేసి, భూమి యజమాని సంతకంతో సంబంధం లేకుండా గ్రామ సభలు ద్వారా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ధాన్యం పొగాకు, మిర్చి, కోకో, అనేక రకాల పంటలకు మద్దతు ధరలు రాక రైతాంగం విల విల లాడుతున్నారని, చివరకు కూలీలను డబ్బులు కూడా ఇవ్వలేక భార్య మెడలో పుస్తెలు తాకట్టుపెట్టిన చాలక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఈ పరిస్థితుల్లో పెట్టుబడులు పెరిగి ఆరు కాలం కష్టపడి పండించిన పంట అమ్ముడుపోక, ధర రాక ఆందోళనతో రైతులు కౌలు రైతులు ఆత్మహత్యలకు పూనుకోరుకుంటున్నారని, ప్రభుత్వ అధికారులు చోద్యం చూస్తూ కాలయాపన చేయకుండా, రైతాంగ ప్రాణాలను కాపాడాలని, ఈ వ్యవసాయ సీజన్ ప్రారంభానికి ముందే పాత కౌలు రైతు చట్టాన్ని రద్దుచేసి, కొత్త కౌలు రైతు చట్టాన్ని తీసుకొని రావాలని, వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో జూన్ రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమానికి శ్రీకారం చుట్టడం జరుగుతుందని హెచ్చరించారు. గూడూరులోని సిఐటియు పార్టీ కార్యాలయంలో ఆదివారం మధ్యాహ్నం జరిగిన ఏపీ కౌలు రైతు సంఘం జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి గూడూరు డివిజన్ కౌలు రైతు సంఘం నాయకులు జోగి శివకుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం నెల్లూరుజిల్లా ఉపాధ్యక్షులు జి.లక్ష్మిపతి హాజరెయ్యారు. అనంతరం నూతన కమిటీని ఏర్పాటు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం గూడూరు డివిజన్ కన్వీనర్‌గా యదపర్తి దయాకర్ రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్ను కున్నారు. కమిటీ సభ్యులుగా సి.హెచ్ గోపాల్ రెడ్డి, డి. నారాయణరావు, రాంబాబు, గోపాల్, కే.రత్నయ్య, భాస్కర్, మస్తానమ్మ, జి.వేణు, తదితరులు కమిటీ సభ్యులుగా కొనసాగుతారు. ఈ కార్యక్రమంలో సి.ఐటియు పట్టణ అధ్యక్షులు బివి రమణయ్య, భవన నిర్మాణ కార్మిక సంఘం సీనియర్ నాయకులు పుట్టా శంకరయ్య, కెవిపిఎస్ నాయకులు ప్రసాద్, ముత్యాలయ్య, నారాయణ, ధనమ్మ,బి.చంద్రయ్య పాల్గొన్నారు.

# ప్రధాన రహదారులన్నీ రెండు వరుసలుగా విస్తరణ

**విజయవాడ,మే 11,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర ప్రధాన రహదారులన్నింటి రెండు వరుసలుగా విస్తరించేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.ఇందుకు ప్రణాళికనుసిద్ధం చేసింది. ఇకపై ఆర్అండ్‌బీలోని ప్రతి రాష్ట్ర రహదారి 2 వరుసలు (డబుల్ రోడ్లు)గా ఉండనుంది. దీనికయ్యే ఖర్చును 16వ ఆర్థిక సంఘం నిధుల నుంచి వెచ్చించాలని భావిస్తోంది. ఇందుకోసం ఇటీవల రాష్ట్రంలో పర్యటించిన 16వ ఆర్థిక సంఘం ఛైర్మన్‌కు ప్రతిపాదనలు కూడా అందజేసింది. ఆంధ్రప్రదేశ్ లో ఆర్అండ్‌బీ రహదారులు 12,653 కిలోమీటర్ల మేర ఉన్నాయి. వీటిలో ఇంకా 4450 కిలోమీటర్ల రోడ్లు ఏక వరుస (3.75 మీటర్ల వెడల్పు) లేదా మధ్యస్థంగా (5.5 మీటర్ల వెడల్పుతో) ఉన్నాయి. వీటిని కూడా రెండు వరుసలుగా (7 మీటర్ల వెడల్పు) చేయనున్నారు. ఇందుకుగాను మొత్తం రూ.17,800 కోట్లు ఖర్చవుతుందని ఆర్అండ్‌బీ ఇంజినీర్లు అంచనా వేశారు. మరోవైపు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కొన్ని ఆర్అండ్‌బీ రహదారులను గుంతలరహితంగా మార్చడంపై ఫోకస్ పెట్టింది. ఇందులో భాగంగా 20,058 కిలోమీటర్ల మేర గుంతలు పూడ్చేందుకు సీఎం చంద్రబాబు రూ.861.11 కోట్ల నిధులను మంజూరు చేశారు. నవంబర్ మొదటి వారంలో ఈ పనులకు శ్రీకారం చుట్టారు. వైఎస్సార్సీపీ హయాంలో రోడ్లను పట్టించుకోకుండా, గుంతలు పూడ్చేందుకు కూడా నిధులు కేటాయించలేదు.దీంతో రాష్ట్ర వ్యాప్తంగా రహదారులు అత్యంత ఘోరంగా మారాయి. రోడ్లపై అడుగుకో గుంతతో వాహనదారులకు ప్రత్యక్ష నరకం ఎలా ఉంటుందో చూపాయి. ప్రజల ఒళ్లు గుల్లవుతున్నా, వాహనాలు డొల్లగా మారుతున్నాసరే ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చూపిందనే ఆరోపణలు ఉన్నాయి రోడ్డుపైకి వెళ్లాలంటేనే వాహనదారులు భయపడే పరిస్థితి తీసుకొచ్చారు. దీంతో గుంతల రహదారుల నుంచి ఉపశమనం కల్పిస్తామని ఇచ్చిన ఎన్నికల హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుంది. అధ్వానంగా ఉన్న పలు రహదారుల్లో జనవరి చివరినాటికి పనులు పూర్తిచేయాలని సీఎం చంద్రబాబు లక్ష్యాన్ని నిర్దేశించారు.



లక్ష్మీనరసింహాస్వామికి ప్రత్యేక అభిషేకం

# లక్ష్మీనరసింహస్వామి జయంతి

**శ్రీకాళహస్తి,మే 11 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరాలయం సారథ్యంలో ఆదివారం లక్ష్మీనరసింహాస్వామి జయంతి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా భరద్వాజతీర్థంలో వెలసిన చెంచులక్ష్మీసమేత లక్ష్మీనరసింహాస్వామి ఆలయాన్ని గతంలో పరిపాలించిన ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు ప్రత్యేక గుడిని నిర్మించారు. అప్పటి నుంచి ప్రతి ఏడాది ఉత్సవాలను నిర్వహిస్తున్నారు.కైలాసగిరుల్లో దేవాలయాలను అభివృద్ధి పరచటంలో ప్రస్తుత ఇఒ డి.బాపిరెడ్డి చొరవ చూపుతున్నారు. జయంతి వేడుకల సందర్భంగా ఆలయాన్ని చక్కగా మామిడితోరణాలతో, అరటి చెట్లతో ముస్తాబు చేసారు. జయంతి వేడుకలకు పట్టణంలోని పలు ప్రాంతాలకు చెందిన భక్తులు హాజరయ్యారు. చక్కటి ఆలయాన్ని నిర్మించటంతో ప్రతినిత్యం ఇక్కడ పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆదివారంజయంతి సందర్భంగా మూల విరాట్లుకు షోడషాభిషేకాలు నిర్వహించారు. ఆలయ పారోహితులు అర్ధగిరి వేదమంత్రాలను పఠిస్తుండగా శాస్త్రోక్తంగా పూజలునిర్వహించారు. ఈ జయంతి వేడుకలకు మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి, మాజీ శ్రీకాళహస్తీశ్వరాలయధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు ఉమ్మడి చిత్తూరుజిల్లా వైకాపా కార్యదర్శి ఉన్నం వాసుదేవనాయుడు పాల్గొన్నారు.

# రైతుల పేర్లతో స్థూపం నిర్మించాలి: నగ్నముని



అమూల్యచందు భూమినవ్వడం చూసాను, రాధా లైఫ్ డ్రామా పుస్తకాలను ఆవిష్కరిస్తున్న నగ్నముని

**విజయవాడ,మే 11,ప్రభాతవార్తప్రతినిధి:** రాజధానికి భూములు ఇచ్చిన రైతుల పేర్లుతో స్థూపం నిర్మించాలని ప్రముఖ కవి నగ్నముని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి సూచించారు. అమరావతి భూముల కోసం రైతులు చేసిన ఉద్యమం అపూర్వమని అని అన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఆంధ్రగా విడిపోయింది కాబట్టి, వాళ్ళు తెలంగాణ రాష్ట్రం అని పేరు పెట్టుకున్నారు కాబట్టి మనం ఆంధ్ర రాష్ట్రం, నవ్యాంధ్ర రాష్ట్రంగా పిలుచుకోవాలన్నారు.రాధా కప్పగంతు అమూల్య చందు కవితా సంకలనాలు " లైఫ్ డ్రామా," "భూమి నవ్వడం చూశాను" పుస్తకాలను ఆయన ఆవిష్కరించారు.బాలోత్సవ భవన్ లో జరిగిన ఆవిష్కరణ కార్యక్రమంలో అమరావతి మీద ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.. ఈ కవయిత్రుల కవిత్వం దిగంబర ఉద్యమానికి కొనసాగింపు అని అన్నారు. విరసం ఆవిర్భావం తర్వాత కవిత్వంలో పలు మార్పులు వచ్చాయన్నారు.

అందులో భాగంగా దళిత, మైనారిటీ, మహిళా ఉద్యమాల ప్రభావంతో మంచి కవిత్వం వచ్చిందన్నారు. గత కొంత కాలంగా కవిత్వంలో స్తబ్ధత ఏర్పడిందని.. ఆ ఖాళీని పూరించడానికి కవయిత్రులు సుధా మురళి, అమూల్యచందు పూరిస్తారన్న నమ్మ కాన్ని వ్యక్తం చేశారు. ఇక ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా వచ్చిన వసీరా మాట్లాడుతూ అమూల్య చందు కవిత్వంలో ఆవేశం ఉందని రాధాకృష్ణ కవిత్వంలో ఆలోచన ఉందని అన్నారు. ఈ ఇద్దరూ కవయిత్రుల కవితలను చదివి వినిపించారు..కథకుడు ముక్కామల చక్రధర్ అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాహితీ సయామీ కవలలు కవయిత్రులు అని అన్నారు. రాధా రాసిన లైఫ్ డ్రామా కవిత్వాన్ని కవయిత్రి వాణిశ్రీ నైనాల సమీక్షిస్తూ ఈ కవయిత్రికి మహిళల పట్లే కాదు సమాజం పట్ల బాధ్యత ఉందన్నారు.మరో కవయిత్రి అమూల్య చందు కవిత్వాన్ని శాంతిశ్రీ సమీక్షస్తూ నేటి పరిస్థితుల్లో ఈ కవిత్వం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం కవయిత్రి సుధా మురళి మాట్లాడుతూ సమాజానికి అవసరమయ్యే కవిత్వాన్ని ఈ కవయిత్రులు ఇద్దరు కవితా సంపుటాలుగా ఆవిష్కరించారు అన్నారు.

ఈ కార్యక్రమంలో విరసం రాష్ట్ర అధ్యక్షులు అరసవల్లి కృష్ణ, నవ్యాంధ్ర రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి కలిమి,ఘంటా విజయకుమార్, సరికొండ నరసింహారాజు. బహుజన రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి తంగిరాల సోనీ,అరసం జిల్లా అధ్యక్షుడు శిఖాకాష్,గడ్డం విజయరావు, యువకవి కాశ్యప,కవయిత్రి వల్లెటి విజయదుర్గ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# విఐపి, సామాన్యుడు అయినా దర్శనం టిక్కెట్ ఉంటేనే తిరుమలలో వసతి



**తిరుమల,మే 11ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనానికి వచ్చే భక్తులు దర్శన టిక్కెట్‌గానీ,టోకెన్ కలిగిఉంటేనే వసతి సౌకర్యం లభించనుంది. ఎటువంటి టిక్కెట్ లేకుండా తిరుమలకు వస్తే భక్తులకు గదులు ఇవ్వడం టిటిడి నిరాకరిస్తోంది. తిరుమలలో ఉన్న 7వేల గదులు మాత్రమే. రోజువారీగా లక్షమంది వరకు భక్తులు కొండకు చేరుకుంటున్నారు. సరాసరి 40వేలమంది భక్తులకు మాత్రమే వసతి కల్పించే అవకాశం ఉంది. ఇందులో ప్రముఖులు కూడా ఎక్కువే.సామాన్య భక్తుడికి సులభంగా వసతి కల్పించడమే ధ్యేయంగా టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి వ్యూహం రచించారు. దీని ఆధారంగా భక్తులు దర్శన టిక్కెట్‌గానీ, టోకెన్ ఉంటేనే సిఆర్ఒ విచారణ కార్యాలయం వద్ద, పద్మావతి, ఎంబిసి విచారణ కార్యాలయాల వద్ద భక్తులకు గదులు కేటాయించేలా ఉత్వర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఈ విధానం పక్కాగా పటిష్టంగా అమలవుతుండటంతో సామాన్య భక్తులు గదులను సులభంగా పొందుతున్నారు. అంతేగాక రోజువారీగా దర్శన టిక్కెట్ కలిగిన భక్తులు కూడా దేవుని దర్శనం ముగించుకున్న గంట తరువాత గదిని ఖాళీ చేసేలా సిబ్బంది చూస్తున్నారు. దీనివల్ల సామాన్యభక్తులు మరింతమందికి వసతి పొందే అవకాశం సులభతరమైంది. గదులు పొందడానికి సామాన్య భక్తులు సుముఖత చూపుతుండటంతో ఇప్పుడు టిటిడి అనుసరించే విధానం బావుందని భక్తులు సంతృప్తి చెందుతున్నారు.



## స్వామివారి ఆశీస్సులతో అందరికీ మంచి జరగాలి

**తిరుమల,మే 11ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ప్రజలందరికీ మంచి జరగాలని, ప్రజలు సంతోషంగా ఉండాలని స్వామివారిని పలువురు ప్రముఖులు వేడుకున్నారు. ఆదివారం ఉదయం విఐపి బ్రేక్‌లో హైకోర్టు న్యాయమూర్తులు జస్టీస్ వి.గోపాలకృష్ణా రావు, జస్టీస్ రామకృష్ణప్రసాద్ కుటుంబంతో బాటు మాజీస్పీకర్ ప్రతిభాభారతి కుటుంబం, సింగర్ మాన్యచంద్రన్ వేర్వేరుగా ఆలయంలోనికి చేరుకున్నారు. ఉదయం విఐపి బ్రేక్ దర్శనంలో వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## నేటి అర్థరాత్రి తిరుపతి గంగమ్మకు శాంతిఅభిషేకం



**తిరుపతి,మే 11ప్రభాతవార్తప్రతినిధి:** ఆధ్యాత్మిక నగరం తిరుపతి గ్రామదేవతగా పూజలందుకుంటున్న తాతయ్యగుంట గంగమ్మజాతర ఉత్సవాల్లో సోమవారం(నేటి)అర్ధరాత్రి శాంతి అభిషేకం నిర్వహిస్తారు. రాయలసీమజిల్లాల్లోనే ఎంతో వేడుకగా వారంరోజులుపాటు జరిగే తిరుపతి తాతయ్యగుంటగంగమ్మ జాతరలో వారంరోజులపాటు విశేష అలంకరణల్లో అలసిన గంగమ్మకు ప్రధాన జాతరకు ముందు శాంతి అభిషేకం చేయడం ,అమ్మవారిని శాంతింపజేయడం జరుగుతుంది. ఈ అభిషేకంలో ఆలయ అర్చకులు, ఆలయ జాతర కమిటీ సభ్యులు, ఇఒ పాల్గొని ఎంతో కోలాహలంగా చేపడతారు. తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి స్వయాన చెల్లెలు తాతయ్యగుంట గంగమ్మ కావడంతో టిటిడి అధికారులు సాంప్రదాయంగా సారె తీసుకువచ్చి సమర్పించారు. గంగమ్మ జాతరలో చివరగా సోమవారం అర్ధరాత్రి శాంతి అభిషేకం, మంగళవారం ఉదయం నుండి రాత్రి వరకు అమ్మవారి దర్శనం, బుధవారం ఉదయం అమ్మవారి విశ్వరూపస్థూపం ప్రతిమ చెంప నరకడంతో పరిసమాప్తమవుతాయి. జాతరలో ఆదివారంఉదయం భక్తులు మాతంగా వేషంలో తమతమ మొక్కులు తీర్చుకున్నారు. తిరుపతి పరిసరాల్లోని ప్రజలేగాక తమిళనాడు,కర్నాటక, నెల్లూరు జిల్లాల వాసులు భారీగా తరలివచ్చారు. గంగమ్మ ఆలయ ఇఒ జయకుమార్ ,ఆలయ సిబ్బంది భక్తులకు ప్రశాంత దర్శనాలు చేయించారు.

# కొనసాగుతున్న హైఅలర్ట్!

## తిరుమల,తిరుపతిలో ఆకస్మిక తనిఖీలు



**తిరుమల,మే 11ప్రభాతవార్తప్రతినిధి:** భారత్ పాక్ మధ్య నెలకొన్న ఉద్రిక్తత పరిస్థితుల నేపథ్యంలో తిరుమల,తిరుపతిలో కేంద్రనిఘావర్గాలు హైఅలర్ట్ ప్రకటించాయి. గత వారంరోజులుగా భద్రతా దళాలు భద్రతనుతిరుపతి,తిరుమలలో మరింత కట్టుదిట్టం చేశారు. అలిపిరి తనిఖీ కేంద్రంతోబాటు తిరుమల రెండు, మొదటిఘాట రోడ్లులో పలు చోట్ల ,లింకురోడ్డు వద్ద తిరుమల పోలీసులు, టిటిడి విజిలెన్స్ భద్రత సిబ్బంది ఒక్కసారిగా రోడ్లపైకి చేరుకుని ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నారు. ఆదివారం తెల్లవారుజామున నుండి ఈ తనిఖీలు కొనసాగాయి. ఉగ్రవాదులను కట్టడిచేసే పరిస్థితుల్లో వారి ఆచూకీ తెలుసుకోవడం, ప్రధాన ప్రాంతాల్లో తిరుమల, తిరుపతిలో పోలీసు అధికారులు హైఅలర్ట్ ప్రకటించి ఎక్కడికక్కడ, ఎప్పటికప్పుడు క్షుణ్ణంగా బస్టాండులు, రైల్వేస్టేషన్,విమానాశ్రయం, యాత్రికుల వసతి సముదాయాలు, స్టార్ హోటళ్ళు, నగరశివార్లలోని స్టార్ హోటళ్ళు, స్టేహోమ్‌లు, లాడ్జీలు ఇలా దాదాపు వెయ్యి మంది పోలీసులు తనిఖీల్లో నిమగ్నమయ్యారు. తిరుమలకు వచ్చే అలిపిరి తనిఖీ కేంద్రం లోనేగాక ఘాట్‌రోడ్ల మధ్యలోనూ,తిరుమల లోనూ యాత్రికుల వసతి సముదాయాలు, ఆర్టీసి బస్టాండు, పాపవినాశనం, గోగర్భం, పసుపుధార,కుమారధార జలాశయాల ప్రాజెక్టులు ఉన్న అటవీప్రాంతాలను పహారాకాస్తున్నారు. తిరుపతి జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు నేతృత్వంలో తిరుమల అడిషనల్ ఎస్పీ రామకృష్ణ, తిరుమల డిఎస్పీ కె.విజయశేఖర్, టిటిడి విఎస్ఒలు ఎన్టీవిరామ్‌కుమార్, అల్లం సురేంద్ర,ఆక్టోపస్ బలగాలు నిశితంగా భక్తులను తనిఖీ చేస్తున్నారు. వాహనాల్లో వస్తున్న వారు ఎవరు, ఎక్కడ నుండి వచ్చారు, వారి ఆధార్ కార్డులను పకడ్బందీగా తనిఖీ చేసి పంపుతున్నారు. ఉగ్రముప్పు పొంచి ఉందనే నిఘా వర్గాల హెచ్చరికలతో తనిఖీలు ముమ్మరం చేశారు. ఆలయం పరిసరాల్లో భద్రతను కట్టుదిట్టంచేశారు. ఏ మాత్రం అనుమానం ఉన్నా వారి గుర్తింపుకార్డులు, ఆధార్‌కార్డులను ప్రత్యేక యాప్‌లద్వారా తనిఖీ చేస్తున్నారు. శ్రీవారి ఆలయం పరిసరాలు, ఆలయ మాఢవీధులుల్లో పోలీసులు, విజిలెన్స్ నిఘాతో బాటు ఆక్టోపస్ బలగాలు మోహరించి కాపలా కాస్తున్నారు.

రథం ఒకే చక్రంతో ఎలా నడవలేదో అలాగే కేవలం అదృష్టంతోనే పనులు నెరవేరవు. అదృష్టం, మానవ ప్రయత్నం ఈ రెండూ కార్యసాధన అనే రథానికి రెండు చక్రాలు.

-డబ్ల్యు ఎమర్సన్


# విస్తరిస్తున్న విద్యావ్యాపారం!

'చెట్టుకు మడికట్టి ఉంది కదా చెట్టు ఎలా ఎక్కుతారు? కాయలు ఎలా కోసుకుపోతారు' అన్నట్లుగా ఉంది విద్యా విషయంలో ప్రభుత్వవైఖరి. ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతి, గుర్తింపు లేకుండా ప్రైవేట్ పాఠశాలల విషయంలో పాలకులు వ్యవహరిస్తున్న తీరు తీవ్ర విమర్శలకు దారితీస్తున్నది. తెలుగు రాష్ట్రాల్లో వేలాది ప్రైవేట్ పాఠశాలలు కనీస గుర్తింపు లేకుండా నడుస్తున్నాయని ఎన్నిసార్లు ప్రభుత్వాలకు ఫిర్యాదులు అందినా పట్టించుకున్న దాఖలాలు లేవు. ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతి, గుర్తింపు లేకుండా నడుస్తున్న పాఠశాలల్లో పిల్లలను చేర్చవద్దని పత్రికాప్రకటనలు ఇచ్చాం కదా ఇంకెవరూ మోసపోరు అనుకుంటూ చేతులు ముడుచుకొని కూర్చోవడం అత్యంత దురదృష్టకరం. విద్యావ్యాపార విషయంలో ప్రభుత్వం ఎంతో ఉదాసీనంగా బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నదనే విమర్శలకు ఈ గుర్తింపు లేని పాఠశాలలు సాక్ష్యంగా నిలుస్తున్నాయి. ఎంతోకాలంగా ప్రభుత్వ గుర్తింపులేకుండా నిబంధనల మేరకు కనీస వసతులు లేకుండా ఎన్నో పాఠశాలలు తెలుగు రాష్ట్రాల్లో నిరాటంకంగా నడుస్తుండడం దక్షిణలతోనో, పైరవీల ఒత్తిడిలతోనో అధికారగణం కళ్లు మూసుకుంటున్నారనే చెప్పొచ్చు. మరో నెలరోజుల్లో విద్యా సంవత్సరం ఆరంభంకాబోతున్నది. ఈ సమయంలోనైనా అటు ఆంధ్రప్రదేశ్, ఇటు తెలంగాణలోని ప్రభుత్వాలు ఈ విషయంలో చర్యలుతీసుకోవాల్సిన అవసరం ఎంతైనాఉంది. ఆ పాఠశాలలను తనిఖీ చేయించిప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా విద్యాబోధన ప్రామాణికాల ఆధారంగా వాటికి గుర్తింపు ఇవ్వడమో, లేక మూసివేయించడమో చేయాలి. ఇలాంటి పాఠశాలల విషయాల్లో విద్యార్థుల భవిష్యత్తు దృష్టిలో ఉంచుకొని అవసరమైతే నిబంధనలను సవరించి ఏదో ఒక నిర్ణయం తీసుకోవాల్సిన తరుణమిది. అసలు గుర్తింపు లేని పాఠశాలలుఎవరికీ తెలియకుండా రహస్యంగా నడవడం లేదు. వాటి యాజమాన్యాలు పెద్దపెద్ద బోర్డులు, కరపత్రాల ప్రకటనతో భారీ ఎత్తున ప్రచారం చేసుకుంటున్నాయి. ఇదంతా విద్యాశాఖకు తెలియకుండా జరుగుతున్నదని అనుకోలేం. ఇలా అక్రమంగా నడిచే పాఠశాలలు, తనిఖీకి వివిధ స్థాయిలో ఎందరో అధికారులు ఉన్నారు. ఈ పాఠశాలలకు అధికార యంత్రాంగం వెళ్లలేని దూరంలో మారుమూల గ్రామాల్లో లేవు. నగరాలు, పట్టణాల్లో లెక్కకు మించి పుట్టగొడుగుల్లా పుట్టుకువస్తున్నాయి. అంతెందుకు సాక్షాత్తు ముఖ్యమంత్రి, మంత్రులు, సీనియర్ అధికారులు ఉండే హైదరాబాద్ దాని పరిసర ప్రాంతాల్లో దాదాపు పదిహేనువందలకుపైగా గుర్తింపులేని పాఠశాలలు ఉన్నట్లు అధికారవర్గాలే అంగీకరిస్తున్నాయి. ఈ పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు సుమారు నాలుగైదు లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నట్లు అనధికార అంచనాలు. ప్రభుత్వం ఎప్పుడో ఒకసారి ప్రకటనలు ఇవ్వడంతో వాటిని గందరగోళంలో పడేస్తున్నాయి. తీరా చేరాక ఆకస్మికంగా ఉన్నట్టుండి ఒకసారి వీటికి గుర్తింపులేదు, మీపిల్లలను ఈ స్కూళ్లల్లో చదివించవద్దని ప్రకటనలిస్తే ఆపిల్లల భవిష్యత్తు ఏమికావాలి? ఆ పాఠశాలలు ట్రాన్స్‌ఫర్ సర్టిఫికేట్ ఇచ్చినా అవిచెల్లవు. ఆ పరిస్థితుల్లో తల్లిదండ్రులు ఏంచేయాలి?ప్రత్యామ్నాయం చూపకుండా విద్యాసంవత్సరం ఆరంభమైన రెండు, మూడు నెలల తర్వాత ఇలాంటి ప్రకటనలు ఇవ్వడం వెనుక అంతర్యమేమిటి? అందుకే విద్యాసంవత్సరం ఆరంభం కంటే ముందే అలాంటి గుర్తింపులేని పాఠశాలల విషయంలో ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన ఇచ్చి తల్లిదండ్రులను అప్రమత్తం చేయాలి. పోనీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిద్దామనుకుంటే వాటి పరిస్థితి ఎలాఉందో వేరే చెప్పక్కర్లేదు. భోజనం పెడతాం, ఉచితంగా పుస్తకాలు ఇస్తాం, ఫీజులు అక్కర్లేదు అంటూ ఎన్నోఆశలు చూపినా పేదలు సైతం ఆవైపు కన్నెత్తి చూడడం లేదు. రోజువారీ కూలీ చేసి జీవనం సాగించే నిరుపేదలు కూడా తమ పిల్లలను అప్పోసొప్పో చేసి ప్రైవేట్ పాఠశాలల్లో చేరుస్తున్నారే తప్ప సర్కారు బడులవైపు పోవడం లేదు. ఏ అవకాశం లేనివారు, మరో దారిలేనివారు మాత్రమే ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పిస్తున్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే ప్రభుత్వ పాఠశాలల్లో చదివించడం నామోషిగా భావించే రోజులుదాపురించాయి. ప్రైవేట్ పాఠశాలల్లో మమ్మీ, డాడీ చదువులు చదువుతున్నారని చెప్పుకోవడం స్టేటస్ సింబల్‌గా మారిపోయింది. దీనిని ప్రైవేట్ యాజమాన్యాలు ఉపయోగించుకుంటున్నాయి.తెలంగాణ రాష్ట్రంలో నలభైరెండువేల తొమ్మిది వందలకుపైగా ప్రభుత్వ, ప్రైవేట్ ఎయిడెడ్ పాఠశాలలు ఉండగా, వాటిలో దాదాపు ఇరవైఎనిమిది వేలవరకు ప్రభుత్వ స్కూళ్లుఉన్నాయి. మిగిలిన పన్నెండువేల వరకు ప్రైవేట్ యాజమాన్యాల పర్యవేక్షణలో నడుస్తున్నాయి.రానురాను ప్రభుత్వ పాఠశాలల్లో చదివేవారి సంఖ్య తగ్గిపోతుంటే ప్రైవేట్ రంగం విద్యార్థుల సంఖ్య విస్తరిస్తుందనేందుకు గత పదేళ్లలో ప్రభుత్వం విడుదల చేసిన అంకెలే స్పష్టంచేస్తున్నాయి. ప్రభుత్వం యేటా వేలాది కోట్ల రూపాయలు విద్యారంగానికి కేటాయిస్తున్నది. అటు కేంద్ర ప్రభుత్వం కూడా మరెన్నో నిధులు వెచ్చిస్తున్నది. అందరికీ విద్య అనేది జాతీయ లక్ష్యం.ఇందుకోసం ఇప్పటికే అనేక పథకాల ద్వారా వేలాది కోట్ల రూపాయలు వెచ్చించారు. సర్వశిక్ష అభియాన్ లాంటి పథకాలు పెద్దఎత్తున చేపట్టి నిధులు వెచ్చిస్తున్నా ఆశించిన ఫలితాలు రావడం లేదు. ఇప్పటికైనా పాలక పెద్దలు శ్రద్ధతీసుకొని ప్రధానంగా గుర్తింపులేని పాఠశాలల విషయంలో చర్యలు తీసుకోవాల్సి అవసరం ఉంది.



బాధ్యతను ఇతరులపై మోపడం కన్నా పంచుకోవడంలోనే ఉపశమనం ఉంటుంది.


జార్జి ఎలియట్



మన శక్తియుక్తుల్ని మానవ కళ్యాణానికి వినియోగించాలి. వినాశనానికి కాదు.

షేక్ స్పియర్

## ప్రజావాక్కు



### చెప్పేవి శ్రీరంగ నీతులు

**తల్లిదండ్రులను** నిర్లక్ష్యణీయంగ వృద్ధాశ్రమాలకు చేరుస్తున్నకొడుకులు ఆస్తిపాస్తులకోసం కొట్టుకు చస్తున్న అన్నదమ్ములు పరాయి స్త్రీలపై కన్నేసి చెరుస్తున్న ప్రబుద్ధులు అక్కడ,మాదేరాజ్యం.ఇక్కడ మాదేరాజ్యం. ప్రతి ప్రాంతం మాకే కవాలి సొంతం. అనుకునే నాయకులు ఈ రోజుల్లో మనుషులు చాలా మటుకు ఇలానే ఉంటున్నారు. శ్రీరాముడికి కళ్యాణోత్సవం పూజలు వైభవంగా చేస్తూ తాము గొప్ప రామ భక్తులమని చెప్పుకునేవారు సైతం శ్రీరాముడి ఆదర్శాలకు అనుగుణంగా అడుగులు వేయలేకపోతున్నారు.అధికారం కోసం అనుక్షణం పాకులాడుతూ అంతా తమకే దక్కాలనే స్వార్థబుద్ధితో ఉంటున్నారు.

- మిథునం, హైదరాబాద్

### ఎందుకీ దుష్ప్రచారం?

**అంబేద్కర్** ఆశయ సాధన కోసం ఆయన కలలు కన్న రాజ్యాన్ని తీసుకురావడం కోసం పాలకులు పాటుపడాలి. అంతేకాని అంబేద్కర్‌కి జరిగిన అవమానంపై చర్చలు. ప్రసంగాలు చేయడం ఆయన్ని అవమానించిందంటు కాంగ్రెస్ పార్టీపై ఆపార్టీ నాయకులపై పదేపదే విమర్శలు చేయడం ఎందుకు? ఇప్పుడు అంబేద్కర్ లేదు ఆయన్ని అవమానించారంటు ప్రచారం చేస్తున్న నెహ్రూ లేదు. మరి ఎందుకీ రాద్ధాంతం?తమ వైఫల్యాలను కప్పి పుచ్చుకోవటానికి ప్రజల దృష్టిని మరల్చడానికి కాకపోతే.

- ఎమ్.ఎస్.శర్మ, హైదరాబాద్

### సంయమనం పాటించండి

**భారత్** పాకిస్థాన్ యుద్ధం వాతావరణం జరుగుతున్న వేళలోఅఖండ భరతావని మన వీరజవానులకు అశేష ప్రశంసలు మన ప్రభుత్వం శ్రీ మోదీజీ నాయుకత్వంలో ఉగ్ర పిశాచిమూకలకు సరియైన ధీటు సమాధానం చెబుతూన్న సమయములో ఎందుకో తమ ఉనికిని చాటుకునేందుకు కొంతమందినాయకులు,సెలబ్రిటీలు,సూడో సెక్యూలరిస్టులు, మతి భ్రమించిన మతోన్మాదులు ఇష్టం వచ్చినట్లు నోటి నాలుకనాలేదా తాటిపట్టా అన్నట్లు వాగుతున్నారు. తండ్రిని కోల్పోయిన పిల్లలూ, భర్తలను కోల్పోయిన భార్యలు, బంధు మిత్రులను కోల్పోయిన వారి రోదనలు దేశమొత్తం వినేటప్పుడు మీ చెవులలో సీసం ఏమైనా పడిందా అనే సందేహం కలగక పోదు.

- గార్లపాటి సీతారామయ్య, హైదరాబాద్

### అంతా ప్రచారం కోసమే

కేంద్రంలో పనిచేస్తున్న బిజెపి తమ భవిష్యత్తు కోసం గతాన్ని తవ్వుతున్నారు. అంబేద్కర్‌కి జరిగిన అవమానం గురించి చర్చలు. ప్రసంగాలు చేస్తూ ఆయన్ని అవమానించిందంటు కాంగ్రెస్ పార్టీని ఆ పార్టీ నాయకులను తరచు విమర్శిస్తున్నారు. నానా యాగీ చేస్తూ ఇష్టమొచ్చినట్టు వాగుతున్నారు. ఏనాడో మరణించిన అంబేద్కర్, నెహ్రూల పేర్లమిద రాజకీయాలు చేస్తూ లబ్ధిపొందాలని చూస్తున్నారు. ఏదో ఒక ఎన్నికల్లో ప్రజలు వారిని ఓడించకమానరు.

-ఎం.శ్రీనివాస్, హైదరాబాద్

### యుద్ధాన్ని పరిపూర్ణం చేయాలి

**పాకిస్థాన్** కొని తెచ్చుకున్న యుద్ధాన్ని భారత్ పరిపూర్ణం చేయడానికి ఇదే తగిన సమయం. పాకిస్తాన్ ఆక్రమించుకున్న కాశ్మీర్‌లోని భారత్ భూభాగాన్ని సంపూర్తిగా తిరిగి భారత్ అదుపులోకి తెచ్చుకోవాలి. ఉగ్రదేశాన్ని పనిలో పనిగా మరో ఏభై సంవత్సరాలు కోలుకోలేని విధంగా వారి సైనిక స్థావరాలను, ఆయుధ సామాగ్రిని ధ్వంసం చేయాలి. భారత్ పేరు వింటేనే గుండెల్లో దడపుట్టాలి. పనిలో పనిగాపాక్ సరిహద్దు ప్రాంతమైన బెలూచిస్తాన్ కూడా తన స్వతంత్రతను చాటుకోడానికి ముమ్మరంగా కృషి చేస్తోంది. ఉగ్రవాదులను కని, పోషించి భారత్ మీదకు ఉసిగొల్పిఅమాయకులను విచక్షణారహితంగా హత మారుస్తున్న పాపిష్టి దేశానికి తగిన గుణపాఠం చెప్పడానికి ఇదే మంచి తరుణం.

- డా. ఎన్.ఎస్.ఆర్. మూర్తి, సికింద్రాబాద్

### తాగునీటి కొరత

ఏపిలో కొన్ని జిల్లాలలో పగటి ఉష్ణోగ్రత విపరీతంగా పెరుగుతున్నది. వృద్ధులు, రోగులు ఏ మాత్రం తోడు లేకుండా వెళ్లరాదు. బస్ షెల్టర్లలో కొన్ని చోట్ల పెట్టిన శాలలు అక్కడ కార్యకర్త లేకపోవడం,నీరు బిందెలలో లేక ఉంటున్నవి. కార్పొరేషన్ అధికార్లు లేదా సంస్థల ప్రతినిధులు దృష్టి పెట్టాలి. కొన్ని చోట్ల స్వచ్ఛంద సంస్థలు కూడా కొన్ని ఏర్పాటు చేస్తున్నారు. వారి సహాయం కూడా నీరు ఇచ్చేందుకు కోరవచ్చు .ప్రజలు ఎక్కువగా వచ్చే కార్యాల్లో కూడా కుండలో నీరు ఇస్తే కొంత ఉపశమనం కల్గి ఓపికతో ఉంటారు. కొన్ని చోట్ల తాగునీటి కటకట ప్రజలను పీడిస్తున్న సంగతి ప్రభుత్వాలకు తెలుసు. అయినా ఏమీ చేయకుండా ఉంటున్నారు. ప్రజల సమస్యలను పట్టించుకోని వారు మాకెందుకు అనే ఆలోచన వస్తుంది.

-బొల్లోజు మేఘానాధం, విశాఖపట్నం

మనవి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# 'ధరల' మధ్య నలుగుతున్న రైతులు!

*ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రకారం సొంత భూమి రైతుకు నామమాత్రపు మిగులు ఉంది. కౌలురైతుకి పెట్టుబడి కూడా రాదు. కనీసం 6 క్వింటాళ్ల దిగుబడి వస్తేనే రైతుకు మిగులు ఆదాయం ఉంటుంది. క్వింటాల్‌కు 12 వేలు న్యాయమైన మద్దతు ధరగా ఉంటుంది. ఏపంట రైతు అయినా ఇదే పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ఉద్దేశపూర్వ కంగానే పంటలకు న్యాయమైన ధరలు ప్రకటించి, వాటికి చట్టబద్ధత కల్పించటం లేదు. సేద్యపు ఖర్చులు తగ్గే విధా నాలు అమలు జరపటం లేదు. సేద్యాన్ని నష్టదాయకంగా మార్చి వ్యవసాయం దండగ అనే అభిప్రాయం ఏర్పడేలా చేసి చిన్న, సన్నకారురైతులు, తమభూములను కార్పొ రేట్ సంస్థలకు కట్టబెట్టే విధానాలు అమలు చేస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రైతాంగ వ్యతిరేక విధానాలను వ్యతిరేకి స్తూ, పంటలకు న్యాయమైన ధరలు ప్రకటించి వాటికి చట్టబద్ధత కల్పించాలని రైతాంగం ఉద్యమించాలి.*

బొల్లిముంతసాంబశివరావు

భారతదేశంలో వ్యవసాయం గ్రామీణ ప్రజల ముఖ్యమైన జీవనోపాధి. సేద్యం ద్వారా రైతాంగం వివిధ పంటలు పండించి దేశప్రజల ఆహార అవసరాలు తీరుస్తున్నారు. సేద్యం ముందుకు సాగాలంటే రైతాంగానికి ప్రభుత్వం సహకారం అవసరం. సేద్యపు ఖర్చులు తగ్గేలా చర్యలు తీసుకోవటం, పంటలకు న్యాయమైన ధరలు ప్రకటించటం, ప్రభుత్వసంస్థల ద్వారా కొనుగోళ్లు చేయటం ద్వారా రైతాంగానికి సహకారం అందుతుంది. నేటి పాలకులనుంచి రైతాంగానికి అలాంటి సహకారం అందటంలేదు. రైతాంగం పండించే ఏ పంటకు న్యాయమైన ధర లభించకపోగా, కనీసం ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కూడా లభించక నష్టపోతున్నారు. వివిధ పంటల మద్దతు ధరలు, బహిరంగ మార్కెట్లో లభిస్తున్న ధరలే అందుకు నిదర్శనం. ఈ సంవత్సరం ఆంధ్రప్రదేశ్‌లో ఐదు లక్షల ఎకరాల్లో మిర్చి పంటను రైతులు సాగుచేశారు. 2023–24 సంవత్సరంతో పోలిస్తే, 2024–25 సంవత్సరంలో 2.13 లక్షల ఎకరాల దాకా పంట సాగుతగ్గింది. అయినా భారతదేశం మొత్తం ప్రపంచ ఉత్పత్తిలో 45.6శాతం కలిగి ఉంది. ఎకరాకు ఖర్చు దాదాపు 2 లక్షలపైగాఉంది. సగటు దిగుబడి 20 క్వింటాళ్లు. ధర పతనం వల్ల నష్టంభయంతో రైతులు సాగు చేసే భూమి విస్తీర్ణం తగ్గించారు. గతరెండు వార్షిక సంవత్సరాల్లో క్వింటాల్ 20వేల దాకా ధర పలికిన మిర్చికి నేడు 10 వేలు కూడా ధర రావటంలేదు. కేంద్రప్రభుత్వం క్వింటాల్‌కు 11,781 రూపాయల మద్దతు ధర నిర్ణయించింది. ఆ ధరకు కూడా వ్యాపారులు కొనుగోలు చేయటంలేదు. ప్రస్తుత ధరప్రకారం రైతుకి పెట్టినపెట్టుబడి కూడా రాక నష్టపోతున్నాడు.కూటమి ప్రభుత్వం మిర్చి రైతులను ఆదుకోవాలని కేంద్రానికి లేఖ రాయటం తప్ప ఎటువంటి చేయూతను అందించలేదు. క్వింటా మిర్చికి 18 వేలు మద్దతు ధర ప్రకటించి కొనుగోలు బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాలని రైతాంగంకోరుకుంటున్నారు. భారతదేశంలో పత్తిసాగు 1,30,61,000 హెక్టార్లతో ప్రపంచంలో మొదటిస్థానంలో ఉంది. ఇది ప్రపంచ పత్తి సాగులో 40 శాతం. ఆంధ్రప్రదేశ్‌లో 8లక్షల, 21వేలఎకరాల్లో రైతులు పత్తి సాగు చేస్తున్నారు. ఎకరాకు కౌలుతో 50 వేల దాకా సేద్యపు ఖర్చుఉంది. వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తే 10 క్వింటాళ్ల దాకా దిగుబడి వస్తుంది. ప్రస్తుతం దేశంలో సగటు దిగుబడి 5 క్వింటాళ్లుగా ఉంది. భారతదేశ పత్తి సాగులో ఏపీ 12.6 శాతం కలిగి ఉంది. క్వింటాళ్ల ఉత్పత్తి ఖర్చు9,000 వేలుగా అనేక మంది వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతుధర 7,521 రూపాయలు. మద్దతుధర ఉత్పత్తి ఖర్చు కన్నా తక్కువగా ఉంది. వ్యాపారులు ఆరేటుకి కూడా కొనటంలేదు. సిసిఐ పత్తి కొనుగోళ్లు జరపటంలేదు. ఫలితంగా పత్తిరైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. దేశంలోని రైతుల బలవన్మరణాల్లో అప్పుల్లో కూరుకుపోయిన పత్తిరైతులే ఎక్కువగా ఉన్నారు. దేశంలో పసుపుసాగు లక్షా, 86 వేల హెక్టార్ల జరుగుతున్నది. తెలంగాణ 45 వేల ఎకరాల్లో, ఆంధ్రప్రదేశ్‌లో 83,540 ఎకరాల్లో రైతాంగం సాగు చేస్తున్నారు. పసుపు ఎగుమతి ద్వారా 1,876 కోట్ల ఆదాయం వస్తుంది. పసుపు ఎకరా ఖర్చు కౌలుతో లక్షా,25 వేల రూపాయలపైగా ఉంది. 50 క్వింటాళ్లదాకా వచ్చే పచ్చి పసును ఉడకబెడితే 16క్వింటాళ్ల ఎండిన పసుపు దిగుబడివస్తుంది. మూడు సంవత్సరాల క్రితం క్వింటాలుకు 15 నుంచి 18 వేల ధర లభించింది. పసుపు ధర నేడు గణనీయంగా తగ్గింది. పసుపురైతుల ఆందోళన ఫలితంగా కేంద్రం పసుపుకు 12వేల మద్దతు ధరప్రకటించింది. దుగ్గిరాల పసుపు మార్కెట్లో 11 వేలలోపు మాత్రమే వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. ఈరేటు వల్ల రైతుకు పెట్టిన



పెట్టుబడి కూడారాదు. విదేశీమారక ద్రవ్యాన్ని అందించే పసుపు రైతులను కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు ఆదుకునే చర్యలేవి తీసుకోలేదు.నష్టాల్లో కూరుకు పోతున్న పసుపురైతులు సేద్యం నుంచి వైదొలగే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. దేశంలో 3 లక్షల, 80 వేలహెక్టార్లలో వేరుశనగ పంటను రైతులు సాగు చేస్తున్నారు.2020–21 లెక్కల ప్రకారం 8.70 లక్షలహెక్టార్లలో వేరుశనగను రైతులు సాగుచేస్తున్నారు. ఎకరాసాగు 25 వేలు. కౌలు రైతుకి అదనంగా మరో 12వేలు ఖర్చు ఉంది. వాతావరణం అనుకూలిస్తే 5 లేక 6 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర6,783 రూపాయలు. ఈ మద్దతు ధరతో రైతుకు పెట్టుబడి కూడా రాక నష్టపోతున్నాడు. ఫలితంగా వేరుశనగసాగు తగ్గుతూ ఉంది. వేరుశనగతోపాటు నూనెగింజల ఉత్పత్తి దేశంలో తగ్గటంతో పెద్దఎత్తున నూనెలు విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నాము. దేశంలో మొక్కజొన్నసాగు 2024–25లో కోటి, 10లక్షల, 50 వేల హెక్టార్లగా ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో 3.01 లక్షలహెక్టార్లు, తెలంగాణలో 6లక్షల హెక్టార్లకు పైగా రైతులు మొక్కజొన్న సాగుచేస్తున్నారు. ఎకరాకు కౌలుతో సహా 45వేల దాకా ఖర్చుగా ఉంది. సగటు దిగుబడి ఎకరాకు 20క్వింటాళ్లు. కేంద్రప్రభుత్వం ప్రకటించిన మద్దతుధర 2,225 రూపాయలు. రైతుకు వచ్చే ఆదాయం 44,500రూపాయలు. అంటే రైతుకు పెట్టుబడి మాత్రమేవస్తుంది. నేడు పంట చేతికి వచ్చిన తరుణంలో వ్యాపారులు 2 వేలకుమించి కొనుగోలు చేయటంలేదు. రాష్ట్రంలో ప్రభుత్వ సంస్థలు కొనుగోళ్లు ప్రారంభించలేదు. ప్రస్తుత ధరలతో రైతులు నష్టపోతున్నారు. దేశంలో జొన్నసాగు 50లక్షల, 40 వేల ఎకరాలు. ఆంధ్రప్రదేశ్లో 4లక్షల, 25 వేల ఎకరాలు. ఎకరా సేద్యపు ఖర్చు 25 వేలతో పాటు కౌలురైతుకి అదనంగా 15వేలు ఖర్చుగా ఉంది. సగటు దిగుబడి 18 క్వింటాళ్లు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర 3,371 రూపాయలు. ఈ ధరకు కొనుగోలు చేస్తే రైతుకి కొంతమిగులు ఆదాయం వస్తుంది. ప్రైవేట్ వ్యాపారులు 2250 రూపాయలకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. ఈధరవల్ల రైతుకు పెట్టుబడి మాత్రమే వస్తుంది. కుటుంబ శ్రమ విలువను నష్టపోతున్నాడు. ఆంధ్రప్రదేశ్‌లో కంది 12లక్షల ఎకరాల్లో రైతులు సాగుచేస్తున్నారు. ఎకరా సేద్యపు ఖర్చు 20 వేలతోపాటు కౌలు ఖర్చు అదనం. సగటు దిగుబడి 5క్వింటాళ్లు. మద్దతు ధర7,550 రూపాయలు. వ్యాపారులు కొనుగోళ్లు చేస్తున్నది 6,500.ప్రభుత్వం కొనుగోళ్లు చేయక, వ్యాపారులు తక్కువ ధర ఇవ్వటంతో కందిరైతులు నష్టపోతున్నారు. కంది పంటకు10 వేలు మద్దతు ధర ప్రకటించి ప్రభుత్వ సంస్థలే కొనుగోలు చేయాలి. ఆంధ్రప్రదేశ్‌లో వరిసాగు విస్తీర్ణం 30.4 లక్షల ఎకరాలు. కౌలుతో 50 వేలు సేద్యపు ఖర్చు. సగటు దిగుబడి 25 క్వింటాళ్లు. మద్దతుధర 2300 రూపాయలు. మద్దతు ధర ప్రకారం57 వేల ఆదాయం వస్తుంది. 25 క్వింటాళ్ల కన్నా తక్కువ దిగుబడి వచ్చేవారికి పెట్టుబడి కూడా రాదు. నేడు రబీ ధాన్యం క్వింటాల్ 1750 రూపాయలకు మాత్రమే వ్యాపారులు కొంటున్నారు. వరికిమద్దతు ధర3వేలు ప్రకటించి కొనుగోలుచేసే బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే తీసుకోవాలి. ఆంధ్రప్రదేశ్లో 13 లక్షల ఎకరాల్లో, తెలంగాణలో 8.13 లక్షలఎకరాల్లో రైతులు పెసర పంట సాగు చేస్తున్నారు. ఎకరా పంట సేద్యపు ఖర్చు 20 వేలు. కౌలు రైతులకు అదనంగా పదివేలు ఖర్చు ఉంది. సగటు దిగుబడి 5క్వింటాళ్లు. కేంద్రం ప్రకటించిన మద్దతు ధర 8,682 రూపాయలు. బహిరంగ మార్కెట్లో వ్యాపారులు కొనుగోలు చేస్తున్నది 6,533 రూపాయలు. కొన్నిప్రాంతాల్లో 4,100 రూపాయలకు మాత్రమే వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రకారం సొంత భూమి రైతుకు నామమాత్రపు మిగులు ఉంది. కౌలురైతుకి పెట్టుబడి కూడా రాదు. కనీసం 6 క్వింటాళ్ల దిగుబడి వస్తేనే రైతుకు మిగులు ఆదాయం ఉంటుంది. క్వింటాల్‌కు 12 వేలు న్యాయమైన మద్దతు ధరగా ఉంటుంది. ఏపంట రైతు అయినా ఇదే పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ఉద్దేశ పూర్వకంగానే పంటలకు న్యాయమైన ధరలు ప్రకటించి, వాటికి చట్టబద్ధత కల్పించటం లేదు. సేద్యపు ఖర్చులు తగ్గే విధానాలు అమలు జరపటం లేదు. సేద్యాన్ని నష్టదాయకంగా మార్చి వ్యవసాయం దండగ అనే అభిప్రాయం ఏర్పడేలా చేసి చిన్న, సన్నకారురైతులు, తమభూములను కార్పొ రేట్ సంస్థలకు కట్టబెట్టే విధానాలు అమలు చేస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రైతాంగ వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ, పంటలకు న్యాయమైన ధరలు ప్రకటించి వాటికి చట్టబద్ధత కల్పించాలని రైతాంగం ఉద్యమించాలి. ●

# మద్యపాన వ్యసనమే జీవితాలకు పెనుశాపం!

బుగ్గన మధుసూదనరెడ్డి

ఏ ప్రభుత్వాలకైనా అంతిమంగా చీప్ లిక్కర్ ద్వారా మాత్రమే అధికంగా, సరిపడినంత ఆదాయ వనరులు లభించేది. అందుకే ఇబ్బడి ముబ్బడిగా ఆదాయ వనరులు సమాకూర్చిపెట్టే ఈ చీప్ లిక్కర్ వ్యాపారం నిర్వహించే షాప్‌లపై ప్రభుత్వాలకు ఎనలేని మోజు, అమితాశక్తి. ఇది ఇలా వుంటే ప్రజలకు మాత్రం ఈ మద్యపానం సేవించడం అనే ఈ వ్యసనమే వారి జీవితాలకు ఒక గుడిబండలాగా, పెనుశాపంగా పరిణమిస్తున్నది. ఎందుకంటే రాష్ట్ర జనాభాలో దాదాపు 60శాతం ప్రజలు మద్యపాన ప్రియులే. వీరికి టైమ్‌కు భోజనం లేకున్నా పర్వాలేదు, ఒక బాటిల్ మందుకు మాత్రం కరవు ఉండకూడదు. అంతగా వీరి జీవితాలు మద్యం సేవనంతో పెనవేసుకుపోయాయి అనే మాట అక్షర సత్యం. మన ప్రజలకు వున్న ఈ బలహీనతే మద్యం షాప్ యజమానుల పాలిట ఒక కల్పవృక్ష ంలా, వరంలా, కాసులు ఆర్జించి పెట్టె ఓ బ్రహ్మాస్త్రంలా పరిణమించింది. కాని ఇక్కడ ప్రభుత్వాల ఆలోచన మద్యం ధరలను 20 శాతం మేర పెంచితే ప్రజలు మద్యం స్వీకరించడం తగ్గిస్తారు అని, కాని వాస్తవానికి అది ఒక కలలో మాట. ఎందుకంటే ప్రజలకు ఆ రేట్లు భరించే స్థోమత లేకపోయిన ఎలాగోలా అప్పు చేసి పప్పు కూడు అంటారే ఆ తరహాలో చివరకు బరితెగించి ఆ వక్రదారిలో పయనించి మరీ మద్యాన్ని కొనుగోలు చేస్తారు తప్ప వెనుకంజ వేయరు అనేది ఎవరు కాదనలేని జగమెరిగిన సత్యం. ఏదిఏమైనా ప్రజలకు వున్న ఈ అతి పెద్ద దగుల్బాజీ వ్యసనమే వారి జీవితాలకు ఒక శనిలాగా, ఒక తప్పు సరిదిద్దుకోలేని కార్యంలా పరిణమించడం అత్యంత దురదృష్టకరం, బాధాకరం. అయితే ప్రజలు ఈ అనారోగ్య పరిస్థితులు కొని తెచ్చుకోవడంపై ప్రభుత్వాలను నిందించి ఏమి ప్రయోజనం? ముందు మద్యం మైకంలో పీకలదాక కూరుకుపోయిన మన ప్రజలలో జ్ఞానోదయం కావాలి. వారు మద్యం వ్యసనం నుంచి బయట పడనంతవరకు ఇలా మద్యం ఏరులై పారుతూనే ఉంటుంది. దీంతో ఇటు చీప్ లిక్కర్ షాప్ యజమానులకు కోట్లాది రూపాయల ఆదాయలు, అటు ప్రజల జేబులకు ఏమో భారీస్థాయిలో చిల్లులుపడటం తథ్యం. ఏమైన మన ప్రజలు ఈ మద్యం మత్తును వీడలేరు. అటు చీప్ లిక్కర్ షాప్ యజమానులకు ఈ మద్యం వ్యాపారమే బంగారు గుడ్లు పెట్టే బాతు లాంటిది. ఇంతకు మించి వారికి వేరే దారిలో భారీ ఆదాయం పొందే అవకాశం లేదు కాక లేదు. ఎప్పుడు ఇంకెప్పుడు మారతారు ఈ వెలం వెర్రి జనం,వీరు ఎప్పటికి మద్యం చేతిలో కీలుబొమ్మలే,బానిసలే తప్ప ప్రజలు మాత్రం నిన్ను వదలను బొమ్మాళి అన్నట్లుగా మద్యాన్ని బంగారు పళ్లెంలో పెట్టుకొని మరీ ఆహ్వానిస్తారు తప్ప తమ కుటుంబాలను అధోగతి పాలు చేసే ఆ చెడు వ్యసనాన్ని మాత్రం వదలరు గాక వదలరు. అదే మన ప్రజాస్వామ్యం చేసుకొన్న అత్యంత దురదృష్టకరమైన ఘట్టం, పరిణామం ఏమి చేస్తునురా సోమలింగం!. ●

# బహుళ సంక్షోభాల నుంచి ఏదీ గట్టెక్కే మార్గం?

డి జె మోహన రావు

మహమ్మారి అనంతర ప్రపంచం, పెరుగుతున్న వాతావరణ మార్పుల ప్రభావాలు, అస్థిరమైన భౌగోళిక రాజకీయ పరిస్థితులు, ఆర్థిక అనిశ్చితులు ఇలా అనేక సవాళ్లతో మానవాళి సతమతమవుతోంది. ఈ సంక్లిష్ట పరిస్థితుల నడుమ, ఐక్యరాజ్యసమితి ఆర్థిక సామాజిక వ్యవహారాల విభాగం, ఐక్యరాజ్యసమితి విశ్వవిద్యాలయ ప్రపంచ అభివృద్ధి ఆర్థిక పరిశోధనా సంస్థ సంయుక్తంగా విడుదల చేసిన ప్రపంచ సామాజిక నివేదిక 2025 ఒక కీలకమైన హెచ్చరికను జారీ చేసింది. సమాజాల అంతర్గత స్థితి అత్యంత ఆందోళనకరంగా ఉందని ఈ నివేదిక స్పష్టం చేసింది. పెరుగుతున్న అసమానతలు, ఉద్యోగ అభద్రత, సమాజంలో సన్నగిల్లుతున్న నమ్మకం వంటి అంశాలు ప్రపంచ సామాజిక జీవనాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయని, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు ఇవి పెనుముప్పుగా పరిణమించాయని నివేదిక ఆందోళన వ్యక్తం చేసింది. ప్రపంచం ప్రస్తుతం బహుళ సంక్షోభాల యుగంలో చిక్కుకుందని, ఈ స్థితి నుండి బయటపడటానికి తక్షణమే ఒక సమగ్రమైన, పునరుద్ధరించిన ప్రపంచ విధాన ఎజెండా అవసరమని నివేదిక గట్టిగా నొక్కిచెప్పింది. ప్రపంచ జనాభాలో 60శాతం మంది తమ ఆర్థిక భవిష్యత్తుపై నమ్మకం లేక, అభద్రతతో జీవిస్తున్నారు. 69 కోట్లకు పైగా ప్రజలు ఇంకా తీవ్ర పేదరికంలో మగ్గుతున్నారు. అత్యంత ఆందోళనకరమైన విషయం ఏమిటంటే, దాదాపు అన్ని దేశాలలో (మూడింట రెండు వంతులలో) ఆదాయ అసమానతలు పెరుగుతున్నాయి. ప్రపంచంలోని అత్యంత ధనవంతులైన 1శాతం మంది జనాభా, దిగువన ఉన్న 95శాతం మంది కంటే ఎక్కువ సంపదను కలిగి ఉన్నారు. ఇది సంపద కేంద్రీకరణ ఏ స్థాయిలో ఉందో, సమాజంలో చీలిక ఎంత లోతుగా ఉందో తెలియజేస్తుంది. ఇక ఉపాధి, జీవనోపాధి అభద్రత విషయంలో దశాబ్దాలుగా పేదరిక నిర్మూలనలో కొంత పురోగతి సాధించినప్పటికీ, చాలా మంది ప్రజలు ఇంకా పేదరికపు అంచున బతుకుతున్నారు. వారికి స్థిరమైన ఉద్యోగాలు లేవు, తగినంత ఆదాయం సంపాదించడంలో ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఆఫ్రికా, దక్షిణాసియా వంటి ప్రాంతాలలో అనధికారిక, అభద్రత ఉద్యోగాలు ప్రబలంగా ఉన్నాయి. ఇది కేవలం ఆర్థిక సమస్య మాత్రమే కాదు, సామాజిక భద్రత, గౌరవం,భవిష్యత్తు పట్ల నమ్మకం వంటి అంశాలను కూడా ప్రభావితం చేస్తుంది. ప్రభుత్వాలు, రాజకీయ సంస్థలు, ఇతర ప్రజా సంస్థల పట్ల ప్రజలలో నమ్మకం వేగంగా తగ్గుతోంది. సగానికి పైగా ప్రపంచ జనాభా ఈ అపనమ్మకాన్ని వ్యక్తం చేస్తున్నారు. తప్పుడు సమాచారం వ్యాప్తి, డిజిటల్ అంతరం, పాలనా వైఫల్యాలు, అవినీతి వంటివి ఈ అపనమ్మకాన్ని మరింత పెంచుతున్నాయి. వివిధ సామాజిక వర్గాల మధ్య పెరుగుతున్న ధ్రువణత, నమ్మకం తగ్గడం సామాజిక ఐక్యతకు, సుపరి



పాలనకు పెను సవాలుగా మారింది. వాతావరణ వైపరీత్యాలు, సంఘర్షణలు వంటి బాహ్య కారకాలు ఇప్పటికే ఉన్న సామాజిక సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేస్తున్నాయి. 2024లో ప్రతి ఐదుగురిలో ఒకరు వాతావరణ వైపరీత్యాన్ని ఎదుర్కొన్నారు, ప్రతి ఏడుగురిలో ఒకరు సంఘర్షణ ప్రభావిత ప్రాంతాలలో నివసిస్తున్నారు. ఇది వారి జీవితాలను, అభివృద్ధి అవకాశాలను తీవ్రంగా దెబ్బతీస్తోంది. ఈ తీవ్రమైన, పరస్పరం ముడిపడి ఉన్న సవాళ్లను ఎదుర్కోవడానికి ప్రస్తుత విధానాలు, గతంలో విజయవంతమైనవిగా భావించిన ఆర్థిక నమూనాలు సరిపోవని నివేదిక తేల్చిచెప్పింది. కేవలం ఆర్థిక వృద్ధిపై దృష్టి సారించడం సరిపోదు. సామాజిక ప్రగతిని, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించాలంటే ఒక సమగ్రమైన, మానవ కేంద్రీకృత విధానం అవసరం. ఈ సమగ్ర సామాజిక ప్రగతి సాధన కోసం నివేదిక ఒక కొత్త విధాన ఏకాభిప్రాయాన్ని ప్రతిపాదించింది. ఇది మూడు ఆధార సూత్రాలపై ఆధారపడి ఉంటుంది. ప్రతి ఒక్కరికీ వారి అవసరాలను బట్టి అవకాశాలు కల్పించడం నిర్ధారించాలి. సామాజిక చలనశీలతను పెంపొందించడం, విద్య, ఆరోగ్యం వంటి ప్రాథమిక సేవల అందుబాటులో ఉన్న అంతరాలను తగ్గించడం దీని లక్ష్యం. వివక్షతకు గురి చేయబడిన వర్గాలను సమాజంలో సంపూర్ణంగా చేర్చడం, ప్రగతిశీల పన్ను విధానాలు, సంపద పునఃపంపిణీ ద్వారా సామాజిక న్యాయం సాధించడం దీని అంతిమ లక్ష్యం. నిరుద్యోగ భృతి, అనారోగ్య సెలవులు, పెన్షన్ పథకాలు వంటి సార్వత్రిక సామాజిక భద్రతా వ్యవస్థలను ఏర్పాటు చేయడం, బలోపేతం చేయడం ద్వారా ప్రజలను ఆర్థిక అనిశ్చితి నుండి రక్షించడం. శ్రామిక మార్కెట్లలో అనిశ్చితి తగ్గించడం, కార్మికులకు సరైన వేతనాలు, మంచి పని పరిస్థితులు, గౌరవప్రదమైన, సురక్షితమైన ఉద్యోగాలు కల్పించడం ముఖ్యం. ప్రభుత్వాలు, సంస్థలపట్ల ప్రజలలో నమ్మకాన్ని తిరిగి నిర్మించడం దీనికి కీలకం. వివిధ సామాజిక సమూహాలు, తరగతుల మధ్య వారధి నిర్మించాలి. ఉమ్మడి లక్ష్యాలు సాధన అందరూ కలిసి పనిచేయాలి. నిర్ణయ ప్రక్రియలలో పౌరులు,ముఖ్యంగా అట్టడుగు వర్గాలవారు భాగస్వామ్యం పెంచడం వారి గొంతులు వినడం సంఘీభావం బలోపేతం చేస్తుంది. ఈ మూడు సూత్రాలను ఆచరణలో పెట్టడానికి, ప్రస్తుత సంక్షోభాలను పరిష్కరించడానికి నివేదిక పలుకీలక విధానాలను సూచించింది. విద్య, ఆరోగ్యం, నాణ్యమైన పని అవకాశాల కల్పనలో ప్రభుత్వాలు భారీగా పెట్టుబడులు పెట్టాలి. ఆదాయ, సంపద అసమానతలను తగ్గించడానికి ప్రగతిశీల, పునఃపంపిణీ పన్ను విధానాలు అమలు చేయాలి. ధనిక వర్గాలు, పెద్ద సంస్థలపై పన్ను రేట్లు పెంచి, పన్నుఎగవేతను అరికట్టాలి. అందరికీ వర్తించే బలమైన సార్వత్రిక సామాజిక రక్షణ వ్యవస్థలను ఏర్పాటు చేసి, బలోపేతం చేయాలి. కార్మికుల హక్కులను బలోపేతం చేయాలి. కనీస వేతనాలు పెంచాలి. సురక్షిత పని పరిస్థితులు కల్పించాలి. సాంకేతిక మార్పుల నేపథ్యంలో కార్మికులకు తిరిగి శిక్షణ ఇవ్వాలి. ప్రభుత్వ, ప్రజా సంస్థలను మరింత సమ్మిళితంగా, పారదర్శకంగా, జవాబుదారీగా మార్చాలి.అవినీతిని అరికట్టడానికి బలమైన చట్టాలు, సంస్థలు అవసరం. నిర్ణయ ప్రక్రియలలో పౌరులు, పౌర సమాజం భాగస్వామ్యాన్ని పెంచాలి. మార్కెట్లలో ఏకస్వామ్యాలను నియంత్రించి పోటీని ప్రోత్సహించాలి. అంతర్జాతీయ సహకారం. వాతావరణ మార్పులు, మహమ్మారులు వంటి ప్రపంచ సవాళ్లను ఎదుర్కోవడానికి దేశాల మధ్య సహకారం, సమన్వయాన్ని బలోపేతం చేయాలి.అభివృద్ధి చెందుతున్న దేశాలకు మద్దతు ఇవ్వాలి. పర్యావరణపరంగా స్థిర మైన అభివృద్ధి నమూనాలను ప్రోత్సహించాలి, పర్యావరణ న్యాయాన్ని పాటించాలి. ●

## జిల్లా డిసిసిబి ఛైర్మన్‌గా డాక్టర్ కామేపల్లి సీతారామయ్య

- ఆంధ్రప్రదేశ్ లైవ్ స్టాక్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా షేక్ రియాజ్

**ఒంగోలు, ప్రభాతవార్త**




ప్రకాశం జిల్లా డిసిసిబి ఛైర్మన్‌గా డాక్టర్ కామేపల్లి సీతారామయ్య నియమితులైయ్యారు. వృత్తిరీత్యా డాక్టర్‌గా ఎందరికో సేవలందిం చిన డాక్టర్ కామేపల్లి సీతారామయ్య కొన్ని ఏళ్ళుగా టిడిపి అండగా నిలుస్తు పనిచేశారు. ఇది గుర్తించిన టిడిపి అధిష్టానం, ఎమ్మెల్యే దామచర్ల చొరవతో జిల్లా డిసిసిబి ఛైర్మన్‌గా అవకాశం వచ్చింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌ను మర్యాదపూర్వకంగా సీతారామయ్య కలిసి



పుష్పగుచ్ఛం అందించి ధన్యవాదాలు తెలిపారు. అదే విధంగా ఆంధ్రప్రదేశ్ లైవ్ స్టాకు డెవలప్ మెంట్ ఏజెన్సీ ఛైర్మన్‌గా జనసేన జిల్లా అధ్య క్షులు షేక్ రియాజ్‌ను నియమించారు. షేక్ రియాజ్ జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులుగా పని చేస్తూ జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేశారు. ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ రియాజ్ సేవలను గుర్తించి ఈ అవకాశాన్ని కల్పించారు. దీంతో ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు కేక్ కటింగ్ చేసి బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు,

## పేదలకు అండగా బూచేపల్లి కుటుంబం

- సేవా కార్యక్రమాల మధ్య బూచేపల్లి వర్ధంతి వేడుకలు

**చీమకుర్తి, మే 11, ప్రభాతవార్త**






దివంగత మాజీ ఎమ్మెల్యే, తమ తండ్రి బూచేపల్లి సుబ్బారెడ్డి అడుగుజాడల్లో పేదలకు అండగా తమ కుటుంబం నిలుస్తుందని దర్శి మాజీ ఎమ్మెల్యే, జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి అన్నారు. చీమకుర్తిలో బూచేపల్లి సుబ్బారెడ్డి ఆరవ వర్ధంతి వేడుకలు ఆదివారం బూచేపల్లి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాల మధ్య వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సభలో డాక్టర్ బూచేపల్లి మాట్లాడుతూ జన్మిస్తూ ఏమి తీసుకురామని, మరణిస్తూ ఏమి తీసుకుపోలేమని ఈమధ్య జీవితంలో పదిమందికి ఉపయోగపడితే ఎంతో సంతోషంగా ఉంటుందని తమ తండ్రిగారి మాటలు స్ఫూర్తిగా ముందుకు నడుస్తున్నామని అన్నారు. జడ్పీ ఛైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ తాము వ్యాపార రంగంలో సంపాదిస్తున్న దానిలో కొంత ప్రజాసేవకు వెచ్చిస్తున్నామని, మరింత విస్తృత ప్రజా సేవ కోసమే రాజకీయాల్లోకి వచ్చామన్నారు. తమ భర్త బూచేపల్లి సుబ్బారెడ్డి లేరని విషయాన్ని మరచిపోయేలా తనయుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి చూపిస్తున్న ప్రేమ, ప్రజల ఆదరణ తో సంతోషంగా ఉన్నామన్నారు. తొలుతగా బూచేపల్లి కమలాకర్ రెడ్డి పార్కు వెళ్లి సుబ్బారెడ్డి కమలాకర్ రెడ్డి ఘాటుల వద్ద పుష్పాంజలి సమర్పించి ఘన నివాళులు అర్పించారు. డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి వారి సతీమణి నందిని, విద్యాధర్ రెడ్డి తన్విక బూచేపల్లి వెంకాయమ్మ వారి కుమార్తె ధనలక్ష్మి, దివంగత కమలాకర్ రెడ్డి కుమారుడు రిలాసారెడ్డి, హాసిని, వారి కుటుంబ సన్నిహితులు రత్నం, రామకృష్ణ కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. బూచేపల్లి కళ్యాణమండపం వద్ద స్వర్గీయ సుబ్బారెడ్డి స్వర్గీయ వైయస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. కళ్యాణ మండపంలో వారి చిత్రపటానికి పుష్పాలంకరణ చేసి జ్యోతి ప్రజ్వలన గావించారు. సుమారు వెయ్యి మంది దళిత మహిళలకు ఈ సందర్భంగా చీరలు పంపిణీ చేసి అన్నదానం నిర్వహించారు. ఎర్రగొండపాలెం ఎమ్మెల్యే చంద్రశేఖర్, చీమకుర్తి ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, చీమకుర్తి జడ్పిటిసి సభ్యులు వేమా శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షులు పమిడి వెంకటేశ్వర్లు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి మన్నం శ్రీధర్ బాబు, దర్శి నియోజకవర్గం ఒంగోలు చీమకుర్తి మండలాల నుంచి పెద్ద ఎత్తున బూచేపల్లి అభిమానులు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు విచ్చేసి నివాళులర్పించారు.

## వధువరులను ఆశీర్వదించిన మాజీమంత్రి శిద్దా రాఘవరావు దంపతులు

**ఒంగోలుటౌన్, ప్రభాతవార్త**



ఒంగోలు లింగారెడ్డి పంక్షన్ హాల్‌లో జరిగిన కూరపాటి శ్రీనివాసరావు, ఆదిలక్ష్మీల కుమారుడు వెంకట దుర్గఫణిధర్, లక్ష్మీ సుమకావ్యల వివాహ రిసెప్షన్‌లో మాజీ మంత్రి శిద్దా రాఘవరావు,లక్ష్మీ పద్మావతి పాల్గొని వధువరులను ఆశీర్వదించారు.

## మాజీ మంత్రి రజనిపట్ల అనుచితంగా ప్రవర్తించడం సిగ్గుచేటు

- ఒంగోలు వైసీపీ ఇన్‌ఛార్జీ చుండూరి, జిల్లా మహిళా అధ్యక్షురాలు దుంపా

**ఒంగోలు, ప్రభాతవార్త**



మాజీ మంత్రి, డీసీ నేత విడదల రజిని పట్ల చిలకలూరిపేట రూరల్ సీఐ సుబ్బనాయుడు అనుచింతగా ప్రవర్తించడం సిగ్గుచేటని, అదే విధంగా రెండు రోజుల క్రితం కంతేరులోనూ పార్టీ ఎంపీటీసీ అయిన కల్పన దళిత మహిళను రాత్రి 3గంటల సమయంలో పోలీసులు దౌర్జన్యంగా అరెస్టు చేశారని ఇది దుర్మార్గపు చర్య అని వైఎస్సార్‌సీపీ ఒంగోలు అసెంబ్లీ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు, జిల్లా మహిళా అధ్యక్షురాలు దుంపా రవణమ్మలు పేర్కొన్నారు. బీసీ,దళిత మహిళలపై కూటమి ప్రభుత్వం వరుస దాష్టీకాలను ఖండిస్తూ ఆదివారం జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఒంగోలు అసెంబ్లీ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు, జిల్లా మహిళా అధ్యక్షురాలు దుంపా రవణమ్మలు విలేకర్ల సమావేశం నిర్వహించి మాట్లాడారు. చంద్రబాబు కక్ష సాధింపు చర్యలు వెర్రితలలు వేస్తున్నాయన్నారు. దేశంలో యుద్దవాతావరణం నెలకొని ఉంటే చంద్రబాబు మాత్రం రాష్ట్రంలో అరాచకాలు చేస్తున్నాడని, ఓ వైపు దేశంలోని ప్రజలంతా ఉగ్రవాదులను మట్టుబెట్టాలన్న సంకల్పంతో రక్షణ బలగాలకు సంఘీభావం తెలిపితే ఈ రాష్ట్రంలో చంద్రబాబు ఇక్కడ ప్రతిపక్ష పార్టీలను ఏ రకంగా కట్టడి చేయాలి, ఎలా కక్షలు తీర్చుకోవాలని అన్నదానిపై దృష్టి పెట్టాడన్నారు. చంద్రబాబునాయుడు లాంటి రాజకీయ నాయకుడ్ని ఎక్కడా చూసి ఉండం, లేని లిక్కర్ స్కాంను సృష్టించి అబద్దాలను ఆరోపణలుగా మార్చి దాని చుట్టు కక్ష తీర్చుకునే క్రమంలో ఓ వైపు జగన్ చుట్టూ ఉన్న వ్యక్తులను టార్గెట్ చేయడమే కాకుండా, మరో వైపు వైఎస్సార్‌సీపీ పార్టీ నాయకులు, కార్యకర్తలపై కక్షలు తీర్చుకునే కార్యక్రమాన్ని చంద్రబాబు చేస్తున్నాడు. మాజీ మంత్రి విడదల రజని పట్ల నిన్న చిలకలూరిపేట సీఐ వ్యవహరించిన తీరును రాష్ట్రం దేశం మొత్తం చూసింది. పల్నాడు జిల్లా నాందెడ్ల మండలం మానుకొండ వారిపాలెం ఓ కుటుంబాన్ని పరామర్శించడానికి వెళ్లిన మాజీ మంత్రి రజనిపై పోలీసులు దౌర్జన్యంకు పాల్పడ్డారు. వైసీపీకి చెందిన శ్రీకాంత్‌ను అరెస్టు చేయడానికి పోలీసులు ప్రయత్నించారు. దీనిపై పోలీసులను ప్రశ్నించిన రజనిపై సీఐ సుబ్బారాయుడు దౌర్జన్యంగా వ్యవహరించారు, ఏ కేసులో శ్రీకాంత్‌ను అరెస్టు చేస్తున్నారో చెప్పాలని విడదల రజిని పోలీసులను నిలదీశారని, దీనికి సమాధానం చెప్పకుండానే విడదల రజిని కారు లో ఉన్న శ్రీకాంత్‌ని తీసుకెళ్లడానికి విడదల రజినిని నెట్టివేసి, శ్రీకాంత్‌ను అదుపులోకి తీసుకున్నారన్నారు. మాజీ మహిళా మంత్రి అని కూడా చూడకుండా పోలీసులు ప్రదర్శించిన వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పోలీసులు చేస్తున్న ఈ దుర్మార్గాలను ఎల్లోమీడియా, ఎల్లో పత్రికలు వక్రీకరిస్తూ, తాము ఎలా వార్తలు రాస్తే, అవే నిజాలు అనుకోవాలని, తాము ఏ పద్దతి చెప్తే, దాన్నే చట్టంగా చూడాలని ఒక వితండవాదాలను జనం మీదకు రుద్దే ప్రయత్నం చేస్తున్నారని, ప్రజలు వీటన్నింటిని గమనిస్తున్నారని అన్నారు.

# ప్రకాశం



తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## అభివృద్ధి కార్యక్రమాలకు శంఖుస్థాపన చేసిన ఎమ్మెల్యే దామచర్ల

**ఒంగోలు, ప్రభాతవార్త**



ఒంగోలు నగరంలోని సౌత్‌బైపాస్ రోడ్డు ఎస్ఎస్ ట్యాంకు నందు 70 లక్షలతో నిర్మించనున్న సెంటర్ డివైడర్‌కు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో నగర మేయర్ గంగాడ సుజాత, శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్, కమిషనర్ కె వెంకటేశ్వర్లు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

## నగర పాలక.. అభివృద్ధి సాగక..

- అధికారులు ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయం లోపం
- వివిధ పనులపై తీవ్ర ప్రభావం

**ఒంగోలు, ప్రభాతవార్త**

ఒంగోలు నగర పాలక సంస్థ పరిధిలో అభివృద్ధి ఆటకెక్కింది. అధికారులు, ప్రజా ప్రతినిధుల మధ్య సమన్వయ లోపంతో పనులు ముందుకు సాగడం లేదు. అధికారులు, గుత్తేదారులు రెండు వర్గాలుగా విడిపోయారు. ఫలితంగా ఎవరికి వారు రాజకీయం చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల పలువురు గుత్తేదారులు కలిసి సమావేశం నిర్వహించారు. తమకు బిల్లులు చెల్లించడం లేదంటూ కొందరు వాపోతున్నారు. మరో వైపు టెండర్లు దక్కించుకున్న పలువురు గుత్తేదారులు పనులు చేయడం లేదు. అలా ప్రారంభించి వదిలేస్తుండటంతో అభివృద్ధి పనులపై తీవ్ర ప్రభావం పడుతుంది. నగరంలోని ఒక వార్డు పరిధిలోని కల్వర్టుతో పాటు కాలువలు నిర్మించేందుకుగాను గతంలో శిలాఫలకం వేశారు. కల్వర్టు పనులు చేశారు. రహదారికి ఇరువైపులా కాలువ పనులు చేపట్టాల్సి ఉంది. నెల గడిచినా ఇప్పటి వరకు చేపట్టలేదు. బిల్లులు రావాల్సి ఉంది. అందుకే పనులు ప్రారంభించలేదని గుత్తేదారులు పేర్కొంటున్నారు. ఈ విషయాన్ని ఇటీవల జరిగిన నగర పాలక వర్గ సమావేశంలో ఒక కార్పొరేటర్ సైతం ప్రస్తావించారు. నగరంలో గత కొన్ని నెలలుగా అభివృద్ధి పనుల్లో తీవ్రమైన స్తబ్దత నెలకొంది. పాలకులు శిలాఫలకాలు ఆవిష్కరిస్తున్నారే తప్ప క్షేత్ర స్థాయిలో పనులు పూర్తి ప్రారంభానికి నోచుకోవడం లేదు. తాము శిలాఫలకాలు వేసినా పనులనైనా ప్రారంభించేలా చూడండి అంటూ పాలకులు చెప్పే పరిస్థితులు నెలకొనడం గమనార్హం. ఇటీవల జరిగిన నగర పాలక సంస్థ సమావేశంలో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ పనులు టెండర్లు వేసి పనులు చేపట్టని వారిని బ్లాక్‌లిస్టులో పెట్టమని, పనులు చేస్తేనే బిల్లులు చెల్లించమని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. నగర పాలక సంస్థ పరిధిలో అధికారులు మధ్య సమన్వయం లోపం, కార్పొరేటర్ల మధ్య సమన్వయం లేకపోవడంతో పనులు నత్తనడకన నడుస్తున్నారు. గుత్తేదారులు సైతం చెరోవర్గంలో చేరిపోయి రాజకీయం చేస్తున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో అభివృద్ధి పనుల విషయంలో గందరగోళం నెలకొంది. దీంతో పాటు బిల్లుల సమస్య నెలకొంది. పలువురు వివిధ పనులు చేసినా బిల్లులు కోసం తిరగాల్సిన పరిస్థితి. కార్యాలయ సిబ్బంది కొంత మందికి సహకరిస్తున్నారనే వాదన వినిపిస్తుంది. పనులు ప్రారంభించకపోవడం, నిర్ధేశించిన పనులు గడువులోపు పూర్తిచేయకపోవడం, మధ్యలో పనులు ఆపేసిన గుత్తేదారులపై అధికారులు చర్యలు తీసుకునేందుకు ఏ మాత్రం సాహసించడం లేదు. నాణ్యతా ప్రమాణాలు పాటించని గుత్తేదారులకు కొందరు




పూర్తి సహకారం అందిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అధికారుల మధ్య సమన్వయం లోపం వల్ల, అధికారులు చెప్పిన మాట కొందరు క్రింది స్థాయి అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. తెలుగుదేశం, జనసేన కార్పొరేటర్లు కూటమిలో భాగమైనా ఇంకా వారంతా ఒక తాటిపైకి వచ్చిన దాఖలాలు లేవు. ఒంగోలు నగర పాలక సంస్థలో స్టాండింగ్ కమిటీ ఏడాదికి ఒక సారి నియమించాల్సి ఉండగా ఇంత వరకు రెండో సంవత్సరం పూర్తి కావస్తున్నా ఇంత వరకు స్టాండింగ్ కమిటిని కొత్త వారిని నియమించిన దాఖలాలు లేవు. ఇటీవల కొందరు తెలుగుదేశం కార్పొరేటర్లు ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావుకు మేయర్ గంగాడ సుజాతపై ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. తమ వార్డులలో పనులు పెట్టడం లేదని, తమకు ఇష్టమైన వారికే పనులు పెడుతున్నట్లు వారు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ విషయంపై ఎమ్మెల్యే తాను మేయర్‌ను పిలిచి మాట్లాడతానని వారికి హామీ ఇచ్చినట్లు సమాచారం. ఇటీవల కార్పొరేషన్ సమావేశంలో జనసేన కార్పొరేటర్ మలగా రమేష్ అధికారుల తీరుపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ కూటమి ప్రభుత్వంలోనే జనసేన కూడా ఉందని, అలాంటిది తమ డివిజన్‌లో సమస్యలను కమీషనర్ దృష్టికి తీసుకువస్తే ఒక పని మొదలు పెట్టి మధ్యలోనే ఆపేశారని ఆయన మండిపడ్డారు. జనసేన నాయకుడు, డిప్యూటీ మేయర్ వెలనాటి మాధవరావు, జనసేన నాయకుడు, కార్పొరేటర్ ఈదర సురేష్‌బాబులు మాట్లాడుతూ ఎమర్జెన్సీ కింద వర్కులకు ముందస్తు అనుమతులు తీసుకొని కూడా పనులు ప్రారంభించకుండా ఉండడానికి కారణం ఏమిటని నిలదీశారు. అలాంటప్పుడు ఎందుకు ముందస్తు అనుమతులు తీసుకోవాలని వారు పేర్కొన్నారు. స్టాండింగ్ కమిటీ లేకపోవడంతో ముందస్తు అనుమతులు తీసుకుని పనులు ప్రారంభించకుండా ఉండడం వెనక మతలబు ఏమిటని వారు ప్రశ్నించారు. భాగ్యనగర్ హైసింగ్ బోర్డు ఏరియాలో సాయంత్రం ఇవ్వాల్సిన నీరు మరుసటి రోజు ఉదయం ఇస్తున్నారని ఈదర సురేష్‌బాబు అన్నారు. నగరంలో మంచి నీటి తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉందని, ఒంగోలు నగరంలోని 30వ డివిజన్‌లోని గాంధీ నగర్‌లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని అర్ధరాత్రి పూట ఎప్పుడిస్తారో తాగునీరు అర్ధంకాని పరిస్థితిలో ఉంది. వేళపాళ లేకుండా రాత్రి వేళల్లో అర్ధరాత్రి పూట ఎప్పుడుపడితే అప్పుడు నీళ్ల వదులుతున్నారని కోఆప్షన్ మెంబర్ షేక్ రషీద అన్నారు. ఈ మురికివాడ ప్రాంతాల్లో రాత్రి వేళ నీటి కోసం జాగరం చేయాల్సి వస్తుందని పలువురు ఆరోపిస్తున్నారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు తాగునీటి విషయం, పారిశుధ్య విషయంలో ఎలాంటి రాజీపడేది లేదని, అధికారులపై ఈసారి ఇలాంటివి తన దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటానని ఆయన హెచ్చరించినట్లు సమాచారం.

## క్లబ్ సేవలు విస్తృతం కావాలి -మండవ మురళీకృష్ణ

**ఒంగోలు టౌన్, మే 11, ప్రభాతవార్త**



ప్రకాశం జిల్లా కమ్మవారి సేవా సంఘం 13 డోనార్స్ క్లబ్ సభ్యుల ఆత్మీయ సమావేశం స్థానిక బృందావనం ఫంక్షన్ హాలులో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ కమ్మ వారి సేవా సమాఖ్య ట్రస్ట్ ఛైర్మన్ మండవ మురళీకృష్ణ మాట్లాడుతూ విద్యా, వైద్యం, క్రీడలు, స్వయం ఉపాధి అంశాలపై క్లబ్ సేవలు అన్ని కమ్మ సంఘాలు స్ఫూర్తిగా తీసుకునే విధంగా ఉండాలన్నారు. సమావేశంలో డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, డాక్టర్ నామినేని కిరణ్, బెల్లం కోటయ్య, కామని చినబాబు, లింగమనేని వెంకట్రామయ్య, చిడిపోతు వెంకటేశ్వర్లు, గోరంట్ల రవికుమార్, కాట్రగడ్డ రఘుపతి, మండవ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక పార్లమెంట్ సమావేశం నిర్వహించాలి

- పాలపర్తి విజేష్‌రాజ్ డిమాండ్

**ఒంగోలు టౌన్, మే 11, ప్రభాతవార్త**



పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్, కాల్పుల విరమణపై ప్రధాని మోడి ప్రత్యేక పార్లమెంట్ సమావేశం నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ సంతనూతలపాడు నియోజకవర్గ కోఆర్డినేటర్ పాలపర్తి విజేష్‌రాజ్ డిమాండ్ చేశారు. స్థానికంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ పహల్గాం ఉగ్రదాడి నిఘా వర్గాల వైఫల్యమేనని, భారత సాయుధ దళాల ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్తాన్ బెంబేలెత్తి పోయిందని, అయితే కాల్పుల విరమణకు షరతులపై అపోహలు తలెత్తడంతో కేంద్రానికి సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉందన్నారు. కాశ్మీర్ సమస్య వెయ్యేళ్ల పాటు ఉంటుందా, అవసరమైతే మధ్యవర్తిత్వం వహిస్తామని అమెరికా అధ్యక్షుని వ్యాఖ్యలపై కేంద్రం స్పందించాల్సి ఒదేనన్నారు.

## నా ప్రాణం.. నా ప్రయాణం దర్శి ప్రాంత ప్రజలతోనే..





**దర్శి, మే 11, ప్రభాతవార్త**

దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జీ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ పుట్టిన రోజు వేడుకలు దర్శి నియోజకవర్గంలో ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముందుగా మాజీ మంత్రి స్వర్గీయ గొట్టిపాటి హనుమంతరావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సింగరకొండలోని శ్రీ ప్రసన్నాంజనేయస్వామివారి దేవస్థానంలో పూజల నిర్వహించి స్వామివారి ఆశీర్వాదం తీసుకున్నారు. వేంపాడులోని ఆంజనేయస్వామి వారి దేవస్థానంలో పూజలు నిర్వహించి స్వామివారి ఆశీర్వాదం తీసుకున్నారు. పోలవరం గ్రామ ఎంట్రన్స్ ఆర్చి వద్ద కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలలో పాల్గొన్నారు. ముండ్లమూరులో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలలో పాల్గొన్నారు. ఉల్లగల్లు గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి కేక్‌కట్ చేసి జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు. దర్శి మున్సిపల్ కార్యాలయం వద్ద పారిశుధ్య కార్మికులతో కలిసి జన్మదిన వేడుకలు జరుపుకొని తదుపరి కార్మికులకు నూతన వస్త్రాలు అందజేశారు. పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి ఆర్యవైశ్య నాయకులు, మహిళలు ఏర్పాటు చేసిన కేక్ కట్ చేసి జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు. దర్శి గడియారస్తంభం వద్ద తెలుగు తమ్ముళ్లు బత్తాయిలతో తయారు చేసిన గజమాలతో డాక్టర్ లక్ష్మీని సత్కరించారు. తదుపరి ఎన్టీఆర్, నారపుశెట్టి శ్రీరాములు విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. దర్శిలోని డాక్టర్ లక్ష్మీ నివాసం వద్ద కూటమి శ్రేణులు ఏర్పాటు చేసిన కేక్ కట్ చేసి అబిమానుల మధ్యలో దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జీ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ జన్మదిన వేడుకలలో టీడీపీ యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్, మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు ఉన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మీ మాట్లాడుతూ నాపై అభిమానంతో తరలివచ్చిన నా కుటుంబ సభ్యులారా, పెద్దలారా, టీడీపీ నాయకులారా కార్యకర్తలారా, అభిమానులారా మీ అభిమానాన్ని నేనెప్పటికి మర్చిపోను, తెలుగుదేశం కుటుంబ సభ్యులు అందరికి పాదాభి వందనం చేస్తున్నాని అన్నారు. నేను ఈ రోజు నా బర్తడే జరుపుకోవడానికి రాలేదు, బర్తడే కేక్ కటింగ్ కూడా చేయడం నాకు అంతపెద్దగా ఇష్టం ఉండదు. అయితే నేనొక విషయం చెప్పడానికి మాత్రం మీ ముందుకు వచ్చాను, నా ప్రయాణం దర్శి ప్రజానికంతో ఏడాది పూర్తియింది. ఏడాదిలో మనం ఏం చేశాం, నన్ను మీరు ఎందుకు మీ కుటుంబ సభ్యురాలుగా చూస్తున్నారని చెప్పడానికి వచ్చాను, నన్ను ఎన్నికలకు ముందు స్థానికేతురాలు అని ప్రచారం చేశారు. స్థానికులం మేమని మిమ్మలను భ్రమల్లో పెట్టి

- ఘనంగా దర్శి అభివృద్ధి ప్రదాత డాక్టర్ గొట్టిపాటి లక్ష్మమ్మ జన్మదిన వేడుకలు
- నిరుపేదలకు చీరలు పంపిణీ చేసిన డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ



కుల మతాలు రెచ్చగొట్టే సాంకేతికంగా స్వల్ప తేడాతో గెలుపు చూయించుకున్నారు. నేను ఓడిపోలేదు, నాకు ఓటు వేయని ప్రజలే ఓడిపోయారు. దర్శి అభివృద్ధిలో కొంచెం వెనుక పడడానికి నా ఓటమి కారణమైంది. సాంకేతికంగా ఓడినా ప్రజల హదయాల్లో గెలిచాను. కొందరు కుట్రలు చేశారు. దాడులకు తెగపడ్డారు. అందుకే సాంకేతికంగా నేను ఓడిపోయాను. ప్రజలకు అర్ధమైంది. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐటీ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ప్రజా ప్రభుత్వంగా ప్రజలకు చేస్తున్న మేలు చేస్తున్నారు. ఈ 11 నెలల కూటమి పాలనలో దర్శిలో అనేక అభివృద్ధి పనులు చేపట్టి అడుగులు ముందుకు వేయగలుగుతు న్నాము. ప్రజల విరాళాలతో వైసీపీ నిర్లక్ష్యానికి నిదర్శనంగా ఉన్న టీడీపీ కళ్యాణ మండపాన్ని పనులు ప్రారంభించుకున్నాం. త్వరలో అన్నా క్యాంటీన్ నిర్మాణం ప్రారంభమవుతుంది. ఇందుకు రూ.60లక్షల నిధులు మంజూరయ్యాయి. 15 కోట్లతో గ్రామాలలో రోడ్లు, డ్రైయిన్లు వంటి అభివృద్ధి పనులు చేపట్టాం. ఐదు కోట్లతో ప్రధాన రహదారి నిర్మాణాలు మరమ్మతులు చేపట్టాం. 6.30 కోట్ల రూపాయలతో గురుకుల పాఠశాల భవనాలు నిర్మించుకుంటున్నాం. ఇప్పటికే లోకేష్‌ని కోరడం జరిగింది. డిగ్రీ కళాశాల భవనాలకు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని, త్వరలో ఆ నిధులు కూడా మంజూరు అవుతున్నాయి. ఉచిత మెగా మెడికల్ క్యాంపు, కంటి వైద్య శిబిరాలు, జాబ్ మేళాలు, ఇలా ప్రజలకు మంచి చేయాలన్న తలంపుతో అటు సంక్షేమం, ఇటు అభివృద్ధితో పాటు సేవా కార్యక్రమాలకు ముందుండి పనిచేస్తున్నాం. అదే విధంగా దర్శిలో ఇంటర్నేషనల్ డ్రైవింగ్ స్కూల్ తిరిగిమన ప్రభుత్వంలో ముందుకు తీసుకెళ్లబోతున్నాం. దర్శిలో ఉన్న మినీ స్టేడియం నిర్మాణం, కోల్డ్ స్టోరేజ్ నిర్మాణం నగర పాలక పంచాయతీకి శాశ్వత భవన నిర్మాణం. రోడ్‌లు, డ్రెయిన్‌లు వంటి పలు మౌలిక సదుపాయాలకు పెద్ద పీట వేస్తున్నాం. దొనకొండ ప్రాంతాన్ని కరువులేని ప్రాంతంగా మార్చేందుకు కృషి చేస్తున్నాను. దొనకొండ విమానాశ్రయ ప్రాంతాన్ని పారిశ్రామిక ప్రాంతంగా మార్చి ఉపాధి అవకాశాలకు కృషి చేస్తున్నారు. ఇప్పటికే కేంద్ర పౌర విమానాయాన శాఖ మంత్రి రామ్‌మోహన్ నాయుడుని కలవడం జరిగింది. ఆయన కూడా అందుకు సానుకూలంగా ఉన్నారు. అదే విధంగా దర్శి పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో వసతులను మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నాను. అంతే కాకుండా దొనకొండలో సోలార్ పార్కుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం ఒక మంచి పరిణామంగా చెప్తున్నాను. మా బాబాయి గొట్టిపాటి రవికుమార్‌ని ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందిస్తున్నాను. అదే విధంగా నాకు అండగా దోలా బాల వీరాంజనేయస్వామి ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి ఇలా అనేకమంది పెద్దలు నా వెంట ఉండి నడిపిస్తున్నారు. నేను ఒక్కటే చెప్తున్నాను. నాది అభివృద్ధి మంత్రం నేను దర్శిని అభివృద్ధి ప్రాంతంగా మార్చడమే నా లక్ష్యం, కులమతాలకు అతీతంగా, రాజకీయాలకు అతీతంగా రాబోయే 25 ఏళ్లు దర్శి ప్రజలతో ఉంటాను. అభివృద్ధి చేసి చూపిస్తానని మరొక్క సారి ఈ సందర్భంగా మాట ఇస్తున్నాను. కేంద్ర పీఎం నిధికి చేతనైన వరకు మనం కూడా ఈ యుద్ద సమయంలో వితరణ ఇస్తే బాగుంటుంది. నా వంతుగా నేను ఒక లక్ష రూపాయలు సీఎం సహాయినధి పంపేందుకు సిద్దమయ్యాను. కార్యక్రమంలో దర్శి మార్కెట్ యార్డ్ ఛైర్మన్ దారం నాగవేణి-సుబ్బారావు, దర్శి మున్సిపల్ ఛైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, దొనకొండ, కురిచేడు,ముండ్లమూరు, తాళ్లూరు, దర్శి, పట్టణ అధ్యక్షులు నాగులపాటి శివకోటేశ్వరరావ, పిడతల నెమిలయ్య, కూరపాటి శ్రీను, బొమ్మిరెడ్డి ఓబుల్‌రెడ్డి, వాసు, చిన్నా బీజేపీ నాయకులు మండపాకుల శ్రీను, తిండి నారాయణరెడ్డి, జనసేన నాయకులు పుప్పాల పాపారావు, మాదాసు వెంకట శేషయ్య, కూటా ల ప్రసాద్, తోట రామారావు, వివిధ హోదాల్లో ఉన్న టీడీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు వైద్యశాల ప్రారంభానికి రానున్న మంత్రి గొట్టిపాటి

**అద్దంకి ,మే 11, ప్రభాతవార్త**



రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సోమవారం అద్దంకి పట్టణంలో శ్రీనగర్ సమీపంలో వర్ణిక ఆర్థో స్కిన్ ట్రామా కేర్ సెంటర్‌ను ఉదయం 10.30గంటలకు ప్రారంభించనున్నారు. అదే విధంగా ఉదయం 9గంటలకు ఏడుగుండ్లపాడులో హర్షిణి ఇంజనీరింగ్,టెక్నాలజీ మహిళా కళాశాల ప్రారంభోత్సవం, 10.30గంటలకు అద్దంకి టౌన్‌లోని 5వ వార్డు, 10.45కు 19వ వార్డు, 11.30 గంటలకు జె.పంగులూరు మండలం రామకూరు, సాయంత్రం 3గంటలకు ఐటిసి ప్రతినిధులతో ప్రకాశం జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ పాల్గొంటారని ఆయన క్యాంపు కార్యాలయ ప్రతినిధి ఒక ప్రకటనలో తెలియజేశారు.

## ముఖమండపానికి లక్ష విరాళం

**అద్దంకి ,మే 11, ప్రభాతవార్త**



ప్రసిద్ద పుణ్యక్షేత్రమైన సింగరకొండ శ్రీ ప్రసన్నాంజనేయస్వామి రాతి ముఖ మండవ నిర్మాణం కొరకు మండలంలోని బొమ్మనంపాడు గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ పద్మావతి దంపతులు ఆలయ ఎసి తిమ్మనాయుడుకు రు.1,00,116లు విరాళంగా అందజేశారు.

## రోటరీ ఆధ్వర్యంలో ఘనంగా మాతృ దినోత్సవం

**అద్దంకి , మే 11, ప్రభాతవార్త**



రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ అద్దంకివారి ఆధ్వర్యంలో పూర్వపు అధ్యక్షులు సయ్యాద్ మౌలాలి సౌజన్యంతో షాదీఖానాలో అంతర్జాతీయ మాతృమూర్తుల దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా 6గురు మాతృమూర్తులకు నూతన వస్త్రాలను బహుకరించి, శాలువాలతోను,పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు చప్పిడి వీరయ్య, సెక్రటరీ మురళీసుధాకరరావుతోపాటు పలువురు పాల్గొన్నారు.

## మాజీ ఎంపిటిసి పుట్టిన రోజు కార్యక్రమం





**అద్దంకి , మే 11 ప్రభాతవార్త**

అద్దంకి ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యులు, మాజీ ఎంపిటిసి ధర్మవరపు నాగేశ్వరరావు పుట్టినరోజు కార్యక్రమం ఆదివారం ఆయన కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కేక్‌ను నాగేశ్వరరావు కట్‌చేయగా ఆయన మిత్రులు, శ్రేయోభిలాషులు, అభిమానులు పాల్గొన్ని కేక్ తినిపించి, డిఎన్ఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## ఘనంగా గొట్టిపాటి లక్ష్మి జన్మదిన వేడుకలు

**సంతమాగులూరు, మే 11, ప్రభాతవార్త**





సంతమాగులూరు మండలం పుట్టవారి పాలెం కూడలిలో దర్శి టీడీపీ ఇన్ చార్జి గొట్టిపాటి లక్ష్మి జన్మదిన వేడుకలు కూటమి కార్యకర్తల మధ్య ఆదివారం ఘనంగా జరిపారు. నరసరావుపేట ప్రముఖ వైద్యులు కడియాల లలిత ్ సాగర్ ను వివాహం చేసుకున్న సర్గీయ మంత్రి గొట్టిపాటి హనుమంతరావు పెద్దకుమారుడు మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ గొట్టిపాటి నరసింహారావు కుమార్తె మాజీ పర్చూరు వైసీపీ ఇన్‌చార్జి గొట్టిపాటి భరత్ సోదరి అయిన గొట్టిపాటలక్ష్మి అద్దంకి నియోజకవర్గంతో పాటు ఉమ్మడి ప్రకాశం జిల్లా వాసులకు గొట్టిపాటి లక్ష్మి హనుమంరతరావు మనుమరాలుగా నరసయ్య కుమార్తెగా నరసరావుపేట ప్రముఖ వైద్యశాల కడియాల హస్పిటల్ అధినేత కడియాల వెంకటేశ్వరరావు కొడలుగా సుపరిచితమే. ఈనేపద్యంలో తన జన్మదిన వేడుకలు జరుపుకునేందుకు దర్శి వెళుతుండగా గొట్టిపాటి లక్ష్మి కడియాల లలిత్ సాగర్ దంపతులను స్థానిక కూటమి నేతలు కార్యకర్తలు సంతమాగులూరు మండలంలో స్వాగతించారు. పుట్టవారిపాలెం కూడలిలోని సర్గీయ మంత్రి గొట్టిపాటి హనుమంతరావు విగ్రహనికి పూలమాలలు వేసి నివాళులర్పించిన తరువాత గొట్టిపాటి లక్ష్మి కడియాల లిలత్ సాగర్‌లు కార్యకర్తల హర్షద్వానాల మద్య లక్ష్మి జన్మదిన కేక్‌ను కట్ చేసి ఆనందాన్ని అందరితో పంచుకున్నారు. గొట్టిపాటి లక్ష్మికి దంపతులకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపినవారిలో టీడీపీ రాష్ట్ర నాయకులు అట్లా చిన్న వెంకటరెడ్డి, సంతమాగులూరు మండల నాయకులు చేవూరి వాసురెడ్డి, మహిళా రాయకురాలు కొనికి గోవిందమ్మ, నాగబోతు సుజాత, అట్లా పెద్ద వెంకటరెడ్డి, దుద్దేల చిన్నగాలయ్య, మండల సర్పంచుల సంఘ అధ్యక్షులు సన్నెబొయిన గురుబ్రహ్మం,ఆలూరి శ్రీనివాసరావు, చింతారామారావు, చింతా శ్రీదర్‌బాబు, డీసీ అధ్యక్షులు కామాను శ్రీనివాసరావు, కంచేటి మురళి, తేలప్రోలు వెంకట్రావు, మండల పార్టీ అధ్యక్షులు గాడిపర్తి వెంకట్రావు, గుండపునేని సురేష్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి దూపాటి ఏసోబు, మాజీ ఎంపీపీ సన్నెబొయిన ఏడుకొండలు, బోతాదు భాషా, అఫీజ్ , వసుపులేటి కోటేశ్వరరావు, వంకాయల పాటి హరిబాబు, ముప్పాళ్ల శ్రీనుబాబు, మర్లపాటి రాజశేఖర్ ,కందిమళ్ల శ్రీను, పెరుమాళ్ల వీరయ్య, మక్కెన జగదీష్, మక్కెన శ్రీనివాసరవు, గొట్టిపాటి చౌదరిబాబు, గంధ్రు వీరబ్రహ్మం, మాగులూరి సోమేశ్వరరావు, నిడమానూరి కోటేవ్వరరావు, చావా వెంకటేశ్వర్లు, పరిటాల వెంకయ్య, రావిరేకల కాశీవిశ్వనాదం, షేక్ బోడే, చల్లా కోటేశ్వరరావు, చల్లా వెంకట కృష్ణ, జిర్రా విజయబాబు, ప్రత్తి పాటి వీరయ్యలు ఉన్నారు.

### గ్రంధాలయంలో 11వ రోజు కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరం

**సంతమాగులూరు ,మే 11, ప్రభాతవార్త**



సంతమాగులూరు గ్రందాలయంలో ఆదివారం 11వ రోజు కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరం కొనాగింది. గత 11 రోజులుగా సాగుతన్న ఈశిభిరాన్ని గ్రందాలయ పాలకుడు బాదం వియయభాస్కరరెడ్డి విద్యార్థులకు, వయోజనులకు కావలసిన అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

## ఘనంగా గొట్టిపాటి లక్ష్మీ జన్మదిన వేడుకలు

**కురిచేడు, మే 11, ప్రభాతవార్త**



మండల కేంద్రమైన కురిచేడులో ఆదివారం దర్శి టీడీపీ ఇన్‌ఛార్జ్ గొట్టిపాటి లక్ష్మి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఆ పార్టీ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షుడు పిడతల నెమిలయ్య ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిగాయి. తొలుత కేక్ కోసి తమ నాయకురాలికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అందరూ లక్ష్మీకి శుభాకాంక్షలు తెలిపారు. తమ నాయకురాలు అష్టైశ్వర్యాలతో భోగభాగ్యాలతో ఉండాలని, ఎప్పుడూ దర్శి నియోజకవర్గ ప్రజల సేవకు అంకితమై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ మాజీ అధ్యక్షుడు కాట్రాజు నాగరాజు, నాయకులు కిలారి కొండయ్య, మొగల్ మస్తాన్‌వలి, డిష్ వెంకటేశ్వర్లు, మేడం నాగేశ్వరరావు, గడ్డం బాలయ్య, మేరువ పెద్దిరెడ్డి, బొల్లేపల్లి ఆదినారాయణ, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## తీకెనం వారి వివాహ వేడుకలో కదిరి బ్రదర్స్

**సీఎస్‌పురం, మే 11, ప్రభాతవార్త**



శీలంవారిపల్లె గ్రామానికి చెందిన తీకెనం గురుస్వామి గారి కుమార్తె జ్ఞాపిక, సంతోష్‌ల వివాహ వేడుక ఆదివారం తెలంగాణ రాష్ట్రం మహబూబ్ నగర్ పట్టణంలోని బృందావన్ గార్డెన్స్‌లో జరిగింది. ఈ వివాహ వేడుకలో కదిరి బాబురావు విద్యాసంస్థల చైర్మన్ కేవీ ప్రకాష్‌రావు, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కదిరి పార్థసారధి పాల్గొని నూతన వధూవరులనుఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కదిరి రమణయ్య, ఇరగని చలపతిరావు, తీకెనం బ్రదర్స్ తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

**సంతమాగులూరు, మే 11, ప్రభాతవార్త**



గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన అద్దంకి నార్కెట్ పల్లి రహదారిపై సంతమాగులూరు మండలం మక్కెనవారిపాలెం గ్రామం సమీపంలో జరిగింది. ఈఘటనలో అద్దంకి ఎన్‌టీఆర్ కాలనీకి చెందిన గుంజి రామారంజనేయులు (38) కన్నుమూశాడు. ఈఘటనకు సంబంది పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

### దేశ సరిహద్దు ఉద్రిక్తతల నేపద్యంలో పుట్టవారిపాలెంలో పోలీసుల వాహన తనిఖీలు


**సంతమాగులూరు ,మే 11, ప్రభాతవార్త**



భారత్ -పాకిస్తన్ దేశ సరిహద్దు ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపద్యంలో పుట్టవారిపాలెం కూడలిలలో సంతమాగులూరు పోలీసుల ఆకిస్మఖంగా వాహన తనిఖీలు చేపట్టారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సంతమాగులూరు సీఐ వెంకట్రావు సూచనలతో ఎస్సై పట్టాభిరామయ్య,ఏఎస్సై శ్రీనివాసరావులు తన సిబ్బందితో అద్దంకి-నార్కెట్‌పల్లి, గుంటూరు- కర్నూలు రహదారిలో ప్రయాణించే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు చేశారు.

## విద్యుత్ లైన్లకు మరమ్మత్తు పనులు

**బల్లికురవ, మే 11, ప్రభాతవార్త**



మండల కేంద్రమైన బల్లికురవలో తరచూ ఏర్పడే విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతూ గత మూడు రోజులుగా మరమ్మత్తు పనులు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశాలతో సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపనున్నారు. అంతే కాకుండా గత వారం వీచిన ఈదురు గాలులకు ఒరిగిపోయిన స్తంభాలను సరిచేయడంతో పాటు నూతన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తున్నారు. రైతులకు మరింత వెన్నుదన్నుగా ఉండేందుకు వ్యవసాయ విద్యుత్ కోసం ప్రత్యేక విద్యుత్ లైనును ఏర్పాటు చేశారు.ఏఈ శ్రీనివాస్ పర్యవేక్షణలో పనులు కొనసాగుతున్నాయి. ఆదివారంతో మరమ్మత్తు పనులు పూర్తవుతాయని ఏఈ వివరించారు.

## 14న వీరబ్రహ్మేంద్రస్వామి శాంతి కళ్యాణం

**బల్లికురవ, మే 11, ప్రభాతవార్త**



మండలంలోని కొనిదేన గ్రామంలో వేంచేసి ఉన్న వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ వార్షికోత్సవం, శాంతి కళ్యాణం ఈనెల 14న నిర్వహించనున్నట్లు ఆలయ అభివృద్ది కమిటీ తెలియజేసింది. అదే రోజున ఉదయం ఆలయ ప్రాంగణంలో నాగమయ్య, నాగమ్మల విగ్రహాలను ప్రతిష్టించనున్నారు. వేద పండితులు అద్దంకి శ్రీనివాసచార్యులు, నాగ బ్రహ్మచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు, ప్రతిష్ఠాపన మహోత్సవం జరగనుంది. విగ్రహ ప్రతిష్ఠ అనంతరం శాంతి కళ్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. 13వ తేదీ సాయంత్రం ప్రతిష్ఠ విగ్రహాలకు నగరోత్సవం కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలతో పాటు, అన్నసంతర్పణ కొనసాగనుంది.

## పొన్నలూరు వద్ద రోడ్డు ప్రమాదం

- తిరగబడ్డ మహేంద్ర షిప్రో వెహికల్
- స్వల్ప గాయాలతో బయటపడ్డ 30 మంది కూలీలు
- మరో ఐదుగురికి తీవ్ర గాయాలు





**పొన్నలూరు, మే 11, ప్రభాతవార్త**

కందుకూరు నుండి పొన్నలూరు వద్ద పొలం పనులకు వెళ్తున్న కూలీలను తీసుకెళ్తున్న ఏపీ 27 యుబీ 4813 నెంబర్ గల మహేంద్ర షిప్రో వెహికల్ ఆదివారం ఉదయం 10గంటల సమయంలో ముత్తరాసుపాలెం, పొన్నలూరు మధ్య బోల్తా పడింది. దాంతో ఆటోలో ఉన్న 30 మందికి పైగా కూలీలలో ఎక్కువ మందికి గాయాలైనట్లు సమాచారం. గాయాలైన వారిని కందుకూరు పట్టణంలోని ఏరియా ప్రభుత్వ వైద్యశాలతో పాటు ముప్పా రోశయ్య, హజ్మహుస్సేన్ ప్రైవేటు హాస్పిటల్‌లో చేరినట్లు సమాచారం. ప్రమాదానికి కారణం పరిమితికి మించి ఎక్కువ మందిని ఎక్కించటమేనని కూలీలు తెలుపుతున్నారు.

## చెన్నుపాడు అడ్డరోడ్డు దగ్గర బైక్ యాక్సిడెంట్





**పొన్నలూరు, మే11, ప్రభాతవార్త**

మండలంలోని చెన్నుపాడు అడ్డరోడ్డు సమీపంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి పొలంలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో రజనీకాంత్‌కు చెయ్యి ఫ్రాక్చర్ అవ్వగా, రంగస్వామికి స్వల్ప గాయాలయ్యాయి. వీరు కందుకూరు నుండి గిద్దలూరు వెళ్లే క్రమంలో ఈ ప్రమాదం జరిగింది. 108 సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని చికిత్స నిమిత్తం కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు.

## దేశవ్యాప్త జాతీయ కార్మిక సమ్మెను జయప్రదం చేయండి

- సిఐటియు జిల్లా కార్యదర్శి డికెఎం రఫి




**గిద్దలూరు, మే 11 ప్రభాతవార్త**

గిద్దలూరు సిఐటియు డివిజన్ కమిటీ విస్తృ స్థాయి సమావేశాన్ని ఆదివారం స్థానిక యుటిఎఫ్ కార్యాలయం నందు బి నరసింహులు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా కార్యదర్శి డికెఎం రఫి పాల్గొని మాట్లాడుతూ ఈనెల 20వ తేదీన దేశవ్యాప్తంగా ఉద్యోగ కార్మిక కర్షక సంఘాలు సార్వత్రిక సమ్మెకు పిలుపునివ్వడం జరిగిందని, ఈ సమ్మెలో గిద్దలూరు ప్రాంతంలో ఉన్న కార్మిక ఉద్యోగులు అందరూ పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను సవరణ చేస్తూ నాలుగు లేబర్ కోడ్స్ తీసుకురావడంతో కార్మికుల హక్కులు హరించుకుపోతున్నాయని అన్నారు. కనీస వేతన చట్టం, పిఎఫ్, ఈఎస్ఐ చట్టం, కార్మికుల సమ్మె కాలములో కార్మికులు, యజమానులు ఒప్పంద అంగీకార చట్టం, పారిశ్రామిక వివాదాల చట్టం, తదితర చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్స్ తీసుకురావడంతో కార్మికులను బాణిసలుగా మారుస్తుందన్నారు. ఈ చట్టాలను యధావిధిగా అమలు చేసేందుకు దేశవ్యాప్తంగా జరుగుతున్న సార్వత్రిక సమ్మెలో కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని అన్నారు. ఈ సమావేశంలో సిఐటియు నాయకులు టి ఆవులయ్య, డి థామస్, ఆయా కార్మిక సంఘాల నాయకులు షేక్ నూర్జహాన్, ఏ మున్నా, జి విశ్రాంతమ్మ, డి రూతమ్మ, ఐ చంటయ్య, షేక్ సమీరా, ఎం వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

## గంగమ్మ, అంకమ్మ తల్లి దేవాలయంలో ప్రత్యేక పూజలు





**బల్లికురవ, మే 11, ప్రభాతవార్త**

స్థానిక ఈర్ల గంగమ్మ తల్లి దేవాలయంలోనూ, గొర్రెపాడు అంకమ్మ తల్లి దేవాలయంలోనూ ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల పాలిట కొంగుబంగారమై బాసిల్లుతున్న ఈ దేవాలయాలలో తమ మొక్కుబడులు చెల్లించుకునేందుకు ఉమ్మడి గుంటూరు, ఉమ్మడి ప్రకాశం జిల్లాల నుండి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నసంతర్పణ కార్యక్రమాలు కొనసాగాయి.

## ఘనంగా శ్రీలక్ష్మీనరసింహాస్వామి జయంతి వేడుకలు

**అద్దంకి ,మే 11, ప్రభాతవార్త**



ప్రసిద్ద పుణ్యక్షేత్రమైన సింగరకొండపైన వేంచేసియున్న శ్రీలక్ష్మీనరసింహాస్వామి జయంతి కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి కళ్యాణ ఉత్సవాన్ని నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్ని స్వామివారి తీర్ధ ప్రసాదాలతో పాటు అన్న ప్రసాద వితరణలో కూడ పాల్గొన్నారు. ఆలయ అధికారి మద్దినేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

## శ్రీలక్ష్మీనరసింహాస్వామికి వెండి దీపారాధన కుండీ బహుకరణ

**అద్దంకి , మే 11, ప్రభాతవార్త**



ప్రసిద్ద పుణ్యక్షేత్రమైన సింగరకొండపై వేంచేసియున్న శ్రీలక్ష్మీ నరసింహాస్వామి జయంతి సందర్భంగా కడవకుదురుకు చెందిన సోమిశెట్టి వెంకటరావు 11వేల రూపాయాలు విలువ చేసే శంఖుచక్ర నామాలతో కూడిన వెండి దీపారాధన కుందీని ఆలయ అధికారి ఎం. శ్రీనివాసరావుకు అందజేశారు. అదే విధంగా అద్దంకికి చెందిన దామా వంశీకృష్ణ జ్ఞాపకార్ధం ఆయన సతీమణి రాజ్యలక్ష్మి కొబ్బరి కాయలు కొట్టె స్టాండ్‌ను ఆలయ అధికారికి అందజేశారు. దీని విలువ 15వేల రూపాయలు.

## వివాహ వేడుకల్లో పాల్గొని

### నూతన వధువరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే ముత్తుముల




**రాచర్ల, మే 11 ,ప్రభాతవార్త**

మండలంలోని చోళ్లవీడు గ్రామంలో ఆదివారం జరిగిన సొంటం మరియు బత్తినివారి వివాహ వేడుకల్లో గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి పాల్గొని నూతన వధువరులను ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలియజేశారు. రాచర్ల గ్రామానికి చెందిన సొంటం నారాయణ రెడ్డి -లక్ష్మీ దంపతుల కుమారుడు కళ్యాణ్ రెడ్డి వివాహం తనూజతో, చోళ్ళవీడు గ్రామానికి చెందిన బత్తిని కృష్ణయ్య -నీలమ్మ దంపతుల కుమారుడు కిరన్ కుమార్ వివాహం వెంకట చైతన్యలతో జరిగింది. ఈ వివాహ వేడుకలకు హాజరైన అశోక్ రెడ్డికి సొంటం మరియు బత్తిని కుటుంబ సభ్యులతో పాటు ఆయా గ్రామాల తెలుగుదేశంపార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. వివాహ కార్యక్రమం అనంతరం స్థానిక నాయకులతో కలిసి ఆయన విందు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే అశోక్ రెడ్డితో పాటు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కటిక యోగానంద్, రాచర్ల సొసైటీ బ్యాంక్ అధ్యక్షులు గోపిరెడ్డి జీవనేశ్వరరెడ్డి, కొమరోలు మండల టిడిపి అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు, గిద్దలూరు సొసైటీ బ్యాంక్ అధ్యక్షులు దుత్త బాదలీశ్వరయ్య, రాచర్ల మండలం మాజీ జడ్‌పిటిసి సభ్యులు కుప్ప రంగనాయకులు, ఎస్సీ సెల్ నాయకులు గోన చెన్నకేశవులు, మండల మరియు స్థానిక ముఖ్య నాయకులు, అంబవరం శ్రీనివాసరెడ్డి, దప్పిలి కాశిరెడ్డి, యల్లా నాగరాజు, మదరి మనోహర్, కొమరోఓలు మండల నాయకుడు దామోదర్ రెడ్డి, బత్తిని వెంకటేశ్వరరావు, బత్తిని రామకృష్ణ (ఎక్స్ ఆర్మీ), బత్తిని ఉలాపు శివశంకర్ నాయుడు, గోతం రంగయ్య, మద్దిరాల దేవరాజ్, శిరిగిరి శ్రీనివాసులు, బత్తిని పుల్లయ్య, యేలెం వెంకటేశ్వర్లు, మామిడిశెట్టి రంగస్వామి తదితరులు పాల్గొని నూతన వధువరులను ఆశీర్వదించి వారికి వివాహ శుభాకాంక్షలు తెలియజేశారు.



## వివాహ కార్యక్రమానికి హాజరైన దామచర్ల సత్య

**పొన్నలూరు, మే 11, ప్రభాతవార్త**



మండల కేంద్రమైన పొన్నలూరులో ఆదివారం నాడు గడ్డం మాలకొండయ్య కోటేశ్వరమ్మల కుమారుడు బలరాం, చప్పిడి లక్ష్మీ నరసింహం సత్యవతిల కుమార్తె హరిత వివాహ కార్యక్రమానికి రాష్ట్ర మారిటైం బోర్డు కార్పొరేషన్ చైర్మన్ దామచర్ల సత్య హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. వివాహ కార్యక్రమంలో ఆయన వెంట తెలుగుదేశం నాయకులు కర్ణ కోటిరెడ్డి, మాజీ సర్పంచ్ పల్లపోతు ప్రసాద్, మండవ ప్రసాద్, మండవ వెంకటేశ్వర్లు, పల్లపోతు వెంకట్రావు, పల్లపోతు రమేష్, మండవ మురళి తదితరులు పాల్గొన్నారు.

## ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వాహనాల తనిఖీలు చేపట్టిన ఎస్సై



**మద్దిపాడు, మే 11, ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని బస్టాప్ వద్ద ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎస్సై శివరామయ్య వాహనాల తనిఖీ నిర్వహించారు. దేశంలో యుద్ధ వాతావరణం ఉన్న నేపథ్యంలో ప్రతి బస్ స్టాండ్ వద్ద , రైల్వే స్టేషన్ వద్ద కార్లు, మోటారు సైకిళ్లు ఆపి తనిఖీలు చేయాలని ఆదేశాలు అందడంతో మద్దిపాడు ఎస్సై శివరామయ్య తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన ద్విచక్ర వాహన దారులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. హెల్మెట్లు లేకుండా వాహనాలు నడపరాదని, కార్లు నడిపే డ్రైవర్లు సీటు బెల్టు ధరించాలని ఆయన ఉద్బోధించారు. వేసవి సెలవులకు వచ్చిన చిన్నారులకు వాహనాలు ఇవ్వరాదని, లైసెన్సులు లేకుండా వాహనాలు నడపరాదని, ఆయన వాహనదారులకు సూచించారు. పోలీసులు అడిగిన సమయంలో వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలు చూపాల్సిందే అన్నారు చిన్నారులకు వాహనాలు ఇస్తే ఏదైనా ప్రమాదం జరిగిన క్రమంలో వారికి వాహనం ఇచ్చిన వారిపై కూడా కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పలువురు వాహనదారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## కళా కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి విశేష స్పందన



**మద్దిపాడు, మే 11, ప్రభాతవార్త**

మండల కేంద్రం మద్దిపాడులో ఒంగోలు నగరానికి చెందిన వెంకట రమణ ఆసుపత్రి వారు ఏర్పాటు చేసిన వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. స్థానిక నటరాజ కళా కేంద్రం వద్ద నిర్వహించిన వైద్య శిబిరంలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. ఉదయం 10గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు 150 మందికి పైగా రోగులు పరీక్షలు చేయించుకుని మందులు ఉచితంగా తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో న్యూరోసర్జన్ డాక్టర్ చంద్రశేఖర్, కంటి డాక్టర్ సుబ్రహ్మణ్యేశ్వర జనరల్ సర్జన్ మదన్, రామారావు, పీఆర్ఓలు దయ, సుగుణరావు, ఆసుపత్రి సిబ్బంది పలువురు రోగులు పాల్గొన్నారు.

## శ్రీహర్షిణి మహిళా ఇంజనీరింగ్ కాలేజీ ప్రారంభోత్సవం

**మద్దిపాడు, మే 11, ప్రభాతవార్త**

మండల పరిధిలోని ఏడుగుండ్లపాడు గ్రామ సమీపంలోని ప్రకాశం జిల్లాలో మొట్టమొదటి సారిగా ఏర్పాటు చేయనున్న శ్రీహర్షిణి జూనియర్ కళాశాల సముదాయంలో మహిళా ఇంజనీరింగ్ కాలేజీ ఆఫ్ టెక్నాలజీ ప్రారంభోత్సవ కార్యక్రమం సోమవారం నాడు ఉదయం 9గంటలకు నిర్వహించనున్నట్లు శ్రీ హర్షిణి విద్యా సంస్థ చైర్మన్ గోరంట్ల రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రి వర్యులు గొట్టిపాటి రవికుమార్, డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి, ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి, అతిథులుగా ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్, సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్, పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, మార్కెటింగ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, 20 సూత్రాల అమలు చైర్మన్ లంకా దినకర్, టూరిజం డవలప్మెంట్ ప్రోగ్రాం చైర్మన్ నూకసాని బాలాజీ, ఒంగోలు కార్పొరేషన్ మేయర్ గంగాడ సుజాత, ఎమినెంట్ అకాడమిక్ ప్రొఫెసర్ పీజీహెచ్ కృష్ణమరాజు, జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు.

## నీతి నిజాయితీలకు నిలువుటద్దం కామ్రేడ్ నల్లూరి అంజయ్య

**- రాష్ట్ర ప్రజానాట్య మండలి గౌరవ అధ్యక్షులు నల్లూరి వెంకటేశ్వర్లు(అన్న)**



**మద్దిపాడు, మే 11, ప్రభాతవార్త**

నీతికి, నిజాయితీకి, నైతిక విలువలకు కామ్రేడ్ నల్లూరి అంజయ్య నిలువుటద్దమని రాష్ట్ర ప్రజానాట్య మండలి గౌరవ అధ్యక్షులు కామ్రేడ్ నల్లూరి వెంకటేశ్వర్లు(అన్న) అన్నారు. శనివారం రాత్రి నల్లూరి అంజయ్య 35వ వర్ధంతి సభ మార్కెట్ల పాలెంలో గ్రామ సీపీఐ కార్యదర్శి నల్లూరి రామారావు అధ్యక్షతన జరిగింది. ఈ సభలో నల్లూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కామ్రేడ్ నల్లూరి అంజయ్య, రైతు కుటుంబంలో పుట్టిన రైతులు, పేద ప్రజల కొరకు, దళితుల అభివృద్ధి కొరకు, జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఆయన ఒంగోలు ఏబీఎం స్కూల్లో చదువుతూ విద్యార్థుల సమ్మె నిర్వహించినందుకు స్కూల్ యాజమాన్యం అంజయ్యను బహిష్కరించింది. ఆ తరువాత ఆయన తండ్రి రాఘవులు బనారస్ హిందూ విశ్వవిద్యాలయానికి పంపించారు. కానీ అక్కడ మత గొడవలు జరగడం ఆయనను ఇంటికి వచ్చి హిందీ యువకులను సమీకరించి ఆటలు, నాటకాలు వేయించి వారిని క్రమశిక్షణ కలిగిన యువజన సంఘ సభ్యులుగా కమ్యూనిస్టులుగా తీర్చిదిద్దారు. 1948–51 సంవత్సరంలో కమ్యూనిస్టు పార్టీపై నిషేధం విధించడంతో అజ్ఞాతంలోకి వెళ్లారు. రహస్య జీవితం నుండి వచ్చిన తర్వాత గ్రామంలోనూ ఒంగోలు తాలూకా లో కమ్యూనిస్టు పార్టీ నిర్మాణానికి ఎనలేని కృషి చేశారు. అదే విధంగా అంటరానితనానికి వ్యతిరేకంగా దళితులు , తాగునీటి కొరకు, పిచ్చ మానికల కూలికి వ్యతిరేకంగా గ్రామాల్లో పాఠశాల ఏర్పాటు కు తన వంతు కృషి చేసి ప్రజల యొక్క ఆదరాభిమానాలను పొందారు. అందువలన ఆయన నేటి తరానికి మార్గదర్శి అని కొనియాడారు. రాష్ట్ర రైతు సంఘ ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ అంజయ్య వర్ధంతి వేడుకలను జరుపుకుంటూ వారిని ప్రతి సంవత్సరం తలచుకోవడం మన బాధ్యత అని గుర్తు చేశారు. నేడు రాజకీయాలు కలుషితమైపోయాయని, నేటి బూర్జువా రాజకీయ పార్టీల నాయకులు ఎప్పుడూ ఏ రాజకీయ పార్టీలో ఉంటారు తెలియదని, కానీ అంజయ్య తాను నమ్ముకున్న కమ్యూనిస్టు పార్టీకి పేద ప్రజలకు అంకితమై పని చేశారని కొనియాడారు. పాకిస్థాన్- భారతదేశాల మధ్య జరుగుతున్న యుద్ద పరిస్థితులను ప్రస్తావిస్తూ పాకిస్థాన్ అనుసరించిన విధానం ద్రోహపూరితమైందని ఉగ్రవాదులను ప్రోత్సహిస్తున్నందని విమర్శించారు. కమ్యూనిజం మాజీ సంపాదకులు ఎంసీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అంజయ్య ప్రకాశం జిల్లాలో కమ్యూనిస్టు ఉద్యమ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని, దళిత వర్గాలకు రైతులకు సేవ చేశారని కొనియాడారు. వారు చేసిన త్యాగాలను ప్రతి సంవత్సరం మనం గుర్తు చేసుకుంటూ ఆ చరిత్రను నేటి తరానికి అందించినప్పుడే అంజయ్యకి నిజమైన నివాళులర్పించిన వారమవుతామని చెప్పారు. సభకు ముందుగా ప్రకాశం జిల్లా సీనియర్ కమ్యూనిస్టు నాయకులు ఉప్పుటూరు ప్రకాశ్‌రావు, సభ ప్రాధాన్యతను వివరించి అతిథులను వేదికపైకి ఆహ్వానించారు. ముందుగా అరుణోదయ నాట్యమండలి గాయకుడు అంజయ్య, జిల్లా మహిళా సమైక్య కార్యదర్శి కమిటీ సభ్యులు పాడిన విప్లవ గేయాలు ప్రజలను ఉత్తేజపరిచాయి. అనంతరం ఏర్పాటు చేసిన అంజయ్య నగర్ బాల బాలికలచే ప్రదర్శించబడిన కోలన్న గ్రామ ప్రజలను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా ట్రేడ్ యూనియన్ నాయకులు ఎస్‌డీ సర్దార్, జిల్లా ప్రజా నాట్య మండలి సీనియర్ నాయకులు పావులూరి అంజయ్య, మన్నం హనుమంతరావు, గోగినేని వెంకటేశ్వరరావు, నల్లజర్ల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



## డీసీఎంఎస్ చైర్మన్‌గా శ్యామల కాశిరెడ్డి



**వెలిగండ్ల, మే 11 ,ప్రభాతవార్త**

ప్రకాశం జిల్లా డీసీఎంఎస్ నూతన చైర్మన్‌గా మండలానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు శ్యామల వెంకటరెడ్డి ఫౌండేషన్ అధినేత శ్యామల కాశిరెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా మండలానికి చెందిన పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు మాట్లాడుతూ మండలంలోనే కాకుండా నియోజకవర్గంలో ఎంతో కాలంగా కష్ట కాలంలో పార్టీకి అండగా ఉంటూ పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేయడంతో పాటు సేవా భావం కలిగిన శ్యామల కాశిరెడ్డికి తెలుగుదేశం పార్టీ సముచిత స్థానాన్ని కల్పించిందని, ఇది పార్టీ కోసం నిస్వార్థంగా పని చేసే వారికి మరింత ఉత్సాహాన్ని కలిగిస్తుందని అన్నారు. ఈ సందర్భంగా శ్యామల కాశిరెడ్డికి తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, శ్యామల కాశిరెడ్డి అభిమానులు శుభాకాంక్షలు తెలియజేశారు.

## వాసవి క్లబ్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ



**సంతనూతలపాడు, మే 11, ప్రభాతవార్త**

సంతనూతలపాడు బస్టాండ్ సెంటర్లో వాసవి క్లబ్ జిల్లా ప్రతినిధి గ్రంధి లక్ష్మీ ప్రసాదరావు, సులోచన దంపతుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మినీ కూలింగ్ చలివేంద్రం వద్ద వారం వారం మజ్జిగ పంపిణీ కార్యక్రమంలో భాగంగా 5వ వారం ఆదివారం నాడు దాతలు వేమూరి సుబ్బరాయుడు, లక్ష్మీ కాంతమ్మల జ్ఞాపకార్థం, వారి కుమారుడు వాసవి క్లబ్ జిల్లా సహాయ కార్యదర్శి వేమూరి నాగేంద్ర ప్రసాద్‌రావు, నాగమణి దంపతులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని సంతనూతలపాడు మాగుంట సుబ్బరామిరెడ్డి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డీవీ రమణారెడ్డి ప్రారంభించారు. వాసవి క్లబ్, వాసవి మహిలా క్లబ్ ఆధ్వర్యంలో కూలింగ్ చలివేంద్రం, మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా దీనిని పర్యవేక్షిస్తున్న వాసవి క్లబ్ జిల్లా సహాయ కార్యదర్శి వేమూరి నాగేంద్రప్రసాదరావును ఈ సందర్భంగా మాగుంట కళాశాల ప్రిన్సిపాల్ రమణారెడ్డి తదితరులు అభినందించారు. అనంతరం ఎమ్మెస్సార్ కళాశాల ప్రిన్సిపాల్ డీవీ రమణారెడ్డిని వాసవి క్లబ్ జిల్లా సహాయ కార్యదర్శి వేమూరి నాగేంద్ర ప్రసాద్‌రావు, నాగమణి దంపతులు సత్కరించారు. ఈ కార్యక్రమానికి వాసవి క్లబ్ అధ్యక్షులు వేమూరి వెంకట శేషారావు అధ్యక్షత వహించారు. వాసవి క్లబ్ గౌరవ అధ్యక్షులు పాదర్తి గిరి, ఉపాధ్యక్షులు వేమా శ్రీను, సెక్రటరీ వేమూరి ఆంజనేయులు, కోశాధికారి పామిడి సుధాకర్, వాసవి మహిళా క్లబ్ సెక్రటరీ శిఘాకొల్లి జయశ్రీ, వాసవి మహిళా క్లబ్ ప్రతినిధులు ఎస్.విజయలక్ష్మీ, ఎన్.సుకన్య రాణి, ఆర్యవైశ్య సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చెక్కా సుబ్బరాయుడు, మార్కెట్ కమిటీ మాజీ డైరక్టర్ జి.శరత్‌బాబు, చీమకుర్తి మాగుంట సుబ్బరామిరెడ్డి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వీవీ శివారెడ్డి, మహిళా నేత రాధిక, వాసవి క్లబ్ జిల్లా ప్రతినిధి జి.లక్ష్మీ ప్రసాద్‌రావు, వాసవి క్లబ్ ఆర్యవైశ్య నాయకులు చలువాది రాము, ఎస్‌వీవీ మల్లిఖార్జునరావు, వేమా సుబ్బారావు, వి.ప్రసన్న రాజేష్, కే.శేషయ్య, జి.కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



## నేడు పలు సబ్ స్టేషన్ పరిధిలో త్రీఫేస్ విద్యుత్‌కు అంతరాయం

**తాళ్లూరు, మే 11, ప్రభాతవార్త**

ఉప్పలపాడు 132/33 కేవీ సబ్ స్టేషన్‌లో మెయింటినెన్స్ నిర్వహించినందున విద్యుత్ సరఫరాకు సోమవారం అంతరాయం కలుగుతుందని దర్శి ఏడీఈ కృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తాళ్లూరు మండలంలోని నాగంబొట్లపాలెం, దోసకాయలపాడు, బొద్దికూరపాడు, లక్కవరం సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 4గంటల నుంచి 9గంటల వరకు త్రీఫేస్ సరఫరా ఉంటుంది. తర్వాత సింగిల్ ఫేస్ మాత్రమే ఉంటుందని రైతులు, వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

## టీడీపీ కార్యాలయంలో వీర జవాన్ మురళీనాయక్‌కు పలువురు ఘన నివాళులు



**సంతనూతలపాడు ,మే 11, ప్రభాతవార్త**

సంతనూతలపాడు టీడీపీ కార్యాలయంలో శనివారం నాడు భారత్ పాకిస్థాన్ సరిహద్దులో జరిగిన యుద్ధంలో మరణించిన వీర జవాన్ మురళీనాయక్‌చిత్రపటానికి సంతనూతలపాడు మండల టీడీపీ అధ్యక్షులు మద్దినేని హరిబాబు, తదితరులు పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. వీర జవాన్ మురళి నాయక్ కుటుంబ సభ్యులకు హరిబాబు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సంతనూతలపాడు చెరువు సంఘం అధ్యక్షులు మన్నం రంగనాయకమ్మ, సంతనూతలపాడు గ్రామ టీడీపీ అధ్యక్షులు బొడ్డు శంకర్‌బాబు, బాపట్ల పార్లమెంటరీ టీఎన్‌టీయుసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ పావులూరి నారాయణస్వామి చౌదరి, ఎన్నెస్పీ సంతనూతలపాడు నీటి సంఘం అధ్యక్షులు చెరుకూరి శ్రీనివాసరావు, మండల తెలుగు యువత అధ్యక్షులు ముప్పరాజు శ్రీనివాసరావు, మండల తెలుగు మహిళ అధ్యక్షురాలు ఎన్.మాధవిలత, మండల టీఎన్‌టీయుసీ అధ్యక్షులు మందాడి వెంకటేశ్వర్లు, బాపట్ల పార్లమెంట్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ రావులపల్లి వెంకట సురేష్‌బాబు, మండల తెలుగు యువత ప్రధాన కార్యదర్శి మార్పుడి జనార్ధన్, టీడీపీ నాయకులు సీహెచ్ వెంకట సుబ్బయ్య, బొడ్డపాటి చంద్రశేఖరరావు, అబ్బూరి శ్రీనివాసరావు, వి.కోటేశ్వరరావు, సాధినేని శ్రీరామమూర్తి, చిట్టెంశెట్టి శ్రీనివాసరావు, కొప్పోలు శ్రీనివాసరావు, ఎన్.ఝాన్సీ, కే.పద్మ, కే.శ్రీలత, బి.రాందాసు, ఎం.పోలిశెట్టి, వి.కోటేశ్వరరావు, చెరుకూరి బోసు, మార్పుడి అంజయ్య, నల్లగట్ల సుబ్బారావు, ఆళ్ల రాము తదితరులు వీర జనాన్ మురళి నాయక్‌కు ఘన నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

# అపరిచితులకు లిఫ్ట్ ఇవ్వవద్దు

**- ఎస్సై వెంకటేశ్వర్లు**

**వేటపాలెం, మే 11, ప్రభాతవార్త**

బాపట్ల జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు చీరాల సబ్ డివిజన్ డీఎస్పీ ఆధ్వర్యంలో వేటపాలెం ఎస్సై, వారి సిబ్బందితో కలిసి పొట్టి సుబ్బయ్యపాలెం జంక్షన్ నందు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఎవరైనా అపరిచితులు లిఫ్ట్ అడిగిన యెడల వారికి లిఫ్ట్ ఇవ్వరాదని, ఎవరైనా అనుమానస్పదంగా సంచరిస్తే దగ్గరిలోని పోలీసు స్టేషన్లో వివరాలు చెప్పాల్సిందిగా తెలియజేశారు. వాహనదారులను ఆపి వారి వద్ద నుండి వాహనాలకు సంబంధించిన పత్రాలను పరిశీలించి సరైన పత్రాలు లేని వాహనచోదకులకు జరిమాన విధించారు. అలాగే డ్రైవింగ్ గురించి వాహన పత్రాలు గురించి వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు.



## శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

**- ఎస్సై కే.మాధవరావు**



**హనుమంతునిపాడు, మే 11, ప్రభాతవార్త**

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై కే.మాధవరావు హెచ్చరించారు. ఆదివారం మండల పరిధిలోని హాజీపురం అడ్డరోడ్డు వద్ద జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాల మేరకు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఉగ్ర వాదుల దాడుల నేపథ్యంలో ఎటువంటి అసాంఘిక శక్తులు ప్రవేశానికి వీలులేదని ఆయన అన్నారు. అదే విధంగా దేశానికి వ్యతిరేకంగా మాట్లాడి శాంతి భద్రతలకు విఘాతం కలిగించవద్దని తెలిపారు. ఎవరైనాఅనుమానస్పదంగా కనిపించిన ఏవైనా వాహనాలు చూపినా వెంటనే పోలీసులకుసమాచారం ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్టేషన్‌సిబ్బంది పాల్గొన్నారు.

## కొమ్మిరెడ్డి వారి వివాహ వేడుకలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే అన్నా



**రాచర్ల, మే 11 ప్రభాతవార్త**

మండలంలోని పలుగుంటిపల్లె గ్రామంలో కొమ్మిరెడ్డి వారి వివాహం ఆదివారం జరిగింది. ఈ వివాహ వేడుకలో గిద్దలూరు మాజీ శాసనసభ్యులు, మార్కాపురం నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి అన్నా వెంకట రాంబాబు పాల్గొన్నారు. కొమ్మిరెడ్డి సూర్యనారాయణ రెడ్డి లక్ష్మీదేవీ దంపతుల కుమారుడు వెంకటేశ్వరరెడ్డి వివాహం కిరణ్మయితో వైభవంగా జరిగింది. ఈ వివాహ వేడుకల్లో పాల్గొన్న రాంబాబు నూతన వధువరులను ఆశీర్వదించి వివాహ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమానికి విచ్చేసిన రాంబాబుకు కొమ్మిరెడ్డి కుటుంబ సభ్యులు, మండల స్థానిక వైసిపి నాయకులు స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. కార్యక్రమం అనంతరం రాంబాబు వైసిపి శ్రేణులతో కలిసి విందు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ వివాహ వేడుకల్లో మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు యేలెం మురళీ కృష్ణ (సిఆర్ఐ), వైసిపి నాయకులు బైరెడ్డి భాస్కర్ రెడ్డి గ్రంధి పుల్లయ్య, గోపిరెడ్డి పుల్లారెడ్డి, రామకృష్ణారెడ్డి, గజ్జ వెంకట మురళీకృష్ణ, మోటాటి నారాయణ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## జిమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో కంటి వైద్య పరీక్షలు నిర్వహణ



**తాళ్లూరు, మే 11, ప్రభాతవార్త**

జనతా మెడికల్ ఇనిస్టిట్యూట్(జిమ్స్) ఆధ్వర్యంలో తాళ్లూరులోని ఏబీసీ హైస్కూల్ నందు ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఎంపీటీసీ యామర్తి ప్రభుదాస్ వైద్య శిబిరంను ప్రారంభించారు. కంటి వైద్య నిపుణులు పూజిత మాదాల ఆధ్వర్యంలో డీఓలు నరసింహారావు, వర్షలు 109 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. 35 మందికి శుక్లం ఆపరేషన్ కొరకు సిఫార్సు చేశారు. ఎన్టీఆర్ వైద్య సేవ, ఈహెచ్ఎస్‌లలో కంటి శుక్లాల ఆపరేషన్ నిర్వహించబడునని చెప్పారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ తూము శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ కే.వెంకటేశ్వరరావు, డైరక్టర్ కాలేషా బాబు, పీఆర్ఓ వందనం, సిబ్బంది గౌస్, గౌస్యలు పాల్గొన్నారు.

## జగత్తులో మాతృమూర్తి ప్రేమ వెలకట్టలేనిది

**- ప్రముఖ న్యాయవాది షేక్ హాజరాంబి**

**గిద్దలూరు, మే 11, ప్రభాతవార్త**

జగత్తులో మాతృమూర్తి ప్రేమ వెలకట్టలేనిదని ప్రముఖ న్యాయవాది షేక్ హాజరాంబి అన్నారు. గిద్దలూరు నగర పంచాయితీ పరిధిలోని శాఖ గ్రంధాలయంలో గ్రంధ పాలకురాలు ప్రసన్న కుమారి ఆధ్వర్యంలో గ్రంధాలయ కమిటీ అధ్యక్షులు రామిరెడ్డి అధ్యక్షతన ఆదివారం ఘనంగా నిర్వహించిన అంతర్జాతీయ మాతృదినోత్సవ వేడుకలలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా ఆమె గ్రంధాలయంలో నిలయమైన సరస్వతి మాత విగ్రహానికి పుష్పలంకరణ గావించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటింట కొలువై ఉండే దైవం అమ్మ అని, మన జీవితాంతం సేవలు అందించినా అమ్మ రుణం తీర్చలేనిదన్నారు. విద్యార్థినీ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి జన్మనిచ్చిన తల్లిదండ్రులకు, పాఠశాలకు, కళాశాలకు మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకువచ్చి తల్లిదండ్రులు పిల్లల కోసం కష్టపడుతున్న కష్టాలు గుర్తించి వారి ఆశలకు, ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగి చదువుకున్న పాఠశాలలకు, కళాశాలలకు ముఖ్య అతిథిగా వెళ్ళగలగాలని, మీ సంతకం ఆటోగ్రాఫ్ కోసం జనాలు పోటీపడి ముందుకు వచ్చేలా ఎదగాలని ఆమె సూచించారు. జన్మనిచ్చిన తల్లిదండ్రులు, పెద్దలపట్ల గౌరవ మర్యాదలతో మెలగాలి అని, మనకు అందమైన జీవితాన్ని ఇచ్చి ఉన్నత స్థానాలకు ప్రోనత్సహిస్తున్న తల్లిదండ్రులకు మనం ఏమిచ్చి రుణం తీర్చుకోగలం ఈ అందమైన ప్రపంచానికి పరిచయం చేసిన తొలి గురువు మాతృమూర్తి తల్లిదండ్రుల వంఎట మనము ఉండడం కాదు వారు మన వెంట ఉండడం అదృష్టంగా భావించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయులు బి రామిరెడ్డి, శ్రీపాతాళ నాగేశ్వర స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ శివాపురం ఆంజనేయులు, శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం అధ్యక్షులు గంజి వీరయ్య, విశ్రాంత ఉప విద్యాశాఖ అధికారి ఎం కాశీశ్వర్ రావు, యోగా ఉపాధ్యాయులు బిఎస్ నారాయణ రెడ్డి, ఉపాధ్యాయులు జె ఎం శివప్రసాద్, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు డి వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఎం పిచ్చయ్య, పారాలీగల్ వాలంటీర్ ఏ మధుసూదన్, విశ్రాంత ఉపాధ్యాయులు పి రంగారెడ్డి, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ఓబులేసు, విశ్రాంత సర్వేయర్ రెడ్డి మల్లారెడ్డి, యువ ప్రగతి పథం స్వచ్ఛంధ సంస్థ వ్యవస్థాపకులు ఎస్‌డి ఫరూక్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం 10వ తరగతి మరియు ఇంటర్మీడియట్ విద్యార్థుల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులచే వారి మాతృమూర్తులకు సత్కారం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

## నేటి నుంచి ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు

**కనిగిరి, మే 11, ప్రభాతవార్త**
ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయని పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు కనిగిరి జూనియర్ కళాశాల పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ షేక్ కాశింపీరా ఆదివారం తెలిపారు. ఈ పరీక్షలు 12వ తేదీతో ప్రారంభమై 19వ తేదీతో ముగుస్తాయన్నారు. కనిగిరి పట్టణంలోని ఎంఎస్ఎం కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల రెండు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ ఏడాది మార్చిలో జరిగిన ఇంటర్ రెగ్యులర్ పరీక్షల్లో ఫెయిల్ అయిన వారికి సప్లిమెంటరీ పరీక్షలను నిర్వహిస్తుండగా వీరితో పాటు రెగ్యులర్ పరీక్షల్లో ఉత్తీర్ణులై ఆయా సబ్జెక్టుల్లో మరిన్ని మార్కులను సాధించేందుకు ఇంప్రూవ్‌మెంట్/బెటర్మెంట్ ఉపయోగించుకొని పరీక్షలకు విద్యార్థులు హాజరవుతున్నారని అన్నారు. ఉదయం, మధ్యాహ్నం రెండు షిఫ్ట్‌గా పరీక్షలు నిర్వహిస్తామని అన్నారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు, మధ్యాహ్నం రెండున్నర నుంచి ఐదున్నర గంటల వరకు ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు జరుగుతాయని వివరించారు. ఈ రెండు కేంద్రాల్లో సుమారు 3376 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారు. పరీక్షకు హాజరయ్యే ఇంటర్మీడియట్ విద్యార్థులు హాల్ టికెట్లను ఆన్‌లైన్‌లో డౌన్లోడ్ చేసుకుని పరీక్షకు హాజరు కావాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాల పరిరక్షణలో పకడ్బందీగా ఏర్పాట్లు చేశామని వివరించారు.

## కనిగిరి గ్రంథాలయంలో మదర్స్‌డే సందర్భంగా వ్యాసరచన పోటీలు



**కనిగిరి, మే 11, ప్రభాతవార్త**
కనిగిరి శాఖా గ్రంథాలయంలో ఆదివారం వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా మదర్స్ డే ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రంథపాలకుడు అహ్మద్ షరీఫ్ అధ్యక్షత వహించగా, కాకర్ల రమణయ్య(మండల సర్వేయర్, హెచ్.ఎంపాడు) సాయాన్ని అందించారు. ఈ సందర్భంగా అమ్మ గొప్పతనం పై విద్యార్థులకు వివరించి, తల్లిదండ్రుల పట్ల మన ప్రవర్తన ఎలా ఉండాలనే అంశాలపై విజ్ఞానవంతమైన వివరణలు ఇవ్వబడ్డాయి. ఆధునిక కాలంలో తల్లిదండ్రుల గౌరవాన్ని ఎలా కాపాడుకోవాలో పిల్లలకు అవగాహన కలిగించడమైందని నిర్వాహకులు తెలిపారు. తరువాత అమ్మ గురించి అనే అంశంపై వ్యాసరచనా పోటీలు నిర్వహించగా మొదటి, రెండవ, మూడవ స్థానాల్లో గెలుపొందిన విజేతలకు పెన్నులు, ప్రోత్సాహక బహుమతులుగా అందజేశారు.

## కనిగిరి శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో వైభవంగా జయంతి ఉత్సవాలు

**- ఇన్‌ఛార్జీ దద్దాల నారాయణయాదవ్ ప్రత్యేక పూజలు, ఆలయ కమిటీ ఘన సన్మానం**



**కనిగిరి, మే 11, ప్రభాతవార్త**
కనిగిరి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో ఆదివారం నాడు శ్రీలక్ష్మీ నరసింహస్వామి జయంతి సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఘనంగా కళ్యాణ మహోత్సవం, హోమయజ్ఞాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ కనిగిరి ఇన్‌ఛార్జీ దద్దాల నారాయణయాదవ్ పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ కుందురు తిరుపతిరెడ్డి, దద్దాల నారాయణ యాదవ్‌ను దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, ఎంపీపీ దంతులూరి ప్రకాశం, రాష్ట్ర వైసీపీ వాలంటరీ సేవాదళ్ జనరల్ సెక్రటరీ ఆవుల భాస్కర్‌రెడ్డి, గాండ్లపర్తి ఆదినారాయణరెడ్డి, నాగిరెడ్డిపల్లి వైసీపీ నాయకులు సైకం ఏడుకొండలురెడ్డి, పులి శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.


## యువనాయకుడు పలుకూరి భాస్కర్ జన్మదినం

**- శుభాకాంక్షలు తెలిపిన ప్రజాప్రతినిధులు, మిత్రులు**



**కనిగిరి, మే 11, ప్రభాతవార్త**
వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు పలుకూరి భాస్కర్ జన్మదినం సందర్భంగా ఆదివారం నిర్వహించిన వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. ఈ సందర్భంగా పలువురు స్థానిక ప్రముఖులుపాల్గొని ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకల్లో కుదారి రామ్మోహన్‌రావు,ఏరువారిపల్లి సర్పంచ్ దమ్ము వెంకటయ్య, తిమ్మారెడ్డిపల్లి సర్పంచ్ కూడలి దశరథ, ప్రజాశక్తి రిపోర్టర్ కటికల ఆగస్టీన్, ఇతరులు పాల్గొన్నారు. యువత సోషల్ మీడియాలో భాస్కర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## గుదేవారి వివాహ మహోత్సవంలో పాల్గొన్న ఇన్‌ఛార్జీ దద్దాల నారాయణయాదవ్



**కనిగిరి, మే 11, ప్రభాతవార్త**
పీసీపల్లి మండలం గుదేవారి పాలెంలో గుదె వీరయ్య- సుబ్బులు దంపతుల కనిష్ట కుమార్తె గుదె ప్రియాంక వివాహ మహోత్సవం ఘనంగా నిర్వహించ బడింది. ఈ సందర్భంగా కనిగిరి వైసీపీ ఇన్‌ఛార్జీ దద్దాల నారాయణ యాదవ్ ఈ వేడుకలలో పాల్గొని అక్షింతలు వేసి,నూతన వధూవరులకు ఆశీర్వచనాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గోపవరపు బొర్రారెడ్డి, పెద్దిరెడ్డి ఒకేరెడ్డి, గంగసాని హుస్సేన్‌రెడ్డి, కల్లూరి రామిరెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, శ్రీరామ శ్రీనివాసులు, ఆవుల భాస్కర్‌రెడ్డి, గాండ్లపర్తి ఆదినారాయణరెడ్డి, సైకం ఏడుకొండలురెడ్డి, పాశం కొండయ్య, యారవ నరసింహం, భూమిరెడ్డి, కొండారెడ్డి, గుదె వీరయ్య, పరిమి వెంకటేశ్వర్లు, గుదె కోటేశ్వరరావు, రేగుల బాలయ్య, రేగుల సుధాకరరావు, కుందురు నాగేశ్వరరావు, నెలకుర్తి నాగేశ్వరరావు, మన్నెం వెంకటరావు, ఏనుగంటి సుబ్బారావు, కుందురు సబ్బయ్య, గుదె నాగేశ్వరరావు, మక్కెన బాలకృష్ణ, పిచ్చిరెడ్డి, పరిమి వెంకటరావు, గుదె తిరుపతయ్య, కుందురు వెంకటరావు, చెన్నుపాటి, గుదె రమణయ్య, మోహన్‌రెడ్డి, రేగుల రాఘవయ్య, ఈర్ల శ్రీను, కంటూ కేశవ్ తదితరులు పాల్గొన్నారు.

## బూచేపల్లి సుబ్బారెడ్డి వర్ధంతి సందర్భంగా పండ్లు, బ్రెడ్లు పంపిణీ



**ముండ్లమూరు, మే 11, ప్రభాతవార్త**
దివంగత నేత బూచేపల్లి సుబ్బారెడ్డి వర్ధంతి సందర్భంగా ముండ్లమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో దళిత నాయకుడు పాలెపోగు డగ్లస్ ఆధ్వర్యంలో ఆదివారం పేదలకు పండ్లు, బ్రెడ్‌లు పంచడం జరిగింది. ఈ సందర్భంగా బూచేపల్లిసుబ్బారెడ్డి గొప్పతనం గురించి చర్చించుకున్నారు. ఈ కార్యక్రమంలో దళిత నేతలు పాల్గొన్నారు.

## తిరునాళ్ల ప్రశాంతంగా జరుపుకోండి - ఎస్సై కమలాకర్



**ముండ్లమూరు, మే 11, ప్రభాతవార్త**
మండలంలోని ఈదర గ్రామంలో జరగబోతున్న ఈదర అంకమ్మ తిరునాళ్ల సందర్భంగా ఆదివారం ఈదర గ్రామస్తులు తోటి ఎస్సై కే.కమలాకర్ సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడుతూ ఏదిరా అంకమ్మ తిరునాళ్లనే ప్రశాంతంగా జరుపుకోవాలని ఎలాంటి వివాదాలు లేకుండా ఎలాంటి వివాదాలు సృష్టించకుండా అందరూ కలిసి మెలిసి తిరునాళ్ళ జరుపుకోవాలని, లేకపోతే గొడవలు సృష్టించే వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఈదర గ్రామస్తులు పాల్గొన్నారు.

## దర్శిలో పుట్టిన పాపకు సిందూరి అని పేరు సూచించిన ఏఎస్సై

**దర్శి, మే 11, ప్రభాతవార్త**
దర్శిలో ఓ పాపకు ఆదివారం దర్శి ఏఎస్సై రాంబాబు సిందూరి అనే పేరును సూచించారు. ఉగ్రవాదులపై యుద్ధానికి ఆపరేషన్ సిందూర్‌ని నిర్వహించడం, ఇవాళమాతృ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో జన్మించిన ఓ పాపకు ఏఎస్సై రాంబాబు సిందూరి అనే పేరును సూచించారు. సిందూరి అనే పేరును ఈ సమయంలో ఆ పాపకు సూచించడం దేశ భవిష్యత్తును గుర్తించినట్లుగా తాను భావిస్తున్నట్లు ఆయన అన్నారు.

## ముగిసిన రాష్ట్ర స్థాయి టోర్నమెంట్



**చీరాల, మే 11, ప్రభాతవార్త**
జాండ్రపేట బీవీ అండ్ బీఎన్ హైస్కూల్ యూత్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి రెడ్ టెన్నీస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారంతో ముగిసింది. మండలంలోని జాండ్రపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గత నెల 20వ తేదీ నుండి ఈ పోటీలు జరిగాయి. ఈ టోర్నమెంట్‌లో 40 జట్లు పాల్గొన్నాయి. ఆదివారం జరిగిన ఫైనల్స్‌లో చీరాల డీసీసీ, బీవీ అండ్ బీఎన్ హైస్కూల్ జట్ల మధ్య హోరాహోరీ తలపడ్డాయి. డీసీ జట్టు నిర్ణీత 12 ఓవర్లలో 126 పరుగులు చేయగా బీవీ అండ్ బీఎన్ జట్టు కూడా నిర్ణీత ఓవర్లలో 126 పరుగులు చేయగా మ్యాచ్ టై అయింది. దీంతో సూపర్ ఓవర్‌లో డీసీసీ 4 పరుగులు చేయగా బీవీ అండ్ బీఎన్ జట్టు 3 పరుగులు సాధించడంతో చీరాల డీసీసీ విజేతగా నిలిచింది. మొదటి బహుమతి డీసీసీ చీరాల జట్టుకు రూ.30వేలు, బీవీ అండ్ బీఎన్ హైస్కూల్ జట్టుకు రూ.20వేలు, మూడో బహుమతి హైమా హాస్పిటల్ యూత్ రూ.10వేలు, నాల్గో బహుమతి వేటపాలెం ఫ్రేన్ డ్స్ టీం రూ.7,500నగదు బహుమతులు అందుకున్నారు.

## శాఖా గ్రంధాలయంలో ఘనంగా మాతృదినోత్సవ కార్యక్రమం



**చిన్నగంజాం, మే 11, ప్రభాతవార్త**
గ్రంధాలయ చిన్నగంజాం నందు వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు సృజనాత్మకతమైనటువంటి కంప్యూటర్ గేమ్ అనే ఆటను విద్యార్థులు చేత ఆడించటం జరిగింది. అనంతరం ఈ రోజు మాతృ దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తెలుగు సాహిత్య కవి అసోది శ్రీరామచంద్రమూర్తిచే అమ్మ గొప్పతనం అనేటువంటి కవితను అమ్మ యొక్క గొప్పతనాన్ని వివరించే కార్యక్రమాన్ని శ్రీరామచంద్రమూర్తి విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్, కంప్యూటర్ క్లాసులను రిసోర్స్ పర్సన్ వై.రామాంజనేయులు, ఎస్.నరసింహారావు విద్యార్థులకు వివరించారు.

## భారత వీర జవాన్‌లకు సంఘీభావ ర్యాలీ




**చీరాల, మే 11, ప్రభాతవార్త**
చీరాల ఎన్ఆర్ అండ్ పీఎం హైస్కూల్ వాకర్స్ అసోసియేషన్, రోటరీ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో భారత వీర జవాన్లుకి సంఘీభావంగా సమైక్యతా ర్యాలీని హైస్కూల్ మైదానం నుండి మున్సిపల్ ఆఫీసు, బస్టాండ్ సెంటర్, గడియారస్తంభం సెంటర్, ముంతావారి సెంటర్ మీదుగా రోటరీ క్లబ్ వరకు నిర్వహిస్తూ, జోహార్ వీర జవాన్ మురళీ నాయక్, వందే మాతరం, భారత మాతాకి జై ఉగ్రవాదం నశించాలి, ఖబడ్దార్ పాకిస్థాన్, భారత్ ఐక్యత వర్థిల్లాలి అనే నినాదాలతో హోరెత్తిస్తూ ముందుకు సాగినాము.కార్యక్రమంలో పోలుదాసు నక్కలసురేష్‌బాబు,వలివేటి మురళీకృష్ణ,గ్రంధి నారాయణమూర్తి, డీవీ సురేష్, గుర్రం రాఘవరావు, బదిరి రమేష్, పూర్ణా వాకింగ్, రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

## నేడు మంత్రి రవికుమార్ పర్యటన వివరాలు

**బల్లికురవ, మే 11, ప్రభాతవార్త**
రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సోమవారం అద్దంకి నియోజకవర్గంలో పర్యటించనున్నారు. ఆయన పర్యటన వివరాలను కార్యాలయ వర్గాలు వెల్లడించాయి. ఉదయం 9గంటలకు ఏడుగుండ్లపాడులో హర్షిణి ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ మహిళా కళాశాల నూతన ప్రారంభోత్సవం, 10గంటలకు అద్దంకి టౌన్‌లో వర్ణిక ఆర్థో స్కిన్ అండ్ ట్రామా కేర్ ప్రారంభోత్సవం, 10.30గంటలకు 5వ వార్డు, 10.45గం.లకు 19వ వార్డు, 11.30గంటలకు జే.పంగులూరు మండలం రామకూరు గ్రామం, 3గంటలకు ఐటీసీ ప్రతినిధులు, ప్రకాశం జిల్లా కలెక్టర్‌తో సమీక్షా సమావేశంలో పాల్గొననున్నారు.

## కొనసాగుతున్న పోలీసు పికెటింగ్



**నాగులుప్పలపాడు, మే 11, ప్రభాతవార్త**
అంకమ్మ కొలుపులు ప్రారంభ రోజున జరిగిన కొట్లాటలో పలువురు గాయాలు, పురుగుమందు తాగడంతో వారందరూ చికిత్స నిమిత్తం రిమ్స్‌లో అత్యవసర విభాగాల్లో ఉన్నారు. దీంతో నాగులుప్పలపాడులో రెండో రోజు పోలీసు పికెటింగ్ కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. దీంతో గ్రామంలో ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని వారు అన్నారు. బయట ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు కొలుపులు కొట్లాటతో వారు వారి గ్రామాలకు తిరిగి వెళ్తున్నారు. కొలుపుల కోసం వారి వెంట తెచ్చుకున్న మేకలు, గొర్రెలు, పందులు మొక్కు చెల్లించుకునేందుకు నాగులుప్పలపాడు గ్రామానికి భక్తులు తీసుకు వచ్చారు.ఆగిపోవడంతో ఆ జంతువులను వెనక్కి తీసుకెళ్లడం భక్తులకు భారంగా మారింది.

## సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ



**దర్శి, మే 11, ప్రభాతవార్త**
దర్శి నియోజకవర్గంలోని అర్హులు అయిన లబ్దిదారులకు దాదాపు 30 మందికి 19,46,062 రూపాయల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఆదివారం దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జీ గొట్టిపాటి లక్ష్మీ. టీడీపీ యువ నాయకులు డాక్టర్ కడియాల లలిత్ సాగర్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమం లో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గుంటి గంగా భవానీ అమ్మవారికి ప్రత్యేక పూజలు



**తాళ్లూరు, మే 11, ప్రభాతవార్త**
మండలంలోని తూర్పు గంగవరం పంచాయతీ పరిధిలోని సోమవరప్పాడులో ప్రముఖ పుణ్యక్షేత్రం గుంటి గంగా భవానీ అమ్మవారికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారిలు మెట్టెల బాలరాజు, పి.విజయలక్ష్మీ అమ్మవారి మూల విరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకుడు ఎన్.కామేశ్వర శర్మ అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. అమ్మవారికి నైవేద్యాలు, పొంగళ్లు సమర్పించారు. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పేరొందిన అమ్మవారిని దర్శించుకోవడానికి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు పొంగళ్లు పెట్టి, జంతు బలులిచ్చి మొక్కులు చెల్లించారు. ఆలయ ప్రక్కన ఉన్న పుట్ట, నాగ శిలలకు భక్తులు పూజలు చేశారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఈవో జి.వాసుబాబు, చైర్మన్ కొసనా గురుబ్రహ్మం, ఆర్ఏ కాటూరి ప్రసాదు, సిబ్బంది పర్యవేక్షించారు. కాగా గత నెలలో అమ్మవారి తిరునాళ్ల నిర్వహించిన సందర్భంగా అమ్మవారికి నెలపొంగళ్ళు సమర్పించి, ప్రత్యేక పూజలు చేసిన కాంగ్రెస్ పార్టీ దర్శి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ ,రాష్ట్ర అసంఘటిత ఉద్యోగుల చైర్మన్ కైపు వెంకట కృష్ణారెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కూకట్ల వీరబ్రహ్మాం తదితరులు.

## ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**నాగులుప్పలపాడు, మే 11, ప్రభాతవార్త**
ఉప్పుగుండూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం గ్రామంలోని కమ్మవారి కళ్యాణ మండపంలో నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన నాటి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళన వేదికపై కలుసుకొని ఆత్మీయంగా పలకరించుకున్నారు. కుటుంబ సభ్యుల వివరాలు యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉత్సాహంగా కేక్ కట్ చేసి ఆనందాన్ని పంచుకున్నారు. గత స్మృతులను నెమరు వేసుకున్నారు.

## ఘనంగా గొట్టిపాటి లక్ష్మీ జన్మదిన వేడుకలు

**- భారీగా తరలివచ్చిన ప్రజాప్రతినిధులు, అభిమానులు**





**తాళ్లూరు, మే11, ప్రభాతవార్త**
దర్శి నియోజకవర్గం టీడీపీ ఇన్‌ఛార్జీ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ జన్మదిన వేడుకలను ఆదివారం నరసరావుపేట, దర్శిలో ఆమె నివాసంలో పార్టీ నేతలు, ప్రజా ప్రతినిధులు, అభిమానుల మధ్య డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ పుట్టిన రోజు వేడుకల భారీ కేక్‌ని కట్ చేశారు. ఈ సందర్భంగా నాయకులు గొట్టిపాటి లక్ష్మీ, డాక్టర్ కడియాల లలిత్ సాగర్ దంపతులను భారీ గజమాలతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. తొలుత సర్వమత ప్రార్ధనలు చేసి పుట్టిన రోజు కేక్ కట్ చేశారు. లక్ష్మీ, లలిత్ సాగర్ దంపతులు పలు దేవాలయాలలో ప్రత్యేక పూజలు చేశారు. అలాగే ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి గొల్లపూడి వేణుబాబు ఆధ్వర్యంలో నరసరావుపేటలోని కడియాల హాస్పిటల్‌లో లక్ష్మీ, లలిత సాగర్ దంపతుల చేతుల మీదుగా 110 మంది రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమాలలో మండల టీడీపీ అధ్యక్షుడు బొమ్మిరెడ్డి ఓబుల్‌రెడ్డి, నాయకులు శాగం కొండారెడ్డి, మానం రమేష్‌బాబు, మేడగం వెంకటేశ్వరరెడ్డి, ఇడమకంటి శ్రీనివాసరెడ్డి, వల్లభనేని సుబ్బయ్య, పెద కాలేషా వలి, రాచకొండ వెంకట్రావు, పిన్నిక రమేష్, గొంది రమణారెడ్డి, యాతం శ్రీనివాసరెడ్డి, పుట్ట నరసింహారావు, కైపు రామకోటిరెడ్డి, పాశం సూరిబాబు, మీరా మోహిద్దిన్, కే.రామ లక్ష్మయ్య, గోపిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, రావినూతల పరిశుద్దరావు, చాట్ల దాని, గంగిరెడ్డి కృష్ణారెడ్డి, గూడా పుల్లారెడ్డి, కొర్రపాటి రామయ్య, బీజేపీ నాయకులు మూలం రెడ్డి ప్రసాద్‌రెడ్డి, డాక్టర్ బాలాజీ, చేతల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ సభ్యుత్వ కార్డులు పంపిణీ



**దర్శి, మే 11, ప్రభాతవార్త**
దర్శి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జీ అయినటువంటి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ పుట్టిన రోజు సందర్భంగా దర్శి మండలం లక్ష్మీ నారాయణపురం గ్రామంలో అంబటి గోవిందరెడ్డి ఆధ్వర్యంలో కేక్ కటింగ్ అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. తదుపరి మా గ్రామంలో టీడీపీ సభ్యత్వం కార్డులు పంపిణీ చేయడం జరిగింది.

## వృద్ధాశ్రమంలో అన్నదానం



**దర్శి, మే 11, ప్రభాతవార్త**
దర్శి నియోజకవర్గ కూటమి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మీ జన్మదినం సందర్భంగా దర్శిలోని కురిచేడు రోడ్డులో గల షిర్డీ సాయిబాబా వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం, కేక్ కటింగ్ పండ్లు మిటాయిలు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కటారి శ్రీకాంత్, టీడీపీ స్టేట్ ఆర్గు సెక్యూర్, కంబా పాటి నారాయణ బిజ్జం రాజశేఖర్, కంచర్ల శ్రీనివాసరావు పాతవరం కొండ, రత్నాటి సాయి కుమార్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేల నడుమ గొట్టిపాటి లక్ష్మీ పుట్టిన రోజు వేడుకలు



**దర్శి, మే 11, ప్రభాతవార్త**
దర్శితెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జీ డాక్టర్ గొట్టిపాటిలక్ష్మీ బర్త్‌డే వేడుకలు శనివారం రాత్రి విజయవాడలో ప్రకాశం జిల్లా తెలుగుదేశం ప్రజా ప్రతినిధులు ఇన్‌ఛార్జీ సమక్షంలో ఘనంగా నిర్వహించారు. డాక్టర్ లక్ష్మీతో కేక్ కట్ చేసి ముందస్తు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కూటమి ప్రభుత్వంలో యువనాయకత్వం అవసరమని మహిళ నాయకురాలుగాఒక డాక్టర్ రాబోయేతరానికి పార్టీలో యువతకు స్పూర్తిదాయకమని పలువురు పెద్దలు కొనియాడారు. డాక్టర్ లక్ష్మీ బర్త్‌డే వేడుకల్లో జిల్లా తెలుగుదేశం పార్టీ శాసనసభ్యులు ఇన్‌ఛార్జీలు, ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్, కనిగిరి శాసనసభ్యులు ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి,గిద్దలూరు శాసనపభ్యులు ముత్తుముల అశోక్‌రెడ్డి, యర్రగొండపాలెం టీడీపీ ఇన్‌చార్జీగూడూరి ఎరిక్షన్‌బాబు,ప్రకాశం జిల్లా జనసేన అధ్యక్షులు రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

## సివిల్ సర్వీసెస్ ర్యాంకర్లను అభినందించిన ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి



**దర్శి మే 11, ప్రభాతవార్త**
సివిల్ సర్వీసెస్‌లో ప్రకాశం జిల్లాకు చెందిన ర్యాంకర్లను ఆదివారం అభినందించిన దర్శి ఎమ్మెల్యే వైసీపీ ప్రకాశం జిల్లా అధ్యక్షులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి. కనిగిరి లో ఐజీ ఆవుల రమేష్‌రెడ్డి ఏర్పాటు చేసిన సివిల్ సర్వీసెస్ ర్యాంకర్స్ అభినందన సభలో పాల్గొన్న ఎమ్మెల్యే, ప్రకాశం జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి. ఈ సందర్భంగా వారిని శాలువాలతో ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

12-5Pg5.qxd:12-5Pg5.qxd 01/01/01 8:41 AM Page 1



# ఉక్రెయిన్‌తో ప్రత్యక్ష చర్చలకు సిద్ధం

## యుద్ధం ముగింపుపై రష్యా అధ్యక్షుడు పుతిన్



**మాస్కో, మే 11:** ఉక్రెయిన్‌తో మూడేళ్లకుపైగా కొనసాగుతున్న యుద్ధానికి ముగింపు పలకడానికి కీవ్‌తో ప్రత్యక్ష చర్చలకు తాము సిద్ధంగా ఉన్నట్లు రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రకటించారు. ఈ చర్చలు ఇరు దేశాల్లో శాశ్వత శాంతిని నెలకొల్పేలా ఉండాలన్నారు. ఈ మేరకు ఇస్తాంబుల్ వేదికగా ఇరుదేశాల చర్చలకు ఆయన ప్రతిపాదించారు. ఎటువంటి ముందస్తు షరతులు లేకుండా కీవ్ ప్రత్యక్ష చర్చలను తిరిగి ప్రారంభించాలని తాము కోరుతున్నట్లు పుతిన్ ఆదివారం ప్రకటించారు. గురువారం ఇస్తాంబుల్ వేదికగా చర్చలు జరపాలని ఉక్రెయిన్ అధికారులను పుతిన్ కోరారు. ఈ విషయమై తుర్కియే అధ్యక్షుడు ఎర్డోగాన్‌తో మాట్లాడతానని అన్నారు. ఈ చర్చల ద్వారా పూర్తిస్థాయి కాల్పుల విరమణ అమల్లోకి వచ్చే అవకాశం ఉన్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే తాము మానవతా దృక్పథంతో ఉక్రెయిన్‌కు చెందిన ఇంధన వనరులపై దాడులను ఆపేశామని, ఈస్టర్ కాల్పుల విరమణ, 'విక్టరీ డే' కాల్పుల విరమణ వంటివి ప్రకటించామని చెప్పారు. అయినప్పటికీ ఆ సమయాల్లో ఉక్రెయిన్ ఈ ఒప్పందాలను ఉల్లంఘించి 524 వైమానిక డ్రోన్‌లు, 45 సముద్ర డ్రోన్లు, అనేక పాశ్చాత్య క్షిపణులతో రష్యాపై దాడి చేసిందని ఆరోపించారు. తమ సైన్యం కీవ్ దాడులను తిప్పికొట్టిందని తెలిపారు. కాల్పుల విరమణ ఒప్పందం జరగాలంటే ఉక్రెయిన్ నాటోలో సభ్యత్వం ఆలోచనలను విరమించుకోవాలని, తాము ఆక్రమించిన ఉక్రెయిన్ భూభాగాల నుంచి వారి బలగాలను ఉపసంహరించుకోవాలని పుతిన్ డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 2022లో రష్యా-ఉక్రెయిన్ యుద్ధం మొదలైన కొత్తలో ఇరు దేశాలు సంధి కోసం ముసాయిదా ఒప్పందాన్ని చేసుకున్నాయి. నాటి ఒప్పందం గురించి పుతిన్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. అప్పట్లో సంధి చర్చలు విరమించుకుంది తాము కాదని.. ఉక్రెయిన్ వాటి నుంచి వైదొలిగిందన్నారు. ఇరు దేశాల మధ్య కాల్పుల విమరణకు ప్రయత్నాలు చేసినందుకుగాను అమెరికా, భారత్, చైనా, బ్రెజిల్, ఇతర మధ్యప్రాచ్య, ఆఫ్రికన్ దేశాలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. యుద్ధాన్ని ముగించడానికి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన ప్రయత్నాలను కొనియాడారు.

కాగా రష్యాతో పూర్తిస్థాయి, బేషరతు కాల్పుల విరమణకు తాము సిద్ధంగా ఉన్నట్లు ఉక్రెయిన్, దాని మిత్రపక్ష దేశాలు శనివారం వెల్లడించాయి. సోమవారం నుంచి కనీసం 30 రోజులు కాల్పుల విరమణను పాటించేలా ఈ ప్రతిపాదనను ముందుకు తెచ్చాయి. ఈ సందర్భంగా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో ఫ్రాన్స్,జర్మనీ, పోలండ్, బ్రిటన్ దేశాల అధినేతలు సమావేశమై చర్చలు జరిపారు. సంధికి అంగీకరించి, శాంతి చర్చల ప్రక్రియ ప్రారంభమయ్యేలా రష్యాపైనా ఒత్తిడి తెస్తామని తెలిపారు. ఈ మేరకు నాలుగు దేశాల నేతలు ఓ సంయుక్త ప్రకటన విడుదల చేశారు.

**రష్యాతో ప్రత్యక్ష చర్చలకు సిద్ధం : ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ**

**కీవ్, మే 11:** రష్యా అధినేత పుతిన్‌తో ప్రత్యక్ష చర్చలకు సిద్ధమని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ప్రకటించారు. ఇస్తాంబుల్ వేదికగా చర్చలకు పుతిన్ ఆహ్వానాన్ని నేరుగా ఆయన ప్రస్తావించలేదు. కానీ, 'ఎట్టకేలకు రష్యా యుద్ధం ముగించే విషయాన్ని పరిశీలిస్తోంది' అని పేర్కొన్నారు. చాలా రోజుల నుంచి ఇందుకోసమే ప్రపంచం మొత్తం ఎదురుచూస్తోందన్నారు.యుద్ధం ముగింపులో మొదటి అడుగు కాల్పుల విరమణే అని పేర్కొన్నారు. ఈ మారణకాండను ఒక్కరోజు కూడా కొనసాగించడంలో అర్థం లేదు. రష్యా కాల్పుల విరమణ ధ్రువీకరణ కోసం ఎదురుచూస్తున్నాం. రష్యా ప్రతినిధులను కలిసేందుకు ఉక్రెయిన్ సిద్ధంగా ఉంది' అని పేర్కొన్నారు. సోమవారం నుంచి మొదలయ్యే 30 రోజుల కాల్పుల విరమణను రష్యా ఉల్లంఘిస్తే మరిన్ని ఆంక్షలు విధించేందుకు సిద్ధంగా ఉన్నట్లు బ్రిటన్ ప్రధాని స్టార్మర్ సహా పలువురు ఐరోపా నాయకులు వెల్లడించారు. మరోవైపు కీవ్‌తో ప్రత్యక్ష చర్చలకు సిద్ధంగా ఉన్నామని రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రకటించారు. ఈ మేరకు ఇస్తాంబుల్‌ను చర్చల వేదికగా ప్రకటించారు. ఈ చర్చల ద్వారా పూర్తిస్థాయి కాల్పుల విరమణ అమల్లోకి వచ్చే అవకాశం ఉన్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే తాము మానవతా దృక్పథంతో ఉక్రెయిన్‌కు చెందిన ఇంధన వనరులపై దాడులను ఆపేశామని, ఈస్టర్ కాల్పుల విరమణ, 'విక్టరీ డే' కాల్పుల విరమణ వంటివి ప్రకటించామని చెప్పారు.

# కాశ్మీర్ సమస్య పరిష్కారానికి కృషిచేస్తా

## అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్



**వాషింగ్టన్, మే 11:** భారత్, పాకిస్థాన్ వివాదంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించి రెండు దేశాలతో కలిసి కశ్మీర్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తన సోషల్ మీడియా ట్రూత్‌లో పోస్ట్ పెట్టారు. ప్రస్తుత సంఘర్షణతో మరణాలు, విధ్వంసం తప్ప ఏమీ లేవని రెండు దేశాల నాయకత్వాలు అర్థం చేసుకున్నందుకు గర్వంగా ఉందని వ్యాఖ్యానించారు. ఘర్షణతో లక్షలాది మంది అమాయక ప్రజలు చనిపోవచ్చు. మీరు చారిత్రక నిర్ణయం తీసుకోవడానికి అమెరికా సాయం చేసినందుకు నాకు గర్వంగా ఉంది. మనం కేవలం చర్చించడమే కాదు. రెండు దేశాలతో వాణిజ్య సంబంధాలను మరింత బలోపేతం చేసుకుందాం. కశ్మీర్ విషయంలో పరిష్కారాన్ని కనుక్కోగలిగితే మీతో కలిసి పనిచేస్తాను అంటూ ట్రూత్ లో పోస్ట్ పెట్టారు నిజానికి ట్రంప్ తన తొలి విడత పాలనలో కూడా అప్పుడు కశ్మీర్ విషయంలో జోక్యం చేసుకోవాలని అనుకున్నారు. అప్పటి భారత్, పాకిస్థాన్ ప్రధానుల వద్ద కూడా ప్రస్తావించారు. కానీ అప్పుడు మన దేశం మూడో పక్షం జోక్యాన్ని తిరస్కరించింది. దీంతో ట్రంప్ ఆ విషయంలో పెద్దగా వ్యాఖ్యలు చేయలేదు. ఇప్పుడు మరోసారి ప్రతిపాదించారు. మరోవైపు, కాల్పుల విరమణ విషయంలో ఇరు దేశాలు అవగాహనకు వచ్చాయని ట్రంప్ తొలుత ట్రూత్ పోస్టులో ప్రకటించారు. ఆ తర్వాత భారత్ అధికారికంగా ఈ విషయాన్ని వెల్లడించింది. శనివారం మధ్యాహ్నం 3.35 గంటలకు ఇరుదేశాల డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలటరీ ఆపరేషన్స్ స్థాయిలో ఇరుదేశాల మధ్య చర్చలు జరిగాయి. పాకిస్థాన్ డీజీఎంఓ భారత డీజీఎంవోకు కాల్ చేశారు. ఆ తర్వాత కాల్పుల విరమణకు ఇరు దేశాల సైనికాధికారులు అంగీకరించారు. సాయంత్రం 5 గంటల నుంచి ఇది అమల్లోకి వచ్చింది. అని విదేశాంగ శాఖ ప్రకటించింది. కానీ కాల్పుల విరమణ ఒప్పందం జరిగిన కొద్ది గంటలకే పాక్ ఉల్లంఘించింది. జమ్ముకశ్మీర్‌లోని పలు ప్రాంతాల్లో పాకిస్థాన్ డ్రోన్లు కనిపించాయి. దీంతో గగనతల రక్షణ వ్యవస్థల్ని ఉపయోగించి, వాటిని కూల్చేసింది సైన్యం. శ్రీనగర్‌లో పలు చోట్ల పేలుళ్లు సంభవించాయి. అఖ్నూర్, పింజార్, బారాముల్లా, అనంతనాగ్, బట్వారాలలో పాక్ డ్రోన్లను కూల్చేసింది.

# ఇక మిగిలింది పిఒకెను పాక్ అప్పగించడమే

## స్పష్టం చేసిన విదేశాంగశాఖ

## ఎవరి మధ్యవర్తిత్వం అవసరంలేదని వెల్లడి




**న్యూఢిల్లీ, మే 11:** కశ్మీర్ విషయంలో తమకు చాలా స్పష్టమైన వైఖరి ఉందని విదేశాంగశాఖ మరోసారి స్పష్టం చేసింది. పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్ పీవోకే తిరిగి రావడం అనే ఒకే ఒక విషయం మాత్రమే మిగిలి ఉందని పేర్కొంది. కశ్మీర్ విషయంలో ఇంకేమీ మాట్లాడటానికి లేదని, ఉగ్రవాదులను అప్పగించడం గురించి పాకిస్థాన్ మాట్లాడితే, ఈ అంశంలో ఏమైనా మాట్లాడుకోవచ్చని తెలిపింది. కశ్మీర్ అంశంలో ఎవరూ మధ్యవర్తిత్వం వహించాలని కోరుకోవడం లేదని విదేశాంగశాఖ స్పష్టం చేసింది. ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదని విదేశాంగశాఖ మరోసారి స్పష్టం చేసింది. బహావల్‌పర్‌లోని జైషే మహమ్మద్ ప్రధాన కేంద్రాన్ని బలమైన ఆయుధంతో నేలమట్టం చేసినట్టు తెలిపింది. పాకిస్థాన్‌ను బలంగా, భారీగా, అత్యంత సుదూర ప్రాంతాల్లో దెబ్బతీశామని విదేశాంగశాఖ తెలిపింది. అటువైపు నుంచి బుల్లెట్లతో దాడి చేస్తే మనం బాంబులతో సమాధానం ఇచ్చామని పేర్కొంది. బహావల్‌పూల్, మురుద్కే, ముజఫర్‌బాద్ కేంద్రాలను నేలమట్టం చేశామని తెలిపింది. మే 10న పాకిస్థాన్ దాడికి ప్రతిస్పందనగా అగ్ని వర్షం కురిపించామని, 8 స్థావరాలు లక్ష్యంగా దాడులు చేశామని భారత్ తెలిపింది. ఈ నెల 7న ఉగ్ర స్థావరాలపై దాడులు చేశాక పాక్ డీజీఎంవోకు సమాచారం ఇచ్చామని, ఉగ్ర స్థావరాలపై దాడుల అనంతరం చర్చలకు సిద్ధమని చెప్పినట్టు విదేశాంగశాఖ పేర్కొంది. పాకిస్థాన్ నుంచి మాత్రం ఎలాంటి స్పందన రాలేదని చెప్పింది. మే 10న పాకిస్థాన్ నుంచి చర్చలకు ప్రతిపాదన వచ్చిందని, రహిమ్యార్ ఖాన్ వైమానిక స్థావరం రన్‌వేను నేలమట్టం చేశామని విదేశాంగశాఖ తెలిపింది. భారత్ పాకిస్థాన్ కాల్పుల విరమణ అంశంపై భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఇటీవల చర్చలు జరిపారు. ఆ చర్చల సందర్భంగా జేడీ వాన్స్‌కు మోదీ ఒక విషయాన్ని స్పష్టంగా చెప్పారట. భవిష్యత్తులో భారతగడ్డపై పాకిస్తాన్ ఏదైనా ఉగ్రవాద చర్యకు పాల్పడితే మేం ఊరుకోం. అది తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుంది. మేం బలంగా ప్రతిస్పందిస్తాం అని జేడీ వాన్స్‌కు ప్రధాని మోదీ తేల్చి చెప్పారంటూ అమెరికా ఆంగ్లపత్రిక ప్రత్యేక కథనం ప్రచురించింది. జేడీ వాన్స్‌కు మోదీ ఈ విషయాన్ని స్పష్టం చేసిన రోజు రాత్రే భారత్‌లోని 26 ప్రదేశాలపై పాకిస్తాన్ దాడికి దిగిందని కథనంలో పేర్కొన్నారు. ఈ దాడికి ప్రతిస్పందనగా వెంటనే పాకిస్తాన్‌లోని వైమానిక స్థావరాలపై భారత్ ప్రతిదాడులు చేసిందని గుర్తు చేసింది. భారత్ దాడులను పాకిస్తాన్ నిలువరించలేకపోయింది. పాకిస్తాన్ దాడులను భారత్ సులభంగా అడ్డుకోగలిగింది. సైనిక సంపత్తి, సాంకేతిక విలువలను సమతుల్యంగా వినియోగించడంలో భారత్ చాలా ముందంజలో ఉందని ఆపరేషన్ సిందూర్, తదనంతర పరిణామాలతో నిరూపితమైంది. ఈ అంశాల్లో భారత్‌తో సరితూగలేదనే విషయాన్ని పాకిస్తాన్ అర్థం చేసుకోవాలని భారత సైనిక వర్గాలు తెలిపాయి. మూడు లక్ష్యాలు సాధించిన భారత్‌మొత్తం మీద ఆపరేషన్ సిందూర్ ద్వారా మూడు కీలక లక్ష్యాలను సాధించామని భారత సైనిక వర్గాలు వెల్లడించాయి. వీటిలో మొదటిది సైనిక లక్ష్యం. మట్టిలో కలిపేస్తాం ఉగ్రవాద స్థావరాలున్న బహావల్‌పూర్, మురీద్కే, ముజఫరాబాద్‌ను మట్టిలో కలిపేశామని ప్రధాని మోదీ ఇటీవలే ఆపరేషన్ సిందూర్ గురించి వ్యాఖ్యానించారు. ఆపరేషన్ సిందూర్ పేరుతో భారత్ నిర్వహించిన సైనిక ఆపరేషన్ విజయవంతమైంది.

## పాకిస్థాన్ కాల్పుల్లో బిఎస్ఎఫ్ ఇన్‌స్పెక్టర్, ఆర్మీ జవాను మృతి



శ్రీనగర్, మే 11: భారత్, పాక్ ఉద్రిక్తతలు వేళ అమెరికా సహా మరికొన్ని దేశాల దౌత్యంతో రెండు దేశాల అంగీకారంతో కాల్పుల విరమణ అమల్లోకి వచ్చింది. కానీ కాసేపటికే పాకిస్థాన్ కాల్పుల ఉల్లంఘనలకు పాల్పడింది. సరిహద్దులోని పలు ప్రాంతాలపైకి డ్రోన్లు ప్రయోగించింది. ఈ దాడుల్లో బీఎస్ఎఫ్ సబ్ ఇన్‌స్పెక్టర్, ఆర్మీ జవాన్ మరణించారు. జమ్ములోని ఆర్ఎస్ పురా సెక్టార్‌లోని సరిహద్దు వెంబడి పాకిస్తాన్ జరిపిన సరిహద్దు కాల్పుల్లో BSF సబ్ ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ ఇంతియాజ్ మరణించగా, ఏడుగురు గాయపడ్డారు. అయితే ఇంతియాజ్ అవుట్ పోస్ట్ వద్ద ధైర్యంగా నాయకత్వం వహిస్తూ అత్యున్నత ప్రాణం త్యాగం చేశారని ఒక సీనియర్ అధికారి తెలిపారు. బీఎస్ఎఫ్ కూడా ఇంతియాజ్ మరణించిన విషయాన్ని ప్రకటించింది. సరిహద్దు అవుట్‌పోస్టుకు నాయకత్వం వహించారు సబ్ ఇన్‌స్పెక్టర్ ఇంతియాజ్. 2025 మే 10వ తేదీన జమ్ములోని ఆర్ఎస్‌పురా ప్రాంతంలో అంతర్జాతీయ సరిహద్దు వెంబడి సరిహద్దు కాల్పుల సమయంలో ఆయన చేసిన అత్యున్నత త్యాగానికి వందనం చేస్తున్నాం. ఆయన కుటుంబానికి ప్రగాడ సానుభూతి తెలియజేస్తున్నాం. ఈ క్లిష్ట సమయంలో వారి కుటుంబానికి అండగా నిలుస్తాం అంటూ బీఎస్ఎఫ్ ప్రకటించింది. మరోవైపు, రాజస్థాన్‌కు చెందిన ఒక సైనికుడు పాకిస్థాన్ డ్రోన్ దాడి వల్ల జమ్ముకశ్మీర్‌లో మరణించారు. ఉధంపూర్ జిల్లాలోని వైమానిక స్థావరంపై ఇటీవల పాక్ దాడి చేసింది. ఆ సమయంలో డ్రోన్ శిథిలం తగిలి సురేంద్ర సింగ్ మోగా మరణించాడు. అయితే భారత వైమానిక దళం డ్రోన్‌లను విజయవంతంగా అడ్డుకున్నాయి. కానీ శిథిలాల వల్ల జవాన్ తీవ్ర గాయాలపాలై చనిపోయాడు. సురేంద్ర సింగ్ వీరమరణం పట్ల రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ సోషల్ మీడియాలోసంతాపం వ్యక్తం చేశారు. ఉధంపూర్ ఎయిర్ బేస్‌లో తన జాతీయ భద్రతను నిర్వహిస్తూ, భారత ఆర్మీకి చెందిన సైనికుడు సురేంద్ర సింగ్ మోగా వీరమరణం పొందిన వార్త చాలా బాధాకరమం. వారి కుటుంబానికి ధైర్యాన్ని ప్రసాదించాలని కోరుకుంటున్నాను అని పోస్ట్ పెట్టారు.



## రావల్పిండిలోనూ గర్జించిన భారత్ సేన : రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్

**న్యూఢిల్లీ, మే 11:** ఆపరేషన్ సిందూర్ కేవలం సైనిక చర్యే కాదని, ఉగ్రవాదంపై పోరులో భారత రాజకీయ, సామాజిక, వ్యూహాత్మక సంకల్పానికి నిదర్శనమని రక్షణమంత్రి రాజ్ నాథ్‌సింగ్ పేర్కొన్నారు. ఉగ్రవాదులతోపాటు భారత వ్యతిరేక శక్తులపై మన సైన్యం ప్రతీకారం తీర్చుకుందన్నారు. భారత సైన్యం పరాక్రమాన్ని ప్రదర్శించిందని, పాక్ సైనిక ప్రధాన కేంద్రమున్న రావల్పిండిలోనూ గర్జించిందన్నారు. ఉత్తరప్రదేశ్‌లో బ్రహ్మోస్ ఉత్పత్తి కేంద్రాన్ని వర్చువల్‌గా ప్రారంభించిన ఆయన ఉగ్రశక్తులకు భారత్ దీటుగా బదులిస్తుందన్నారు. ఈ ఆపరేషన్ ఉగ్రవాదంపై పోరులో దృఢసంకల్పంతోపాటు మన సైనిక శక్తి సామర్థ్యాలను చాటిచెప్పిందన్నారు. పహల్గాం బాధితులకు న్యాయం చేకూర్చిందన్నారు. పాక్ ప్రజలపై భారత్ దాడి చేయలేదని, కానీ, దాయాది మాత్రం పౌరులే లక్ష్యంగా మన దేశంపై దాడులు చేసిందన్నారు.

# పుల్వామా దాడి మా పనే..

## పాక్ వాయుసేనాధికారి ఔరంగజేబ్ అహ్మద్



**ఇస్లామాబాద్, మే 11:** భారత్‌లోని జమ్మూ కశ్మీర్‌లోని పుల్వామాలో 40 మంది పారా మిలిటరీ సిబ్బంది మరణానికి కారణమైన బాంబుదాడి వెనుక తమ హస్తం ఉందని పాక్ అంగీకరించింది. ఈ విషయాన్ని ఆ దేశ వాయుసేన ఎయిర్ వైస్‌మార్షల్ ఔరంగజేబ్ అహ్మద్ ప్రెస్‌మీట్‌లో అంగీకరించారు. దీంతో ఉగ్రవాదంతో తమకు సంబంధం లేదని ఇస్లామాబాద్‌లోని నేతలు చెబుతున్నవి మొత్తం కాకమ్మ కబుర్లే అని తెలిపోయింది. ఇటీవల ఆపరేషన్ సిందూర్ సందర్భంగా జరిగిన ప్రెస్‌మీట్‌లో డిజిఐఎస్‌పిఆర్ లెఫ్టినెంట్ జనరల్ అహ్మద్ షరీఫ్ చౌదరి, నేవీ ప్రతినిధితో కలిసి ఔరంగజేబ్ అహ్మద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'పాక్‌కు చెందిన గగనతలం, భూభాగం, జల సరిహద్దులకు లేదా ప్రజలకు ముప్పుగా పరిణమిస్తే వాటిని ఎదుర్కొనేందుకు మేం రాజీ పడబోం. దానిని పట్టించుకోకుండా ఉండలేం. మా దేశానికి కట్టుబడి ఉంటాం. మా దేశ ప్రజల కీర్తి మొత్తం దళాల్లోనే ఇమిడి ఉండటంతో మేము ఎప్పుడూ దానిని నిలబెట్టుకుంటాం. పుల్వామాలో మా అద్భుతమైన ఎత్తుగడలను చూపించాం. మా కార్యదక్షత.. వ్యూహాత్మక చతురతను ఇప్పటికే ప్రదర్శించాం' అని వ్యాఖ్యానించారు. ఔరంగజేబ్ అహ్మద్ వ్యాఖ్యలతో పాక్ ఉగ్రవాదాన్ని పోషిస్తోందన్న విషయం మరోసారి స్పష్టమైంది. నాడు పుల్వామా దాడిలో తమకు సంబంధం లేదని పాకిస్థాన్ ఎంత బుకాయించినా తాజాగా వాయుసేనాధికారి వ్యాఖ్యలతో వాస్తవం బయటకు వచ్చింది. తాజాగా పహల్గాం దాడిపై కూడా ఇలాగే స్పందిస్తోంది.

## ఆర్మీ అధికారి తండ్రికి అల్‌ఖైదాతో సంబంధాలు



**కరాచి, మే 11:** పాకిస్థాన్ సైన్యానికి చెందిన కీలక అధికారి, ఇంటర్‌సర్వీసెస్ పబ్లిక్ రిలేషన్స్ (ఐఎస్‌పీఆర్) డైరెక్టర్ జనరల్ లెఫ్టినెంట్ జనరల్ అహ్మద్ షరీఫ్ చౌదరి తండ్రి గురించి సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. భారత్‌కు వ్యతిరేకంగా పాకిస్థాన్ చేస్తున్న తప్పుడు ప్రచారానికి చౌదరి నాయకత్వం వహిస్తుండగా, ఆయన తండ్రి సుల్తాన్ బషీరుద్దీన్ మహమూద్ ఒక అణు శాస్త్రవేత్త అని, అల్‌ఖైదా చీఫ్ ఒసామా బిన్ లాడెన్‌తో సమావేశమై ఉగ్రవాదులకు అణ్వాయుధ పరిజ్ఞానాన్ని అందించేందుకు ప్రయత్నించారని ఆరోపణలు ఉన్నాయి. సుల్తాన్ బషీరుద్దీన్ మహమూద్ పేరు ఐక్యరాజ్యసమితి భద్రతా మండలికి చెందిన అల్‌ఖైదా ఆంక్షల కమిటీ ఉగ్రవాదుల జాబితాలో ఉంది. 2001 డిసెంబర్ 24, న అల్‌ఖైదా, ఒసామా బిన్ లాడెన్ మరియు తాలిబన్లతో సంబంధాలున్నాయన్న ఆరోపణలపై మహమూద్‌ను ఈ జాబితాలో చేర్చారు. ఉగ్రవాద చర్యలకు నిధులు సమకూర్చడం, ప్రణాళిక రచించడం, ఆయుధాలు సరఫరా చేయడం వంటి తీవ్రమైన అభియోగాలు ఆయనపై ఉన్నాయి. ఉమ్మా తమీర్ ఇనౌ (యూటీఎన్) అనే సంస్థను స్థాపించి, దాని ద్వారా ఒసామా బిన్ లాడెన్, తాలిబన్లకు మహమూద్ రసాయన, జీవ, అణ్వాయుధాల సమాచారం అందించినట్లు ఐరాస నివేదిక పేర్కొంది. ఆఫ్ఘనిస్థాన్‌లో పర్యటించినప్పుడు మహమూద్, బిన్ లాడెన్ మరియు ఇతర అల్‌ఖైదా నాయకులను కలిసి అణ్వాయుధాలపై చర్చించినట్లు తెలుస్తోంది. 2001లో అప్పటి తాలిబన్ చీఫ్ ముల్లా ఒమర్‌ను కూడా మహమూద్ కలిశారని సమాచారం. అంతర్జాతీయంగా పాకిస్థాన్‌ను "ఉగ్రవాద బాధిత దేశం"గా చిత్రీకరించేందుకు లెఫ్టినెంట్ జనరల్ అహ్మద్ షరీఫ్ చౌదరి ప్రయత్నిస్తుండగా.. ఆయన తండ్రికి ఉన్న ఉగ్రవాద నేపథ్యం చూస్తే పాక్ సైన్యంలో ఉగ్రవాద భావజాలం ఎంతగా చొచ్చుకుపోయిందో అర్థమవుతుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. పాక్ ఆర్మీ చీఫ్ జనరల్ అసిమ్ మునీర్ తండ్రి ఒక మత బోధకుడు కాగా, చౌదరి తండ్రి అణు శాస్త్రవేత్త అయినప్పటికీ ఉగ్రవాదం వైపు మొగ్గు చూపడం గమనార్హం. అమెరికా ఒత్తిడి మేరకు 2001లో పాక్ నిఘాసంస్థ ఐఎస్ఐ, మహమూద్‌ను అరెస్ట్ చేసి విచారించింది. ఈ పరిణామాలు పాకిస్థాన్ ఉగ్రవాద వ్యతిరేక పోరాటంపై పలు సందేహాలను లేవనెత్తుతున్నాయి.

# ఆస్తిమొత్తం దానంచేయనున్న బిల్‌గేట్స్




**న్యూయార్క్, మే 11:** ప్రపంచ కుబేరుల్లో ఒకరైన బిల్ గేట్స్, తాను సహస్థాపించిన బిల్ అండ్ మెలిందా గేట్స్ ఫౌండేషన్ విషయంలో ఒక విప్లవాత్మక నిర్ణయం దిశగా అడుగులు వేస్తున్నారు. 2045 నాటికి ఫౌండేషన్ వద్ద ఉన్న సుమారు 200 బిలియన్ డాలర్ల (సుమారు రూ.16 లక్షల కోట్లకు పైగా) భారీ నిధిని పూర్తిగా ప్రజారోగ్యం, పేదరిక నిర్మూలన వంటి సేవా కార్యక్రమాలకు వెచ్చించి, ఆపై సంస్థను శాశ్వతంగా మూసివేయాలని యోచిస్తున్నారు. దీనిపై బిల్ గేట్స్ మాజీ భార్య మెలిండా గేట్స్ స్పందించారు. ఇది ఒక అద్భుతమైన నిర్ణయం అని అభివర్ణించారు. ఈ ఆలోచనకు తాను సంపూర్ణ మద్దతు తెలిపుతున్నట్టు ప్రకటించారు. ఫార్చ్యూన్ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మెలిండా గేట్స్ మాట్లాడుతూ, రాబోయే రెండు దశాబ్దాల్లో ఫౌండేషన్ తన వార్షిక వ్యయాన్ని రెట్టింపు చేసి, ఈ నిధులను ప్రాణాంతక వ్యాధుల నిర్మూలన, మాతాశిశు మరణాల తగ్గింపు, ప్రపంచవ్యాప్త పేదరిక నిర్మూలనకు ఖర్చు చేస్తుందని తెలిపారు. "ఈ భారీ వనరులు తిరిగి సమాజానికే చెందాలన్నది ఫౌండేషన్ అసలు ఉద్దేశం' అని ఆమె స్పష్టం చేశారు. గత ఏడాది ఫౌండేషన్ నుంచి వైదొలగి, ఖిపివోటల్ వెంచర్స్‌ఖ అనే సొంత సంస్థ ద్వారా మహిళా సాధికారతపై దృష్టి సారించిన మెలిండా, ఫౌండేషన్ నిధులను పూర్తిగా ఖర్చు చేయాలన్నది తమ ఉమ్మడి ఆలోచనే అయినా, కాలపరిమితిపై తుది నిర్ణయం బిల్ గేట్స్ దేనని తెలిపారు. బిలియనీర్లు తాము ఆర్జించిన సంపదలో కొంత భాగాన్ని సమాజానికి తిరిగి ఇవ్వాల్సిన నైతిక బాధ్యత ఉందని ఆమె నొక్కిచెప్పారు. "ఫౌండేషన్ అధికారికంగా మూసివేసినా, మా కృషి వల్ల ఎంతోమంది మెరుగైన జీవితం గడుపుతారన్నదే మాకు సంతృప్తి" అని ఆమె అన్నారు.



## పిఎస్ఎల్‌వి-సి61 రాకెట్ ప్రయోగానికి తుది ఏర్పాట్లు

**శ్రీహరికోట (తడ), మే 11 ప్రభాతవార్త:** శ్రీహరికోటలో మరో రాకెట్ ప్రయోగానికి ఇస్రో సిద్ధమైంది. ఈ నెల 18న ఉదయం 5.59 గంటలకు షార్‌లోని మొదటి ప్రయోగ వేదిక నుంచి పిఎస్ఎల్‌వి-సి61 రాకెట్‌ను ప్రయోగిస్తున్నారు. ఈ రాకెట్ ద్వారా సరిహద్దుల వివరాలు తెలిపే ఇఓఎస్-09 ఉపగ్రహాన్ని శాస్త్రవేత్తలు ప్రయోగిస్తున్నారు. శ్రీహరికోటలో ఒకవైపు రాకెట్ ప్రయోగ వేదిక వద్ద ఏర్పాట్లు జరుగుతుంటే, మరోవైపు ప్రస్తుతం జరుగుతున్న పాకిస్తాన్ యుద్ధం కారణంగా పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో ఈ రాకెట్ ప్రయోగానికి ప్రాధాన్యత ఏర్పడింది. ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్ ఆధ్వర్యంలో రాకెట్‌ను ప్రయోగించనున్నారు. షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్, ఇతర శాస్త్రవేత్తలు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఆదివారం సిఐఎస్ఎఫ్ బలగాలు మరింత అప్రమత్తమై శ్రీహరికోటకు వెళ్లే అన్ని మార్గాల్లో నిఘాను మరింత పటిష్టం చేశారు.

# యుద్ధంలో ధ్వంసమైన రన్‌వేను పునరుద్ధరించిన మహిళలు



**భుజ్(గుజరాత్), మే 11:** పాకిస్థాన్ తో 1971 లో జరిగిన యుద్ధంలో గుజరాత్ మహిళలు చూపిన ధైర్యసాహసాలు భారత వాయుసేనకు వెన్నుదన్నుగా నిలిచాయి. శత్రువుల దాడిలో ధ్వంసమైన రన్‌వేను దాదాపు 300 మంది మహిళలు అవిశ్రాంతంగా శ్రమించి 72 గంటల్లోనే పునర్నిర్మించారు. నాటి ఆ వీరమహిళల సాహసోపేత కృత్యం వివరాలు. 1971 డిసెంబర్ లో భారత్‌పాకిస్థాన్ మధ్య యుద్ధం తీవ్రస్థాయిలో కొనసాగుతోంది. గుజరాత్‌లోని భుజ్ వైమానిక స్థావరంపై పాకిస్థాన్ యుద్ధ విమానాలు విరుచుకుపడ్డాయి. సుమారు 14 నాపామ్ బాంబులతో దాడి చేసి, ఎయిర్‌స్ట్రిప్‌ను ధ్వంసం చేశాయి. దీంతో భారత యుద్ధ విమానాలు టేకాఫ్ తీసుకునే అవకాశం లేకుండా పోయింది. ఇది దేశ రక్షణకు తీవ్ర ఆటంకంగా మారింది. అప్పటి భుజ్ వైమానిక స్థావరం ఇన్‌ఛార్జి, స్క్వాడ్రన్ లీడర్ విజయ్ కర్ణిక్ ఈ క్లిష్ట పరిస్థితిని అధిగమించడానికి ఒక సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారు. సమీపంలోని మాధాపూర్ గ్రామస్థుల సహాయం కోరారు. ఆయన పిలుపునకు స్పందించి, దాదాపు 300 మంది మహిళలు దేశభక్తితో ముందుకు వచ్చారు. రాత్రింబవళ్లు శ్రమించి కేవలం 72 గంటల వ్యవధిలోనే రన్‌వేను పునర్నిర్మించారు. శత్రు విమానాల కంట పడకుండా ఉండేందుకు ఆకుపచ్చ రంగు చీరలు ధరించి, సైరన్ మోగినప్పుడల్లా సమీపంలోని పొదల్లో దాక్కుంటూ ప్రాణాలకు తెగించి పని చేశారు. రాళ్లు మోయడం, సిమెంట్ కలపడం వంటి కఠినమైన పనులను తమ చేతులతోనే పూర్తిచేశారు. వారిలో ఒకరైన కనాబాయి శివ్జీ హిరానీ ఆనాటి సంఘటనలను గుర్తుచేసుకుంటూ, "పాకిస్థానీ విమానాలు వచ్చినప్పుడు దాక్కునేవాళ్లం. పర్యావరణంలో కలిసిపోయేందుకు ఆకుపచ్చ వస్త్రం ధరించాము," అని ఓ మీడియా సంస్థకు తెలిపారు. ఈ సాహస మహిళల కృషి ఫలితంగా, భారత యుద్ధ విమానాలు తిరిగి గగనంలోకి దూసుకెళ్లి, యుద్ధ గతిని మార్చడంలో కీలక పాత్ర పోషించాయి. వారి ధైర్యసాహసాలు, దేశభక్తి చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయి. కాగా, ఈ వృత్తాంతంతో అజయ్ దేవ్‌గణ్ హీరోగా ఓ సినిమా కూడా వచ్చింది.


# కొత్త పోప్‌కు తమిళనాడుతో అనుబంధం




**వాటికన్ సిటీ, మే 11:** పోప్‌గా ఎన్నికైన లియో14 రాబర్ట్ ప్రివోస్ట్‌కు తమిళనాడుతో అనుబంధం ఉంది. ఆయన 2006లో కోయంబత్తూరు జిల్లా పొల్లాచ్చి ప్రాంతంలోని అగస్టియన్ చర్చి నిర్వాహకులు నడుపుతున్న శెన్బగం పాఠశాలను సందర్శించారు. ఆ సమయంలో స్కూల్ క్యాంపస్ ముందు లియో14 తీసుకున్న ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. కొత్తగా ఎన్నికైన పోప్ లియో14 గతంలో శెన్బగం పాఠశాలను సందర్శించడంపై ఆ స్కూల్‌లో పనిచేస్తున్న ఫాదర్ సుమేశ్ జోసెఫ్ స్పందించారు. కొత్తగా ఎన్నికైన పోప్ తమిళనాడులోని పొల్లాచ్చి ప్రాంతానికి రావడం గౌరవంగా ఉందన్నారు. తమిళుల గురించి ఆయన తెలుసుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు. పోప్ ఫ్రాన్సిస్ ఏప్రిల్ 21న వాటికన్ సిటీలోని కాసా శాంటా మార్టాలోని తన నివాసంలో కన్నుమూశారు. ఆయన మరణంతో కొత్త పోప్ ఎన్నిక అనివార్యమైంది. దీంతో శతాబ్దాల నాటి సంప్రదాయాన్ని కొనసాగిస్తూ 133 మంది కార్డినల్‌లు అత్యంత రహస్యంగా సమావేశమై నూతన పోప్ గా అమెరికాకు చెందిన రాబర్ట్ ప్రివోస్ట్ మే 8న ఎన్నుకున్నారు. ఆయన 267వ పోప్‌గా ఎన్నికయ్యారు. అలాగే ఆయన పేరును లియో14గా మార్చారు. పోప్‌గా ఓ అమెరికన్ ఎన్నికకావడం ఇదే మొదటిసారి. పొల్లాచి సూపోప్‌గా ఎన్నికైన అనంతరం సంప్రదాయం ప్రకారం లియో14 సెయింట్ పీటర్స్ కూడలిలోని బాల్కనీ నుంచి తన రాక కోసం ఎదురుచూస్తున్న వేలమంది క్యాథలిక్‌లకు దీవెనలు అందించారు. వారిని ఆశీర్వాదాలు తెలియజేశారు. అంతకుముందు పోప్ ఎన్నిక పూర్తయిందనడానికి సూచికగా వాటికన్ నగరంలోని సిస్టిన్ చాపెల్ చర్చి పొగగొట్టం నుంచి తెల్లటి పొగ బయటకు వెలువడింది. దీంతో ఎన్నిక ప్రక్రియ పూర్తయినట్టు ప్రపంచానికి తెలిసింది. అమెరికాలోని షికాగోకు చెందిన ప్రివోస్ట్ మతగురువుగా సుదీర్ఘకాలం దక్షిణ అమెరికాలో పని చేశారు. ఇటీవల బిషప్ నియామక బాధ్యతలు చేపట్టారు. దాదాపు దశాబ్దకాలంపాటు పెరూలోని ట్రుజిల్లోలో సేవలు అందించారు. అనంతరం ఆయన పెరూ దేశంలోని చిక్లాయో నగర బిషప్‌గా నియమితులయ్యారు. 2014-2023 వరకూ దాదాపు దశాబ్దకాలం ఈ బాధ్యతలు నిర్వహించారు.

12-5Pg6exHMNWJQE.qxd:12-5Pg6exHMNWJQE.qxd 01/01/01 9:23 AM Page 1





గురుసంక్రమణ హోమాల సందర్భంగా పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

## శ్రీకాళహస్తిలో గురు సంక్రమణ హోమాలు

**శ్రీకాళహస్తి,మే 11ప్రభాతవార్త:** పుణ్యక్షేత్రం నిత్యం పూజలు,వేద మంత్రాలపఠనంతో పునీత మౌతుంది. ఈ నేపథ్యంలో ఆదివారం పట్టణం లోని తేరువీధిలోని పుష్పగిరి మఠంలో గురు సంక్రమణ హోమాలు,అభిషేకాలు, పూజలు నిర్వహించారు. శ్రీకాళహస్తీశ్వరాలయ ఆర్చకులు వరదాగురుకుల్ పర్యవేక్షణలో 'గురు సంక్రమణ పరిహార హోమాలు' భక్తి శ్రద్దలతో నిర్వహించారు. ఉదయం నుంచి తేరువీధి వేద మంత్రాల పఠనంతో దద్దరిల్లింది. ఆదివారం కావటంతో స్థానిక ఆధ్యాత్మిక వాదులతో పాటు చెన్నై నుంచి భక్తులు కూడా విశేష సంఖ్యలో పాల్గొన్నారు. శ్రీ శివశక్తిసేవా ఛారిటబుల్ ట్రస్టు సారధ్యంలో ఈ కార్యక్రమాలను ఏర్పాటు చేసారు. ప్రతి ఏటా గురువు రాశి మారటం ఆనవాయితి.ఈ నేపథ్యంలో గ్రహాల్లో పంచమగ్రహం అయిన బృహస్పతి వృషభరాశి నుంచి మిధునరాశిలో ప్రవేశించిన సందర్భంగా పూజలు,హోమాలు నిర్వహిస్తున్నట్లు వరదాగురుకుల్ వివరించారు. ప్రతి ఏటా బృహస్పతి ఒక రాశి నుంచి మరో రాశిలోకి మారే సమయంలో కొన్ని రాశుల వారు ఉపశమనం చేసుకోవాల్సి ఉంటుందని వివరించారు.ఈ నేపథ్యంలో బృహస్పతి వృషభరాశి నుంచి మిధున రాశిలోకి మారిన సమయంలో మేష, సింహ, కన్యా, వృశ్చికం,మకర, మీన రాశుల వారుపరిహారం చేసుకోవాల్సి ఉందని వివరించారు.

**హోమాలు, పూజలు:** శ్రీకాళహస్తిలోని తేరువీధిలోని పుష్పగిరి మఠం ఉదయం చక్కగా అలంకరించారు. మామిడి తోరణాలతో, అరటి చెట్లతో ముస్తాబు చేసారు.సుమారు పాతిక మంది వేదపండితులు వేద మంత్రాలను పఠించటం జరిగింది. ఈ సందర్భంగా వరదగురుకుల్ స్థానిక ఆచార సంప్రదాయం మేరకు కలశ స్థాపన గావించారు. హోమగుండం వెలిగించారు. పూజలు నిర్వహించారు. పూర్ణాహుతి గావించారు.ఈ సందర్భంగా హాజరైన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. లోకకళ్యాణార్థం నిర్వహించిన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో చాలా మంది తమ పేర్ల మీద హోమాలు జరుపుకున్నారు.ఈ సందర్భంగా వేదపండితులు వరదాగురుకుల్‌తోపాటు కమలాకర్ గురుకుల్, తేజ గురుకుల్, కార్తీక్ గురుకుల్, గణేష్,సురేష్ గురుకుల్స్‌తోపాటు తమిళనాడుకు చెందిన పలువురు అర్చకులు హాజరయ్యారు. ట్రస్టుకు సంబంధించిన అధ్యక్షులు జయసుధ, కార్యదర్శి సిద్దులునాయుడు,కోశాదికారి నీలకంఠం గురుకుల్ తదితరులు పర్యవేక్షించారు.

**15నశ్రీకాళహస్తీశ్వరాలయంలో . .**

గురు గ్రహం రాశి మారిన సమయంలో ఈ నెల 15న శ్రీకాళహస్తీశ్వరాలయంలో విశేష పూజలు,అభిషేకాలు నిర్వహించుటకు సన్నాహాలు చేస్తున్నట్లు నిర్వాహాకులు ఆలయ ప్రధానార్చకులు కరుణాకర్‌గురుకుల్ వివరించారు. ఈ నెల 15న గురు దక్షిణామూర్తి ఆలయం వద్ద భారీ ఎత్తున కార్యక్రమాలు నిర్వహించుటకు సన్నాహాలు చేస్తున్నారు.



## గోవింద నామస్మరణతో ప్రతిధ్వనించిన పెంచలకోన

### వైభవంగా నృసింహ జయంతి


**రాపూరు (నెల్లూరు), మే 11, ప్రభాతవార్త :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో ఆదివారం నృసింహ జయంతి సందర్భంగా పెద్ద ఎత్తున వచ్చిన భక్తులు పెంచలో గోవిందో..గోవిందా అంటూ చేసిన గోవింద నామస్మరణలతో పెంచలకోనలో కొండ కోనలు ప్రతిధ్వనించాయి. శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి వారి బ్రహ్మోత్సవాలలో విశేష పర్వదినమైన నృసింహ జయంతి సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు కోనకు చేరుకొని తలనీలలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఎండవేడి ఎక్కువ వుండటంతో స్వామి వారి కోనేరులో పలువురు స్నానాలు చేసి సేద తీరారు. సంతానం లేని మహిళలు అమ్మవారి ఆలయం పక్కనే వున్న చెట్టుకు సంతానం కలగాలని వారి చీర పైటను చింపి అందులో రాళ్ళు పెట్టి తమకు సంతానం ప్రసాదించాలంటూ చెట్టుకు ఊయల ముడుపులు కట్టారు. ఆరోగ్యం సరిగా లేని మహిళలు స్వామివారి ఆలయం, అమ్మవారి ఆలయం ముందు వరపడి మొక్కుకున్నారు. ఎండదాటికి తట్టుకోలేక భక్తులు ఆలయం పరిసరాలలో వున్న చెట్ల కింద సేద తీరారు.కోనకు పెద్ద ఎత్తున వస్తున్న భక్తులకు దాతలు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలు నిర్వహించి మంచినీరు, మజ్జిగ పంపిణీ చేశారు. రాపూరు పెంచలకోన రోడ్డులో రాపూరు పడమర వీధి మిత్ర బృందం అన్నదానం ఏర్పాటు చేయగా, ఆర్.ఎస్.ఎస్ రాపూరు శాఖ వారు, రాపూరు మండల ముదిరాజ్ అసోషియేషన్ వారు మజ్జిగ, మంచినీరు సరఫరా చేశారు. బోజ్జనపల్లి పంచాయితీకి చెందిన మూరంరెడ్డి వినయ్ కుమార్ రెడ్డి, భక్తులకు మజ్జిగ, మంచినీరు. సరఫరా చేశారు. వెలుగోను క్రాస్ రోడ్డు వద్ద వెలుగోను యూత్ అసోసియేషన్ వారు అన్న దాన కార్యక్రమం నిర్వహించారు. పెంచలకోనలో సైతం పలువురు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 11,30కి పెనుశిల లక్ష్మీనరసింహస్వామికి, ఉభయ దేవేరులకు ప్రత్యేకంగా పలు రకాలైన సుగంధ ద్రవ్యాలతో స్నపన తిరుమంజనం(అభిషేకం), శాస్త్రోక్తంగ నిర్వహించారు. ఇందులో బాగంగా స్వామి వారి ఆస్థాన మండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు పాలు,పెరుగు, నెయ్యి, తేనే, పంచదార వంటి పంచామృతాలతో పాటు, పలు రకాలైన పండ్ల రసాలు, సుగంధ ద్రవ్యాలతో ప్రత్యేకంగా స్నపన తిరుమం జనం(అభిషేకం), శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామి వారి అభిషేకాన్ని తిలకించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు రెవెన్యూ డివిజనల్ అధికారి నాగా సంతోష్ అనూష, బ్రహ్మోత్సవాల సేవా కమిటీ ఛైర్మన్ చెన్ను తిరిపాల్ రెడ్డి, పలువురు సేవా కమిటీ సభ్యులు, ఆలయ ఉప కమీషనర్ పోరెడ్డి శ్రీనివాసుల రెడ్డి,సీనియర్ సహాయకుడు పాలవల్లి లక్ష్మీ నారాయణ, ఆలయ ప్రధానార్చకులు గుండ్లూరు రామయ్య స్వామి, పెంచలయ్య స్వామి, తిరుమల వేదపాఠశాల పంచారాత్ర ఆగమపండితుడు రామానుజా చార్యులు,ఆలయ ముఖ్య అర్చకులు గుండ్లూరు శశి స్వామి తదితరులున్నారు.

## ఆర్టీసీ బస్సు, కారు ఢీ

## మహిళ మృతి, ముగ్గురికి గాయాలు

### అరుణాచలం ఆలయానికి వెళుతూ ప్రమాదం

**రొంపిచెర్ల, మే 11, ప్రభాతవార్త :** తమిళనాడులోని అరుణాచలం ఆలయానికి వెళుతూ జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక మహిళ మృతి చెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడిన సంఘటన చిత్తూరుజిల్లా తిరుపతి -మదనపల్లి జాతీయ రహదారిలో జరిగింది. బాధితుల కథనం మేరకు.. వైయస్సార్ కడప జిల్లా, యర్రమ్మక్క పల్లెకు చెందిన రమణ కుటుంబ సభ్యులు 7 మంది అరుణాచలం ఆలయ దర్శనం కోసం ఆదివారం బయలుదేరారు. చిత్తూరు మీదుగా వెళ్లాల్సిన వారు తిరుపతికి వెళ్లి అక్కడ దేవుని దర్శనం చేసుకుని మళ్లీ అరుణాచలం పోదామని వెళుతుండగా రొంపిచెర్ల మండలం, పెద్దగొట్టిగల్లు బస్ షెల్టర్ వద్ద తిరుపతి నుంచి రాయచోటికి వెళ్తున్న ఆర్టీసీ డీలక్స్ బస్సు, అరుణాచలం వెళుతున్న కియా సెల్టోస్ కారు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న రమణ(59), భార్య రాధ(55), చైతన్య (16), రేష్మికా (4) గాయపడ్డారు. గాయపడిన వారిని 108 వాహనంలో చికిత్స కోసం పీలేరు ప్రభుత్వ



ఆసుపత్రికి తరలించారు. అయితే గాయపడిన మహిళ రాధ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. దైవదర్శనానికి వెళుతూ జరిగిన ప్రమాదంలో మహిళ మృతి చెందడంతో కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. ఈ ప్రమాదంలో ఆర్టీసీ బస్సు, కారు రెండూ దెబ్బ తిన్నాయి. రొంపిచర్ల పోలీసులు సంఘటన స్థలాన్ని సందర్శించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# పంచేడులో విద్యుత్ సబ్‌స్టేషన్‌కు భూమి పూజ

### రైతు అమర్‌నాథ్‌రెడ్డి దాతృత్వాన్ని ప్రశంసించిన ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

**బుచ్చి (నెల్లూరు), మే 11, ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డి పాళెం మండలంలోని పంచేడు వద్ద మినగల్లుకు వెళ్ళేదారిలో 2 కోట్లా 77 లక్షల వ్యయంతో 33 / 11 కెవి సబ్‌స్టేషన్‌కి కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి భూమి పూజ నిర్వహించారు.ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతు సబ్‌స్టేషన్ మంజూరు అయినా దానికి స్థలం దొరకడం కొంత ఇబ్బంది అయిందని ఆ సమయంలో పంచేడుకు చెందిన పెనాక అమర్‌నాద్‌రెడ్డి మంచి మనస్సుతో స్థలాన్ని ఉచితంగా ఇవ్వడం అభినందనీయమని అమర్‌నాద్‌రెడ్డిని ప్రశంసించారు. కూటమి ప్రభుత్వం సంక్షేమం,అభివృద్ధి రెండు కళ్ళుగా చేసుకొని ముందుకు వెళుతుందని అన్నారు. కోవూరు నియోజకవర్గంలో 2కోట్లా 77 లక్షల వ్యయంతో 33/11 కెవి సబ్‌స్టేషన్ మంజూరు చేసిన విద్యుత్‌శాకా మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కి ఆమె ధన్యవాదాలు తెలిపారు. ఈ సబ్‌స్టేషన్ వల్ల ఇస్కపాళెం, పంచేడు, అన్నారెడ్డి పాళెం గ్రామాల పరిధిలో లోఓల్టేజి సమస్య ఉండదని అన్నారు. ప్రజలు సోలార్ పైన కూడా దృష్టి సారించాలని అన్నారు. సోలార్ ప్యానల్ పెట్టుకుంటే 60 వేల రూపాయాలు నుండి 78 వేలు వరకు సబ్సిడి వస్తుందని అన్నారు. ఒక్కసారి సోలార్ ప్యానల్ పెట్టుకుంటే 20-25 సంవత్సరాల వరకు ఉచితంగా విద్యుత్ పొంద వచ్చునని అన్నారు. ప్రతి ఒక్కరు సోలార్ ప్యానల్స్ వినియోగించుకోవాలని అన్నారు. ఈకార్యక్రమంలో చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా, జెన్కో ఏడి రమేష్ చౌదరి, తహసిల్దారు అంబటి వెంకటేశ్వర్లు, ఎంపిడిఒ శ్రీహరి, మినగల్లు సర్పంచ్ పూజిత,రాము, పెనాక అమర్‌నాద్‌రెడ్డి కుటుంబసభ్యులు, బత్తల హరికృష్ణా,ఎం.వి శేషయ్య,ఏటూరు శివరామకృష్ణారెడ్డి,కోడూరు కమలాకర్‌రెడ్డి,కళ్యాణ్‌రెడ్డి, బెజవాడ వంశీ కృష్ణారెడ్డి, వింజం రామానాయుడు, వల్లూరు రాఘవరెడ్డి ,తాళ్ళ నరసింహస్వామి,వల్లూరు శ్రీనివాసులు, వైస్ చైర్మన్ యరటపల్లి శివకుమార్‌రెడ్డి, వైస్ చైర్‌పర్సన్ పఠాన్ నస్రీన్ ,ట్రాన్స్‌కో ఏడి



సతీష్, టౌన్‌ఏఇ మనోహర్, రూరల్ ఏఇ శ్రీనివాసులు, సంగం ఏఇ మన్మదరావు, టంగుటూరు మల్లికార్జునరెడ్డి, మండల ఉపాధ్యాక్షురాలు నాగిరెడ్డి కీర్తనారెడ్డి, మహేంద్ర, రఘురాంరెడ్డి, పలువురు టిడిపినాయకులు, ట్రాన్స్‌కో సిబ్బంది పాల్గొన్నారు.

# తెలంగాణ ఎప్‌సెట్ 2025 ఫలితాల్లో చరిత్ర తిరగ రాసిన నారాయణ

### రెండు విభాగాల్లో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ నారాయణదే, 10 లోపు 5, 100 లోపు 54 ర్యాంకులు నారాయణ విద్యార్థులవే!

**హైదరాబాద్, మే 11, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన తెలంగాణ ఎప్‌సెట్- 2025 ఫలితాలలో నారాయణ విద్యార్థులు సంచలనాలు ఆవిష్కరించారు. ఇంజినీరింగ్, అగ్రి ఫార్మసీ రెండు విభాగాల్లోనూ రెండు స్టేట్ ఫస్ట్ ర్యాంకులతో చరిత్ర సృష్టించింది నారాయణ. స్టేట్ 1,1,8,9,10,11 వంటి అత్యుత్తమ ర్యాంకులు నారాయణ విద్యార్థులు కైవసం చేసుకున్నారు. ఇంజినీరింగ్ విభాగంలో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ భరత్ చంద్ర (హెచ్.టి.నెం: 2522ఇ09038) కైవసం చేసుకోగా,బణి బ్రత మాజీ హెచ్‌టినెం (2526సి18057)8వ ర్యాంకు,శ్రీ కార్తీక్(హెచ్.టి.నెం: 2526ఇ7009)స్టేట్ 10వర్యాంకు సాధించారు.అదే విధంగా11,13,14,16,19. 21,23,25,29,30,35,38,42,45,48,49, 50,56,57,58, 63,64,65,66,68,70,74, 76,78, 82,83, 87,92,94,95,97 వంటి 100లో 39 ర్యాంకులు,అగ్రి, ఫార్మసీ విభాగంలో పి,సాకేత్ రెడ్డి ( హెచ్‌టి నెం : 2511ఇ05290) స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధిచంగా,ఏ శామ్యూల్ సాత్విక్ (హెచ్‌టి నెం : 2513సి01226) స్టేట్ 9వ ర్యాంక్ కైవసం చేసుకున్నారు. అదే విధంగా 31,40,43,46,53,59,61,62,67,72,82,93,99, వంటి ట్యాప్ 100 ర్యాంక్‌లలో 15 ర్యాంకులు నారాయణ విద్యార్థులే చేజిక్కించుకున్నారు. మొత్తం 10లోపు 5,100 లోపు 54,500 లోపు 265, 1000 లోపు 492 ర్యాంకులు సాధించి విద్యార్థులు, తల్లిదండ్రుల ఆశయాల సాధనకు ఒక్క నారాయణ మాత్రమే సాధ్యమని మరోసారి నిరూపించారని నారాయణ విద్యాసంస్థల డైరక్టర్ డాక్టర్ పి. సింధూర నారాయణ,పి.శరణి నారాయణ పేర్కొన్నారు.అదే విధంగా ఇంజనీరింగ్‌లో విభాగంలో 100 లోపు 39 ర్యాంకులు కేవలం నారాయణ విద్యాసంస్థల ప్రణాళికతో సాధించినట్లు చెప్పారు. అగ్రి,ఫార్మసీ, విభాగంగా 100 లోపు 15 ర్యాంకులు నారాయణ విద్యార్థులు సాధించడం మెడికల్ ప్రోగ్రామ్‌పై నారాయణ విద్యాసంస్థలకు ఉన్న పట్టును రుజువు చేసిందని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. గత సంవత్సరంలో పోలిస్తే సీటు సాధించే ర్యాంకులు సంఖ్య అధికంగా ఉండటాన్ని గమనించాల్సిన విషయమన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో సింధూర నారాయణ మాట్లాడుతూ గత 46 సంవత్సరాలుగా కేవలం టాప్ ర్యాంకులను పరమావధిగా చేసుకుని రూపొందించిన నారాయణ విశిష్ట విద్యా ప్రణాళిక ద్వారానే ఈ ఘనవిజయాలను సాధించగలిగా మన్నారు. అదే విధంగా ఈఏపీసెట్‌గా మారిన ఎంసెట్‌లోనూ నారాయణ విజయప్రస్థానం నిరంతరాయంగా కొనసాగుతోందన్నారు.గత కొన్ని సంవత్సరాలుగా ఎంసెట్ ఫలితాలలో ఇంజినీ రింగ్, మెడికల్ విభాగాలలో టాప్ ర్యాంకులు సాధిస్తూ తమ ఆధిపత్యాన్ని కొనసాగిస్తూనే ఉన్నామని, ఈ పోటీ పరీక్షలలో తమకు పోటీ అనేది లేకుండా నిరంతరంగా శ్రమిస్తూనే ఉంటామని ఈ సందర్భంగా తెలిపారు. తమ రెగ్యూలర్ విద్యాప్రణాళికలో ప్రతి వారం ఎన్‌లెర్న్ సాఫ్ట్వేర్ ద్వారా ఛాప్టర్ వైజ్ ప్రాక్టీస్ టెస్టు, ఆన్‌లైన్ మాక్ టెస్టు నిర్వహిం చటంతోనే నారాయణ విద్యార్థులు ఇంతటి ప్రతిభాపాటవాలను ప్రదర్శించగలిగారని తెలిపారు.డైరెక్టర్ పి.శరణి నారాయణ మాట్లాడుతూ టాప్ ర్యాంకులు సాధించిన వారికి అత్యధిక సంఖ్యలో నారాయణ స్కూల్స్లో చదివిన విద్యార్థులే ఉన్నారన్నారు. అలాగే జేఈఈ మెయిన్ 2025లో దేశవ్యాప్తంగా 300/300 మార్కులు సాధించి ఆలిండియా ఓపెన్ కేటగిరీలో ఆలిండియా ఫస్ట్ ర్యాంక్ సాధించిన బణిబ్రత మాజీ (హెచ్ టి.నెం :250310746461) మన తెలంగాణ రాష్ట్రానికి చెందిన నారాయణ విద్యార్థి కావటం ఎంతో గర్వకారణమన్నారు. ఇంతటి ఘనవిజయం సాధించిన విద్యార్థులకు,వారి తల్లిదండ్రులకు, అధ్యాపక బృందానికి నారాయణ విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పునీత్ కొత్తప అభినందనలు తెలియజేశారు.



# ద్వారకా తిరుమలేశునికి దుర్గమ్మ పట్టువస్త్రాలు

### దుర్గమ్మ ఆలయంలో భక్తుల రద్దీ, సౌకర్యవంతంగా, త్వరితంగా దర్శనానికి ఇఓ చర్యలు

**ఇంద్రకీలాద్రి, మే 11, ప్రభాతవార్త:** అమ్మలగన్నమ్మ బెజవాడ దుర్గమ్మవారు ద్వారకా తిరుమలేశునికి ఆదివారం పట్టువస్త్రాలందించారు. ద్వారకా తిరుమలలో వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారి స్వయానా తోబుట్టువు దుర్గమ్మవారి తరపున శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం కు చెందిన ఆలయ ఇఓ వికె శ్రీనానాయక్ దంపతులు వేదపండితులతో ఆలయ అధికారులు, సిబ్బందితో కలిసి వెళ్ళి సాయంత్రం పట్టువస్త్ర సమర్పణ చేశారు. ఈ సందర్భంగా పట్టు వస్త్రాలను అందించడానికి ద్వారకా తిరుమలకు చేరుకున్న ఇఓ వికె శీనా నాయక్ దంపతులు మరియు పండిత బృందానికి ద్వారకా తిరుమల దేవా లయం ఇఓ ఎన్‌వివిఎస్ఎన్ మూర్తి వేదమర్యాదలతో, మంగళవాయిద్యాలతో స్వాగ తం పలికి శ్రీ ద్వారకా తిరుమల వేంకటేశ్వర స్వామివార్ల సన్నిధికి తీసుకెళ్ళారు. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వికె శీనా నాయక్ దంపతులు, ఇంద్రకీలాద్రి పండిత బృందంకు ద్వారకా తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి ప్రసాదాలు, చిత్రపటం, శేషవస్త్రాలను అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.



దుర్గమ్మ ఆలయ ఇఓ వికె శీనానాయక్ బృందానికి జ్ఞాపక నందిస్తున్న ద్వారకా తిరుమల ఇఓ, విరాళమందించిన దాతలకు దుర్గమ్మవారి చిత్రపటం అందిస్తున్న

**దుర్గమ్మవారి ఆలయంలో భక్తుల రద్దీ:** దుర్గమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా త్వరితగతిన దర్శనమయ్యేలా ఇఓ వికె శీనా నాయక్ చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు వేసవి తాపం ఉపశమానికి మజ్జిగ పంపిణీ చేశారు.

**వేదోక్తంగా సూర్యోపాసన:** దుర్గమ్మవారి ఆలయంలో ఆదివారంనాడు వేదోక్తంగా సూర్యోపాసన సేవను నిర్వహించారు. ఆదిత్యహృదయం, సూర్యాష్టకం, అరుణ పారాయణ, సూర్య నమస్కారాలు, సూర్య స్తుతి, ద్వాదశాదిత్య స్తుతి తదితర వేదమంత్రాలను పఠిస్తూ పూజాదికాలు నిర్వహించారు.అనంతరం ధూప, దీప నైవేద్యాలు సమర్పించి భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు.

**దుర్గమ్మకు నృత్య నీరాజనం:** దుర్గమ్మవారి ఆలయంలో ఆదివారం సాయంత్రం విజయవాడకు చెందిన శ్రీ కనకదుర్గ నృత్యమందిర్ నృత్య విద్యార్థులు భక్తిశ్రద్ధలతో పలు కీర్తనలకు, సంకీర్తనలకు, భక్తిగీతాలకు అనుగుణంగా నృత్యనీరాజనమర్పించి భక్తులను ఆకట్టుకున్నారు. కళాకారులకు దుర్గమ్మవారి దర్శనాన్ని అధికారులు ఏర్పాటు చేశారు. వారికి దుర్గమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలు అందించారు.

**నిత్యాన్నదానానికి విరాళం:** దుర్గమ్మవారి ఆలయంలో జరిగే నిత్యాన్నదాన పథకానికి విజయవాడకు చెందిన ఆలపాటి పార్ధసారధి రు1లక్ష విరాళాన్ని ఆలయాధికారులకు ఆదివారం అందించారు. దాతకు, వారి కుటుంబీకులకు దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసిన అధికారులు వారికి దుర్గమ్మవారి ప్రసాదాలు, శేషవస్త్రం, మెమొంటోలు అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

# మురళీ నాయక్‌ను యువత స్ఫూర్తిగా తీసుకోవాలి

### శాంతి ర్యాలీలో అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పిలుపు

**అనంతపురం, మే 11 ప్రభాతవార్త బ్యూరో :** 25 ఏళ్లకే దేశం కోసం ప్రాణాలర్పించిన అగ్ని వీర్ జవాన్ మురళీ నాయక్‌ని నేటితరం యువత స్ఫూర్తిగా తీసుకోవాలని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పిలుపునిచ్చారు. మురళీ నాయక్ ఆత్మకు శాంతి కలగాలని ఆదివారం సాయంత్రం అనంతపురం నగరంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీ పార్థసారథి, మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, అహుడా చైర్మన్ టీసీ వరుణ్, బిజెపి జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్, బిజెపి రాష్ట్ర నాయకులు సంధి రెడ్డి శ్రీనివాసులు, లలిత్ కుమార్, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జగదీష్, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భవాని రవికుమార్, కాంగ్రెస్ పార్టీ అనంతపురం నియోజకవర్గ ఇంచార్జ్ దాదా గాంధీ, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ కుటుంబసభ్యులు, కూటమి పార్టీల నాయకులు, ఇతర రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాసంఘాలు, అనంతపురం నగర వాసులు కులాలకు మతాలకు అతీతంగా పెద్ద ఎత్తున పాల్గొన్నారు. క్లాక్ టవర్ నుంచి సప్తగిరి సర్కిల్ వద్ద ఉన్న అమరవీరుల స్థూపం వరకు ఈ ప్రదర్శన సాగింది. జోహార్ మురళీ నాయక్ అంటూ ఈ ర్యాలీలో యువత పెద్ద ఎత్తున నినదించారు. అమరవీరుల స్థూపం వద్ద మురళీ నాయక్ చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ.. ఒక మారుమూల గ్రామం నుంచి వచ్చి దేశం కోసం ప్రాణాలర్పించిన గొప్ప వీరుడు మురళీ నాయక్ అని దగ్గుపాటి కొనియాడారు. ఈరోజు దేశం మొత్తం ఆ గ్రామం వైపు చూసేలా చేశారన్నారు. మురళీ నాయక్ త్యాగాన్ని దేశం ఎప్పటికీ మరువదన్నారు. మురళీ నాయక్ తల్లిదండ్రుల ఆవేదన చూస్తుంటే ఎవరికి కన్నీళ్లు ఆగడం లేదన్నారు. దేశానికి ఒక వీరున్ని అందించిన ఆ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఇప్పటికే ప్రభుత్వం 50 లక్షల పరిహారం, ఐదు ఎకరాల స్థలం, 380 గజాల ఇంటి స్థలం కేటాయించినట్లు తెలిపారు. కల్లి తండాకు మురళీ నాయక్ తాండగా పేరు మార్చడంతో పాటు నియోజకవర్గ కేంద్రంలోనూ, జిల్లా కేంద్రంలో ఆయన విగ్రహాలు ఏర్పాటు చేస్తామని మంత్రి నారా లోకేష్ ప్రకటించారన్నారు. మురళీ నాయక్ ప్రాణ త్యాగం నేటితరం యువతరానికి స్ఫూర్తి కావాలన్నారు. యువత సైన్యం వైపు అడుగులు వేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మరోవైపు ఎంపీ పార్థసారథి మాట్లాడుతూ.. పాకిస్తాన్ సైనికులు జరిపిన కాల్పుల్లో మురళీ నాయక్ మరణించడం చాలా బాధాకరమన్నారు యావత్ దేశాన్ని ఈ సంఘటన కలచివేసిందన్నారు. ఇవాళ ఆయన అంత్యక్రియల్లో ప్రభుత్వంలో ముఖ్య నాయకులంతా హాజరై నివాళులర్పించామన్నారు. ఇప్పటికే ఆ కుటుంబానికి అండగా నిలిచేందుకు ప్రభుత్వం కూడా ముందుకొచ్చిందన్నారు. ఆ వీరుడిని ఎప్పటికీ.. ఈ ప్రాంతం మరువదని పార్థసారథి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున మహిళలు, యువత పాల్గొన్నారు.







అనంతపురం జిల్లా కేంద్రంలో మురళీనాయక్‌కు కొవ్వొత్తులతో నివాళులు అర్పిస్తున్న నేతలు

12-5P□g7exHMNWJQE.qxd:12-5P□g7exHMNWJQE.qxd 01/01/01 9:25 AM Page 1





## దేశంలో 32 విమానాశ్రయాల మూసివేత

### ఢిల్లీలో 100 విమాన సర్వీసులు రద్దు

**న్యూఢిల్లీ, మే 11:** భారత్, పాకిస్థాన్ దేశాల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో ఢిల్లీ ఎయిర్‌పోర్టు నుంచి రాకపోకలు సాగించే విమాన సర్వీసులను ఆదివారం రద్దు చేశారు. ఎయిర్‌పోర్టు భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. అదేవిధంగా దేశంలోని ఉత్తర, పశ్చిమ ప్రాంతాల్లోగల 32 విమానాశ్రయాలను తాత్కాలికంగా మూసివేశారు. ఇవాళ ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు మొత్తం 100 విమాన సర్వీసులు రద్దయ్యాయి. దేశీయ విమాన సర్వీసుల్లో 52 అవుట్ గోయింగ్ సర్వీసులు, 44 ఇన్ కమింగ్ సర్వీసులు రద్దయ్యాయి. అదేవిధంగా ఒక అంతర్జాతీయ అవుట్ గోయింగ్ విమాన సర్వీసు రద్దయ్యింది. ఈ విషయాన్ని ఢిల్లీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు లిమిటెడ్ (డయల్) వర్గాలు వెల్లడించాయి. అయితే ఢిల్లీ ఎయిర్‌పోర్టు కార్యకలపాలు సాధారణంగానే సాగుతున్నాయని, అయితే ఎయిర్‌స్పేస్ డైనమిక్స్‌లో మార్పులు, పెరిగిన భద్రతా చర్యలవల్ల.. కొన్ని విమానాల షెడ్యూళ్లు, సెక్యూరిటీ చెక్ పాయింట్ ప్రాసెసింగ్ వేళలు ప్రభావితమయ్యాయని పేర్కొంది. దేశ రాజధాని ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని డయల్ ఆపరేట్ చేస్తోంది. ఇది దేశంలోనే అత్యంత రద్దీ విమానాశ్రయం. శనివారం భారత్ పాకిస్థాన్ దేశాలు కాల్పుల విరమణకు అంగీకారం తెలిపాయి. అయితే ఈ అంగీకారం కుదిరిన కాసేపటికే పాకిస్థాన్ మాట తప్పింది. ఆర్ఎస్ పుర సెక్టార్‌లో భారత సైన్యంపై దాడికి పాల్పడింది. ఈ దాడిని తిప్పికొట్టే క్రమంలో ఇద్దరు ఆర్మీ జవాన్‌లు, ఒక ఎయిర్‌ఫోర్స్ జవాన్, ఒక బీఎస్ఎఫ్ ఎస్ఐ వీర మరణం పొందారు.

## తప్పుడు పత్రాలతో ఐడిబిఐ బ్యాంకుకు టోకరా

### సిఐడికి చిక్కిన ఐదుగురు నిందితులు

**హైదరాబాద్, మే 11, ప్రభాతవార్త:** ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో గల ఐడిబిఐ బ్యాంకు నుంచి తప్పుడు పట్టాదార్ పాస్‌పుస్తకాలు తనఖా పెట్టి రైతుల పేరిట 2.61 కోట్ల రూపాయల రుణంతో పాటు కిసాన్ క్రెడిట్ కార్డుల పేరిట భోగస్ పత్రాలతో 25 లక్షల రూపాయల రుణాలు పొందిన కేసులో సిఐడి అధికారులు ఐదుగురు నేరగాళ్లను అరెస్టు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను సిఐడి చీఫ్ శిఖా గోయల్ మీడియాకు వెల్లడించారు. ఐడిబిఐ బ్యాంకులో 2015..2016 మధ్యన ఏడాది కాలంలో ఈ గోల్‌మాల్ జరిగింది.

279 రైతుల పట్టాదార్ పాస్ పుస్తకాలు తనఖా పెట్టడంతో 2.61 కోట్ల రూపాయల రుణం అప్పట్లో మం జూరయ్యింది. ఇదే సమయంలో మరో 26 మందికి కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా 25 లక్షల రూపాయల రుణం ఇచ్చారు. అయితే రైతుల పేరిట బ్యాంకులో తనఖా పెట్టిన పట్టాదార్ పాస్ పుస్తకాలు తప్పుడువని, కిసాన్ క్రెడిట్ కార్డు లబ్ధిదారులు భోగస్‌గా తేలింది. ఈ గోల్‌మాల్ 2018లో వెలుగు చూసింది. దీనిపై ఐ డిబిఐ బ్యాంకు ఉన్నతాధికారుల నుంచి అందిన ఫిర్యాదు మేరకు మొదట సత్తుపల్లి పోలీసు స్టేషన్‌లో కేసు నమోదవగా అనంతరం ఈ కేసు విచారణను సిఐడి కి బదలాయించారు. ఈ కేసులో ఆరు నెలల క్రితం నాటి ఐటిబిఐ స్థానిక బ్రాంచి మేనేజర్ రమేష్‌తో పాటు భోగస్ కార్యకలాపాలు నిర్వహణలో సహకరించిన స్థానికుడు సురేష్‌లను అరెస్టు చేశారు. ఈ గోల్‌మాల్‌లో పాలు పంచుకున్న కొత్తగూడెంకు చెందిన బి.వెంగళరావు, బి.జగన్నాథం, వై.హరిబాబు, ఎం.రాజశేఖర్, పి. కొండబాబులను తాజాగా సిఐడి అధికారులు అరెస్టు చేశారు. ఈ కేసులో తప్పించుకు తిరుగుతున్న మిగతా నిందితుల కోసం గాలిస్తున్నారు.

## యువ వికాసానికి సిబిల్ స్కోర్ కరెక్ట్ కాదు

### జాతీయ దివ్యాంగుల హక్కుల వేదిక

**హైదరాబాద్, మే 11, ప్రభాతవార్త:** రాజీవ్ యువ వికాసం పథకం కింద లబ్ధిదారులను ఎంపిక చేసేటప్పుడు సిబిల్ స్కోర్‌ను పరిగణనలోకి తీసుకోవాలనే తెలంగాణ ప్రభుత్వ నిర్ణయాన్ని జాతీయ వికలాంగుల హక్కుల వేదిక తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి ఎం. అడవయ్య ఖండించారు. ఈ మేరకు ఒక ప్రకటనలో ఈ పథకం కింద రాష్ట్ర వ్యాప్తంగా ఐదు లక్షల మంది నిరుద్యోగ యువతకు రూ.6,000 కోట్ల విలువైన సబ్సిడీ రుణాలను అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. 0ఈ పథకానికి సంబంధించిన సబ్సిడీ రుణాలను మంజూరు చేయాలని కోరుతూ 16 లక్షల మంది నిరుద్యోగుల నుండి దరఖాస్తులను అధికారులు స్వీకరించినట్లు తెలిపారు. అయితే, సిబిల్ స్కోర్‌ను పరిగణనలోకి తీసుకుంటామని రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రకటన వల్ల మెజారిటీ వికలాంగులు ఈ ప్రయోజనం పొందడానికి అనర్హులవుతారని ఆందోళన వ్యక్తం చేశారు.



## కదులుతున్న కారులో యువతిపై సామూహిక లైంగిక దాడి

**లక్నో, మే 11:** కదులుతున్న కారులో బాలికపై సామూహిక అత్యాచారం జరిగింది. ఆమె స్నేహితురాలిని కారు నుంచి తోసివేయడంతో మరణించింది. బాధితురాలి ఫిర్యాదుతో స్పందించిన పోలీసులు ఆ కారును అడ్డుకున్నారు. కాల్పులు జరిపి నిందితులను అరెస్ట్ చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని బులంద్‌షహర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. మే 6న సాయంత్రం వేళ నోయిడాకు చెందిన ఇద్దరు యువతులను ముగ్గురు వ్యక్తులు కారులో ఎక్కించుకున్నారు. ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించి లక్నోకు కారులో బయలుదేరారు. కాగా, ఆ వ్యక్తులు మార్గమధ్యలో మద్యం కొనుగోలు చేసి కారులో సేవించారు. కదులుతున్న కారులో యువతుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారు. ఒక యువతి ప్రతిఘటించడంతో కదుతులున్న కారు నుంచి బయటకు తోసేశారు. దీంతో మీరట్ జిల్లాలోని ప్రాంతంలో రోడ్డుపై పడి తీవ్రంగా గాయపడిన ఆమె చికిత్స పొందుతూ మరణించింది. మరోవైపు కదులుతున్న కారులో మరో యువతిపై ముగ్గురు వ్యక్తులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డాడు. ఖుర్జా ప్రాంతంలో ఆమె తప్పించుకుని పోలీసులకు సమాచారం ఇచ్చింది. పోలీసులు వెంటనే స్పందించారు. అలీగఢ్‌బులంద్‌షహర్ హైవేపై కారును అడ్డుకున్నారు. అందులో ఉన్న వ్యక్తులు కాల్పులకు ప్రయత్నించగా పోలీసులు ప్రతికాల్పులు జరిపారు. కాగా, ఎన్‌కౌంటర్‌లో కాళ్లకు గాయమైన నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. నోయిడాకు చెందిన సందీప్, అమిత్, ఘజియాబాద్‌కు చెందిన గౌరవ్‌గా వారిని గుర్తించారు. రెండు పిస్టళ్లు, లైవ్, ఖాళీ కాట్రిడ్జ్‌లతో పాటు కారును స్వాధీనం చేసుకున్నట్లు పోలీస్ అధికారి తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

# పాక్ గగనతల రక్షణ వ్యవస్థను ధ్వంసం చేసిన బ్రహ్మోస్

### దీర్ఘశ్రేణి క్షిపణి దాడులతో దాయాది దేశంలో వణుకు

**హైదరాబాద్, మే 11, ప్రభాతవార్త:** పహల్గాం ఉగ్రదాడి తరువాత దాయాది దేశంలోని ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేసి, ఆ దేశ ప్రధాన నగరాలలోని గగనతల రక్షణ వ్యవస్థలను కుదేలు చేసిన భారత సైన్యం కీర్తిని ఇప్పుడు ప్రపంచ దేశాలు కొనియాడుతున్నాయి. పాక్‌లోని లాహోర్, కరాచి, రావల్పిండి, ఇస్లామాబాద్ నగరాలలో గగనతల రక్షణ వ్యవస్థలతో పాటు పది కీలక ఎయిర్ బేస్‌లను తుత్తునీయలు చేసింది భారత సైన్యం అమ్ములపొదిలో గల దీర్ఘశ్రేణి క్షిపణి బ్రహ్మోస్ కావడం గమనార్హం. భారత రక్షణ శాఖ అమ్ముల పొదిలో కొత్తగా చేరిన బ్రహ్మాస్త్రమే బ్రహ్మోస్. రక్షణ రంగ పరిశోధనా సంస్థ డిఆర్‌డిఓ, రష్యాలోని నిప్కాం రక్షణ పరిశోధన సంస్థ సంయుక్తంగా దీనిని అభివృద్ధి చేశాయి. దీని రూపకర్త డిఆర్‌డిఓ ఆర్ అండ్ డి మాజీ బాస్ శివథాను పిళ్లై. మద్రాసు ఇంజినీరింగ్ కాలేజి నుంచి ఇంజినీరింగ్ పట్టా పొందిన ఆయన హార్వర్డ్ యూనివర్శిటీ నుంచి మేనేజ్‌మెంట్ విభాగంలో పట్టా పొందారు. దివంగత రాష్ట్రపతి, భారత మిస్సైల్ మ్యాన్‌గా పేరొందిన అబ్దుల్ కలాంకు ఈయన అత్యంత సన్నిహితుడు. ఇస్రోలోనూ పిళ్లై సేవలందించారు. భారత రక్షణ రంగంలో అధునాతన క్షిపణులు, ఆకాష్, పృథ్వీ, అగ్ని తరువాత సుదూర లక్ష్యాలను కచ్చితంగా తక్కువ వ్యవధిలో ఛేధించే క్షిపణిగా బ్రహ్మోస్‌కు పేరుంది. ఈ క్షిపణి భూమి నుంచి ఆకాశం నుంచి స ముద్రం నుంచి ప్రయోగించే వీలుంది మొదట 290 కిలోమీటర్ల దూరం లక్ష్యాలను ఛేధించిన ఈ క్షిపణి ప్రస్తుతం 800 కిలోమీటర్ల దూరం లక్ష్యాలను కూడా ఛేధించే స్థాయికి చేరింది. ధ్వనికంటే మూడు రెట్లు వేగంగా వెళ్లగలిగే సామర్థ్యం దీని సొంతం. శత్రు దేశాల రాడార్లకు చిక్కకుండా లక్ష్యాలను ఛేధించే సామర్థ్యం కలిగి వుంది. బ్రహ్మోస్ క్షిపణలు ప్రస్తుతం మిలటరీతో పాటు నావిక దళంలోనూ చేర్చారు. ఈ క్షిపణి మరో ప్రత్యేకత ఏమిటంటే కేవలం రెండు సెకన్లలో వేరు వేరు దిశల్లో ప్రయాణిస్తుంది. ఇందులో ఇనిషియల్, నావిగేషన్, రాడార్, స్పీకర్ వ్యవస్థ వుంది. దీంతో పాటు జిపిఎస్ బోర్డుతో సెన్సార్లతో ఇంటర్ కనెక్ట్ అయి వుంటుంది. ఒకేసారి 200 నుంచి 300 కిలోల పేలుడు పదార్థాలను మోయగలదు. ఈ క్షిపణిని 2001 జూన్ నెలలో మొదటిసారి పరీక్షించారు. ఆ తరువాత అంచల వారిగా అభివృద్ధి చేసి ఆధునీకరించారు. పాక్‌పై పలుచోట్ల వాడిన బ్రహ్మోస్ అధునాతన టెక్నాలజితో రూపొందినది. ఈ క్షిపణికి రెండు పేర్లు వున్నాయి . ఇందులో భారత్‌లోని అస్సాంలో గల బ్రహ్మపుత్రా నది పేరుతో మొదట బ్రహ్మపుత్రగా వుండగా రష్యాలోని మోస్కోవా నది పేరుతో మోస్కోవాగా రెండవ పేరు వుంది. చివరగా రెండింటిని కలిగి బ్రహ్మోస్‌గా ఖరారు చేశారు. వేదాలు, పురాణాల్లో అత్యంత శక్తివంతమైన దివ్యాస్త్రం బ్రహ్మాస్త్రం తరహాలో బ్రహ్మోస్ ప నిచేస్తుందని రక్షణ రంగ నిపుణులు చెబుతున్నారు. ఈ క్షిపణి సూపర్ సోనిక్ స్పీడ్ కలిగి వుంది. అడ్వాన్స్‌డ్ గైడెన్స్, నావిగేషన్ ద్వారా టార్గెట్ మిస్ అవ్వకుం డా క్షిపణి పనిచేస్తుంది. అణ్వస్త్రాలను కూడా ఈ క్షిపణి మోయగలదు. భారత సైన్యంలో మొదట నావికదళంలో 2005లో దీనిని వాడడం మొదలు పెట్టారు. ఐఎన్ఎస్ రాజ్‌పుత్ నౌక ద్వారా మొదటి క్షిపణి ప్రయోగించారు. 2007 నుంచి మిలటరీలో కూడా దీనిని చేర్చారు. ఇన్ని ప్రత్యేకతలు కలిగిన బ్రహ్మోస్ పాక్ లోని పలు నగరాలలో గగనతల రక్షణ వ్యవస్థలను నాశనం చేసింది.

**యుపిలో బ్రహ్మోస్ క్షిపణి ఉత్పత్తి కేంద్రం ప్రారంభం**

ఇదిలా ఉండగా పాక్‌ను కుదేలు చేసిన బ్రహ్మోస్ క్షిపణి తయారీ యూనిట్ ఉత్తరప్రదేశ్‌లో ఆదివారం నాడు ప్రారంభయ్యింది ఇక్కడ ఏడాదికి 80 నుంచి వ ంద బ్రహ్మోస్ క్షిపణులను తయారు చేస్తారు. వచ్చే ఏడాది నుంచి 100 నుంచి 150 వరకు మరింత ఆధునీకరించిన బ్రహ్మోస్ క్షిపణులను తయారు చేస్తారు. ప్ర స్తుతం వాడుకలో వున్న బ్రహ్మోస్ క్షిపణుల బరువు 2900 కిలోలు. వచ్చే ఏడాది తరువాత ఆధునీకరించిన బ్రహ్మోస్ క్షినణులను 1290 కిలోల బరువుతోనే నిర్మించే విధంగా రక్షణ రంగం వ్యూహాలు రచిస్తోంది. ఆధునీకరించిన బ్రహ్మోస్ క్షిపణులను సుఖోయ్ ఎస్‌యు 300 వంటి ఫైటర్ జెట్లు యుద్ధ రంగంలో ల క్ష్యాలను ఛేధిం చే విధంగా తయారుచేస్తున్నారు.



బ్రహ్మోస్ క్షిపణి

# నేటి నుంచి మరో 25 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్

### రద్దీ కార్యాలయాల్లో అదనపు సిబ్బంది నియమాకం

### జూన్ చివరికి అన్ని ఆఫీసుల్లో స్లాట్ బుకింగ్

### రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్, మే 11, ప్రభాతవార్త:** ప్రజల సమయాన్ని ఆదా చేసేందుకు, రిజిస్ట్రేషన్ ప్రక్రి యను మరింత వేగవంతం చేసేందుకు స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖలో కీలక సంస్కరణలకు స్వీకారం చుట్టామని రెవిన్యూ,సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.ఆస్తుల రిజిస్ట్రేషన్‌కు వచ్చే కొనుగోలు దారులు, అమ్మకందారులు గంటల తరబడి చెట్ల కింద నిరీక్షించవలసిన పరిస్థితిని మార్చుతూ, సబ్ రిజిస్టర్ కార్యాలయాలను ఆధునికీకరించడమే కాక, స్లాట్ బుకింగ్ విధానాన్ని దశలవారీగా అమలులోకి తీసుకొస్తున్నామని ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించారు. ఇప్పటికే గత నెల పదవ తేదీ నుంచి ప్రయోగాత్మకంగా 22 సబ్ రిజిస్టర్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ అమలు చేశామని అక్కడ విజయవంతం కావడంతో ఈ నెల 12వ తేదీ నుంచి మరో 25 సబ్ రిజిస్టర్ కార్యాలయాల్లో అమలు చేయబోతున్నామని ప్రకటించారు.

జూన్ నెలాఖరికి రాష్ట్రంలోని 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ విధానాన్ని అమల్లోకి తీసుకురావడానికి చర్యలు తీసు కుంటున్నామన్నారు. ప్రజలకు వేగవంతమైన, సమర్థమైన సేవలందించడమే లక్ష్యంగా సంస్కరణలు తీసుకురావడమే కాకుండా వాటిని అమలు చేయవలసిన బాధ్యత అధికారులదే స్పష్టం చేశారు.

ప్రజలకు వేగవంతమైన,సమర్థమైన సేవలం దించడమే లక్ష్యంగా సంస్కరణలు తీసుకురావడమే కాకుండా వాటిని అమలు చేయవలసిన బాధ్యత అధికారులదే స్పష్టం చేశారు. పని ఒత్తిడి ఎక్కువగా ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానాన్ని సులభతరం చేయడానికి మరియు 48 స్లాట్స్ కన్నా ఎక్కువ స్లాట్స్ అవసరం ఉన్న కార్యాలయాలలో ఇప్పుడున్న సబ్ రిజిస్ట్రార్లకు తోడుగా అదనపు సబ్ రిజిస్ట్రార్లను నియమిస్తామని, ఇప్పటికే ప్రయోగాత్మకంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని కుత్బుల్లాపూర్ కార్యాలయంలో అదనంగా ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లు సిబ్బందిని నియమించడం జరిగిందని తెలియజేస్తూ విజయవంతమైన ఈ విధానాన్ని ఉప్పల్, మహేశ్వరం, మంచిర్యాల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలలో ప్రవేశపెడుతూ అదనంగా ఒక్కొక్క సబ్ రిజిస్ట్రార్ ని నియమి స్తామన్నారు.

స్లాట్ బుకింగ్ విధానాన్ని దృష్టిలో పెట్టుకొని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను పునర్వ్యస్తికరణ చేస్తున్నామని, ఇందులో భాగంగా అధిక రద్దీ, తక్కువ రద్దీ ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిని విలీనం చేసి పనిభారాన్ని సమానం చేయడానికి చర్యలు తీసుకున్నామని,ఇందులో భాగంగా ఇప్పటికే రంగారెడ్డి జిల్లాలోని చంపాపేట, సరూర్ నగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల అధికార పరిధి విలీనం విజయవంతం కావడంతో షాద్ నగర్, ఫారూక్ నగర్ సిద్దిపేట మరియు సిద్దిపేట (రూరల్) విలీనం చేసినట్లు తెలిపారు.

నేటి నుంచిస్లాట్ బుకింగ్ అమలు కానున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు :హైదరాబాద్ ఆర్వో కార్యాలయం, హైదరాబాద్ ఆర్వో సౌత్,నారపల్లి, నారపల్లి, ఘట్కేసర్,మల్కాజిగిరి, ఉప్పల్, కాప్రా, బీబీనగర్, సిద్దిపేట్, సిద్దిపేట్ రూరల్, గజ్వేల్, మంచిర్యాల, పెద్దపల్లి,వరంగల్ ఆర్.ఓ. ఆఫీసు, జనగాం,ఘన్పూర్, నర్సంపేట,కల్వకుర్తి, నారాయణపేట, మహేశ్వరం, రంగారెడ్డి ఆర్.ఓ. ఆఫీసు, షాద్ నగర్, ఫరూక్‌నగర్, వనస్థలిపురం, శేరిలింగంపల్లి ఆర్వో కార్యాలయంలో నేటి నుంచి స్లాట్ బుకింగ్ ఉంటుందని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.

## వానకాలం సీజన్‌లో పత్తి విత్తులకు పెరిగిన డిమాండ్

**హైదరాబాద్, మే 11, ప్రభాతవార్త :** రానున్న వానాకాలం సీజన్‌లో పత్తి సాగులో గణనీయమైన పెరుగుదల చోటు చేసుకోనుంది. మార్కెట్‌లో మంచి రాబడి లభిస్తుందనే కారణంతో రైతులు తిరిగి పత్తి వైపు మొగ్గు చూపుతున్నారు. రైతాంగం పత్తి విత్తనాల సేకరణపై దృష్టి సారించడంతో వాటికి డిమాండ్ పెరిగింది. రాష్ట్రంలోని మొత్తం సాగు విస్తీర్ణంలో 40 శాతానికి పైగా వేస్తున్నారు. గత సీజన్లలో పత్తికి క్వింటాలుకు రూ. 8 వేల నుండి రూ. 14 వేల వరకు ఆకర్షణీయమైన ధరలు లభించాయి.

పప్పుధాన్యాలు, మొక్క జొన్న, సోయాబీన్ మరియు పసుపు వంటి ప్రత్యా మ్నాయ పంటలలో నష్టాలు సంభవిం చడంతో, రైతులు మెరుగైన రాబడి కోసం పత్తి వైపు మొగ్గు చూపుతున్నారు.


ఈ నేపథ్యంలో రాష్ట్రంలో పత్తి సాగు 20.50 లక్షల హెక్టార్లకు మించి విస్తరించనున్నందున, నాణ్యమైన పత్తి విత్తనాలకు డిమాండ్ విపరీతంగా పెరిగింది. ప్రణాళికాబద్ధమైన విస్తరణను కొనసాగించడానికి 1.07 కోట్లకు పైగా పత్తి విత్తనాలు అవసరమని అధికారులు అంచనా వేస్తున్నారు. విపత్తుల కారణంగా తలెత్తే ఆకస్మిక పరిస్థితులను తీర్చడానికి ఎల్లప్పుడూ 15 శాతం బఫర్ తప్పనిసరి. అయితే పత్తి విత్తనాల మొత్తం లభ్యత అంచనా వేసిన అవసరాలలో సగం మాత్రమే.


మే చివరిలో విత్తడం ప్రారంభించే ముందు రైతులకు తగినంత విత్తనాలు లభిస్తాయా లేదా అనే దానిపై రైతుల్లో ఆందోళన నెలకొంది. 2.4 కోట్ల ప్యాకెట్ల (ఒక్కొక్కటి 450 గ్రాములు) పత్తి విత్తనాలను అందు బాటులో ఉంచడానికి చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు చెబుతున్నారు. కానీ గత అనుభవాలను చూస్తే ఇది ఎంత వరకూ అమలవుతుందనేది ప్రశ్నార్థకమేనని రైతులు చెబుతున్నారు.

## తెలంగాణలో తగ్గిపోతున్న బాలికలు

### తాజా రిపోర్టు వెల్లడి

**న్యూఢిల్లీ, మే 11:** కేంద్ర హోం శాఖలోని జనగణన విభాగం విడుదల చేసిన ఒక రిపోర్టులో షాకింగ్ నిజం వెలుగు చూసింది. తెలంగాణ రాష్ట్రంలో లింగ నిష్పత్తి అంతకంతకూ పెరుగుతోందన్న చేదునిజానికి సంబంధించిన గణాంకాల వెల్లడయ్యాయి.రాష్ట్రంలో ఆడపిల్లల సంఖ్య అంతకంతకూ తగ్గుతోందని వెల్లడైంది. 2019లో ప్రతి వెయ్యి మంది మగ శిశువులకు 953 మంది ఆడ శిశువులు పుడితే.. 2021లో ఆడ శిశువుల సంఖ్య ఆందోళనకర స్థాయికి పడిపోయింది. కేవలం ప్రతి వెయ్యి మంది అబ్బాయిలకు 922 మంది అమ్మాయిలే పుడుతున్న వైనం వెలుగు చూసింది. తెలంగాణ రాష్ట్రంలో జననాల రేటు గ్రామీణ ప్రాంతాల్లో కంటే పట్టణ ప్రాంతాల్లోనే జననాల రేటు ఎక్కువగా ఉన్నట్లు తేలింది.2021లో గ్రామీణ ప్రాంతాల్లో 1,96,166 మంది పుడితే.. పట్టణ ప్రాంతాల్లో 4,15,485 మంది పుట్టినట్లుగా రిపోర్టు వెల్లడించింది. అదే సమయంలో 2021లో పుట్టిన పిల్లల్లో 3.18 లక్షల మంది మగ శిశువులకు 2.93 లక్షల మంది ఆడ శిశువులు పుట్టినట్లుగా గుర్తించారు. ఇక.. 2021లో కొవిడ్ కారణంగా మరణాల సంఖ్య తెలంగాణలో 15.4 శాతం పెరిగిన విషయాన్ని వెల్లడించింది. 2021లో గ్రామీణ ప్రాంతాల్లో 1.08 లక్షల మంది చనిపోతే పట్టణ ప్రాంతాల్లో 1.26 లక్షల మంది మరణించారు. 2021లో మొత్తం 2.34 లక్షల మంది చనిపోగా అందులో పురుషులు 1.35 లక్షలు కాగా మహిళలు 98 వేల మంది ఉన్నారు. నవజాత శిశువుల విషయానికి వస్తే గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే పట్టణ ప్రాంతాల్లోనే ఎక్కువగా చనిపోవటం గమనార్హం.2021లో మొత్తం 2.34 లక్షల మంది చనిపోతే అందులో 76 శాతం మంది 55 ఏళ్లకు పైబడిన వారు ఉన్నట్లుగా గుర్తించారు.ఇందులో 3544 ఏళ్ల వయస్కుల్లో 12 వేల మంది, 4554 మధ్య వయసు వారు 22 వేల మంది.. 5564 మధ్య వయసున్న వారు 42 వేల మంది.. 6569 ఏళ్ల మధ్య వయస్కులు 85 వేల మంది.. 70 ఏళ్ల పైబడిన వారిలో 51 వేల మంది మరణించారు. నవజాత శిశు మరణాల్లో మొదటి స్థానం హైదరాబాద్ కాగా.. రెండో స్థానంలో పెద్దపల్లి జిల్లా నిలిచింది.తెలంగాణలో 2021లో మొత్తం 6.11 లక్ష లమంది పుడితే.. ఇందులో అత్యధికంగా హైదరాబాద్ జిల్లాలోనే 95,666 మంది పుట్టగా.. అతి తక్కువగా ములుగు జిల్లాలో 3868 మంది మాత్రమే పిల్లలు పుట్టారు. జననాల విషయంలో హైదరాబాద్ తర్వాత మేడ్చల్, నిజామాబాద్, సంగారెడ్డి.. వరంగల్ అర్బన్,నల్గొండ, ఖమ్మం జిల్లాలు నిలిచాయి





వందేమాతరం ఫౌండేషన్ నిర్వాహకులతో బ్యాడ్మింటన్ ఒలింపిక్ మెడలిస్ట్ పుల్లెల గోపీచంద్

## క్రీడా పరిశోధనాలయంగా అక్షర వనం

### విద్యార్థుల్లో సమగ్ర వికాసాభివృద్ధి జరగాలి

### బ్యాడ్మింటన్‌లో ఒలింపిక్ మెడలిస్ట్ పుల్లెల గోపీచంద్

**కల్వకుర్తి, మే 11, ప్రభాతవార్త:** భవిష్యత్తులో కల్వకుర్తి పట్టణంలోని అక్షర వనం క్రీడా పరిశోధనాలయంగా వీరా జిల్లాలని బ్యాడ్మింటన్‌లో ఒలంపిక్ మెడలిస్ట్ పుల్లెల గోపీచంద్ ఆకాంక్షించారు. విద్యతో పాటు క్రీడల్లో రాణిస్తేనే ఉజ్వలమైన భవిష్యత్తు ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఆదివారం గోపీచంద్ పట్టణ సమీపంలోని అక్షర వనాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో యువతలో సమగ్ర వికాసాభివృద్ధి నిర్వహించాలంటే విద్యలో ఆటలు అంతర్భాగం కావాలని ఆయన పేర్కొన్నారు. విద్యతోపాటు ఆటలను కూడా సమానంగా విద్యార్థులకు అందించాలన్నారు. అక్షర వనంలో విద్యార్థులకు అందిస్తున్న విద్య వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు వందేమాతరం ఫౌండేషన్ అధ్యక్షులు మాధవరెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీపతి రెడ్డి, వందేమాతరం షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులు శశాంక్ రెడ్డి గోపీచంద్‌కు ఘనంగా స్వాగతం పలికారు. అక్షరవనంలో విద్యార్థులకు అందిస్తున్న బోధన, క్రీడా ఇతర అంశాలను ఆయన వివరించారు. భవిష్యత్తరాలకు అవసరమయ్యే విద్యను వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందించడం పట్ల, అక్షర వన నిర్వహణను ఆయన అభినందించారు. అక్షర వనంలో బ్యాడ్మింటన్ (షటిల్,) ఇండోర్ స్టేడియం అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో ఏర్పాటు చేయడం అభినందనీ యమన్నారు. అనంతరం ఆయన ఇండోర్ స్టేడియంలోని క్రీడాకారులతో కొద్దిసేపు షటిల్ ఆడారు. కార్యక్రమంలో షటిల్ క్రీడాకారులు కిషోర్ రెడ్డి, చంద్రశేఖర్, మురళి, బాలు, నగేష్, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రముఖ కంపెనీల వెబ్‌సైట్లపై ఆగని సైబర్ దాడులు

### జాగ్రత్తలు తీసుకోవాలంటున్న టిజిసిఎస్‌బి, ఎన్‌సిసిపి అధికారులు

**హైదరాబాద్, మే 11, ప్రభాతవార్త:** పహల్గాం ఉగ్రదాడి తరువాత భారత్, పాక్‌ల మధ్య తలెత్తిన ఉద్రిక్తల నేపథ్యంలో పాక్ సహా విదేశీ సైబర్ నేరగాళ్లు భారత సంస్థలతోపాటు కొన్ని ప్రముఖ సంస్థల వెబ్‌సైట్లపై దాడులు చేస్తుండడం పెరిగిపోయాయి. గడచిన రెండు వారాల వ్యవధిలో పాక్‌తోపాటు విదేశాలకు చెందిన సైబర్ నేరగాళ్లు భారత సంస్థల వెబ్‌సైట్లతో పాటు ప్రముఖ కంపెనీల వెబ్‌సైట్లను టార్గెట్ చేయడంపై వందల సంఖ్యలో ఫిర్యాదు అందడంతో ఈ విషయమై అన్ని విభాగాల అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) జాతీయ సైబర్‌నేరాల నివారణ పోర్టల్ (ఎన్‌సిసిపి) అధికారులు కోరుతున్నారు. రెండు వారా లుగా భారత సంస్థల వెబ్‌సైట్లతోపాటు ప్రముఖ కంపెనీల వెబ్‌సైట్లను సైబర్ నేరగాళ్లు హ్యాకింగ్ చేసేందుకు యత్నించడం, ఇందులోని డేటాను దొంగిలించేందుకు ప్రయత్నిస్తుండడంతో దీనిపై రంగంలో దిగిన టిజిసిఎస్‌బి, ఎన్‌సిసిపి అధికారులు నేరగాళ్ల భరతం పట్టేం దుకు చర్యలు తీసుకోవడంతోపాటు వెబ్‌సైట్ల నిర్వాహకులను అప్రమత్తం చేయసాగారు. సైబర్ నేరగాళ్లు ప్రధానంగా మాల్‌వేర్, ఫిషింగ్, స్పైవేర్‌తో కూడిన అడ్డ గోలు ఫైళ్లు పంపిస్తున్నట్లు టిజిసిఎస్‌బి, ఎన్‌సిసిపి అధికారులు గుర్తించారు. దీంతో పాటు వార్తలు, వీడియోలతో కూడిన కొన్ని రకాల ఫైళ్లను కూడా పంపుతున్నట్లు వారు గుర్తించారు. ఈ తరహా ఫైళ్ల విషయంలో ప్రభుత్వ, ప్రముఖ కంపెనీల వెబ్‌సైట్ల నిర్వాహకులు అప్రమత్తంగా వుండాలని అధికారులు కోరుతున్నారు.

ఈ ఫైళ్లను క్లిక్ చేస్తే అప్పటికే వున్న సమాచారం అంతా నేరగాళ్లకు చేరుతుందని వారు హెచ్చరించారు. దీంతో పాటు బ్యాంకు ఖాతాలు, ఇతర ముఖ్య మైన సమాచారం కూడా నేరగాళ్లకు చేరుతుందని అధికారులు హెచ్చరించారు. కొన్నిసార్లు సైబర్ నేరగాళ్లు భారీగా డబ్బులు డిమాండ్ చేయడంతో పాటు డబ్బులు ఇవ్వ కుంటే వెబ్‌సైట్లు పనిచేయకుండా చేస్తున్నారని రెండు విభాగాల అధికారులు తెలిపారు. అడ్డగోలుగా వచ్చే మెయిల్స్, వాట్సా ప్ సందేశాలకు స్పందించవద్దని వారు కోరారు. ప్రభుత్వ సంస్థల పేరిట వచ్చే మెయిల్స్‌ను ఒకటికి పదిమార్లు పరిశీలించుకున్న తరు వాతే స్పందిం చాలని అధికారులు చెబుతున్నారు. సైబర్ నేరగా ళ్లు తెలివిగా వైరస్‌లను వెబ్‌సైట్లలో పంపుతూ తమకు కావాలసిన సమాచారాన్ని దొంగిలిస్తున్నారని అధికారులు హెచ్చరించారు. రాష్ట్రాల సైబర్ నేరాల నివారణ విభాగం, జిల్లా పోలీసు విభాగాలు కూడా ఈ విషయంలో అప్రమ త్తంగా ఉండాలని వారు కోరారు.

## వానకాలంలో 66.80 లక్షల ఎకరాల్లో వరి

### సర్కార్‌కు వ్యవసాయ శాఖ నివేదిక

**హైదరాబాద్, మే 11, ప్రభాతవార్త :** వచ్చే వానాకాలం సీజన్‌లో అత్యధికంగా సన్న రకం ధాన్యం సాగు చేసే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. మొత్తంగా అన్ని పంటలూ కలిపి వానాకాలం సీజనులో 1.34 కోట్ల ఎకరాల్లో సాగవుతాయని తెలిపింది. ఈ మేరకు వానాకాలం సీజన్ సాగు ప్రణాళికను సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపింది. దీంతో గత వానాకాలం సీజన్‌తో పోలిస్తే ఈ సారి సాగు విస్తీర్ణం సుమారు 4లక్షల ఎకరాలకుపైగా పెరిగే అవకాశం ఉన్నట్టు అంచనా. అందులో అత్యధికంగా 66.80 లక్షల ఎకరాల్లో వరి, 50 లక్షల ఎకరాల్లో పత్తి సాగవుతాయని పేర్కొంది. పౌరసరఫరాల శాఖ పేదలకు సన్నబియ్యం పంపిణీ చేయడం, క్వింటాలుకు రూ.500 బోనస్ ఇవ్వడంతో సన్నాలకు గిరాకీ పెరగనుంది. అంతేకాక సన్నాలకు మద్దతు ధర ఇచ్చి ప్రభుత్వమే కొనుగోలు చేయడం కలిసొచ్చే అంశంగా కనిపిస్తున్నది. సన్నాల సాగు 60 నుంచి 70 శాతానికిపైగా ఉండొచ్చని ప్రభుత్వం చెబుతోంది. గత సంవత్సరం వానాకాలం సీజన్‌లో 65.49 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా, అందులో 30 శాతం వరకు సన్న రకాల వరినే సాగు చేశారు. రాష్ట్రంలో వరి తర్వాత పత్తి సాగు రెండోస్థానం ఉంటుంది. ఈసారి పత్తి సాగు విస్తీర్ణం కూడా పెరగనున్నట్టు అంచనా వేసింది. కూరగాయలు, ఇతర ఉద్యానవన పంటలు కలిపి 10లక్షల ఎకరాల వరకు ఉండొచ్చని వ్యవసాయ శాఖ భావిస్తోంది.

12-5pg10.qxd:12-5pg10.qxd 01/01/01 8:46 AM Page 1



# ఐపీఎల్-2025లో వరస్ట్ ప్లేయింగ్

## ఫ్లాప్ ప్లేయర్లుగా స్టార్స్



**న్యూఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)-2025 సీజన్‌లో సస్పెన్షన్ (వాయిదా) వరకు జరిగిన మ్యాచ్‌ల ఆధారంగా పలువురు ప్లేయర్లు ఫ్లాప్ 11 గా మిగిలిపోయారు. ఈ సీజన్‌లో 57 మ్యాచ్‌లు పూర్తవగా, 58వ మ్యాచ్ మధ్యలో ఆగిపోయింది. ఈ సమయంలో, చాలామంది ఆటగాళ్లు మంచి ప్రదర్శనలు ఇవ్వగా, కొందరు స్టార్ ఆటగాళ్లు మాత్రం వారి పేరుకు తగినట్టుగా రాణించలేకపోయారు. ఈ జాబితాలో స్టార్ క్రికెటర్లు రిషబ్ పంత్, గ్లెన్ మాక్స్‌వెల్, షిమ్రాన్ హెట్మైర్ వంటి వారు తమ స్థాయికి తగ్గట్లు రాణించలేకపోయారు. బౌలింగ్ విభాగంలో షమీ, మోహిత్ శర్మ, రషీద్ ఖాన్ వంటి అనుభవజ్ఞులు నిరాశపరిచారు. భారీ ధరలకు కొనుగోలు అయినా, ఆటతీరులో ప్రదర్శన చూపకపోవడం తీవ్ర అసంతృప్తికి దారితీసింది. ఓపెనర్ల విషయానికి వస్తే, డీసీ తరఫున ఆడిన ఆస్ట్రేలియా యువ ఆటగాడు జేక్ ఫ్రేజర్ మెక్‌గుర్క్ ఈ సీజన్‌లో పూర్తిగా విఫలమయ్యాడు. గత సీజన్‌లో మెరుపు లాంటి ఆటతీరుతో ఆకట్టుకున్న అతడు, ఈసారి ఆరు ఇన్నింగ్స్‌లలో కేవలం 55 పరుగులకే పరిమితమయ్యాడు. అతని సరసన ఓపెనింగ్ ప్లేస్ దక్కించుకున్న ఇషాన్ కిషన్ సన్ రైజర్స్ హైదరాబాద్ తరఫున ఈ సీజన్‌లో ఓపెనర్‌గా ఆడకపోయినా అతడి ఆటతీరు నిరాశ కలిగించింది. 10 మ్యాచ్‌ల్లో కేవలం 196 పరుగులు చేయడం, తక్కువ స్ట్రైక్ రేట్‌తో ఆడడం వల్ల, హైదరాబాద్‌పై ఒత్తిడి పెరిగింది. అలాగే మిడిల్ ఆర్డర్‌లో అత్యంత నిరాశజనక ఆటగాళ్లుగా వెంకటేష్ అయ్యర్, రిషబ్ పంత్, నితీష్ కుమార్, గ్లెన్ మాక్స్‌వెల్, షిమ్రాన్ హెట్మైర్ నిలిచారు. వేంకటేష్ అయ్యర్‌ను మెగా వేలంలో రూ.23.75 కోట్లకు కొనుగోలు చేసినప్పటికీ, అతను ఒక్క అర్ధ సెంచరీ తప్పించి మిగిలిన మ్యాచ్‌లలో పూర్తిగా విఫలమయ్యాడు. ఇక లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్‌గా వ్యవహరించిన రిషబ్ పంత్, ఈ సీజన్‌లో అత్యంత ఖరీదైన ఆటగాడిగా ఉన్నప్పటికీ, 100 కంటే తక్కువ స్ట్రైక్ రేట్‌తో కేవలం 128 పరుగులు మాత్రమే చేసి తీవ్రంగా నిరాశ పరిచాడు. నితీష్ రెడ్డి, మాక్స్‌వెల్, హెట్మైర్ వంటి అంతర్జాతీయ క్రికెటర్లు తమ జట్లకు గెలుపు తేడా తేల్చే స్థాయిలో రాణించాల్సి ఉన్నా, పరిస్థితులకు తగినట్టుగా ప్రదర్శన ఇవ్వలేకపోయారు. మాక్స్‌వెల్ ఆరు ఇన్నింగ్స్‌లలో కేవలం 48 పరుగులు మాత్రమే చేయడం, అతనిపై పెట్టుకున్న ఆశలను పూడ్చలేకపోయినట్లు చూపిస్తుంది.

బౌలింగ్ విభాగంలో, స్పిన్, పేస్ విభాగాలలో కూడా పలువురు స్టార్ ఆటగాళ్లు ఫెయిల్ అయ్యారు. రషీద్ ఖాన్, గత ఐపీఎల్ సీజన్లలో ప్రభంజనం సృష్టించినవాడే అయినా, ఈసారి 11 ఇన్నింగ్స్‌లలో కేవలం 8 వికెట్లే తీసి, 9.09 ఎకానమీతో పరుగులు ఇచ్చాడు. ఆయన సహచరుడైన రవి బిష్ణోయ్ కూడా 10 మ్యాచ్‌లలో కేవలం 9 వికెట్లు మాత్రమే తీసి 10.41 ఎకానమీతో పరుగులు ఇచ్చాడు. పేస్ విభాగంలో మోహిత్ శర్మ, మహ్మద్ షమీ లాంటి అనుభవజ్ఞులు కూడా దారుణంగా విఫలమయ్యారు. మోహిత్ ఏడు మ్యాచ్‌లలో కేవలం రెండు వికెట్లే తీసి 10 ఎకానమీతో పరుగులు ఇచ్చాడు. షమీ, 9 మ్యాచ్‌ల్లో కేవలం ఆరు వికెట్లు తీసి సన్ రైజర్స్ పేలవ ప్రదర్శనకు ప్రధాన కారణం అయ్యాడు.

# ఇటాలియన్ ఓపెన్‌లో.. స్వియాటెక్ నిష్క్రమణ



## డేనియల్ కాలిన్స్ చేతిలో వరల్డ్ నంబర్ టు ఓటమి

**న్యూఢిల్లీ:** ఇటాలియన్ ఓపెన్ 2025లో ప్రపంచ నెంబర్ టు స్వియాటెక్ మూడో రౌండ్‌లోనే నిష్క్రమించింది. అద్భుతమైన రికార్డును కలిగి ఉన్న పోల్స్ క్రీడాకారిణికి స్వియాటెక్ ముందస్తు నిష్క్రమణ పెద్ద షాక్.ఆదివారం రోమ్‌లో జరిగిన ఇటాలియన్ ఓపెన్ నుంచి ఇగా స్వియాటెక్ షాక్‌తో ఎలిమినేట్ అయింది. ప్రస్తుత రోమ్ ఛాంపియన్ డేనియల్ కాలిన్స్ చేతిలో 6-1, 7-5 తేడాతో ఓడిపోయింది. ప్రపంచ నంబర్ టూ స్వియాటెక్ ఫోరో ఇటాలికోలో నాల్గవ టైటిల్ కోసం వేటాడుతోంది. కానీ ఫ్రెంచ్ ఓపెన్‌కు ముందు జరిగిన చివరి ప్రధాన టోర్నమెంట్‌లో మూడవ రౌండ్‌ను దాటలేకపోవడం పెద్ద సంచలనం అయింది. గత సంవత్సరం మయామిలో గెలిచిన తర్వాత ప్రపంచ 35వ ర్యాంక్ క్రీడాకారిణి రెండవ డబ్ల్యూటిఎ-1000 టైటిల్‌ను గెలుచుకోవడానికి ప్రయత్నిస్తున్నందున, కాలిన్స్ ఇప్పుడు చివరి 16లో ఎలినా స్విటోలినా లేదా తోటి అమెరికన్ హేలీ బాప్టిస్ట్‌తో తలపడనుంది. కాగా ఈ నెల ప్రారంభంలో జరిగిన మాడ్రిడ్ ఓపెన్ సెమీఫైనల్లో కోకో గౌఫ్ చేతిలో వరుస సెట్లలో ఓడిపోవడంతో ఆమె ఓటమి పాలైన తీరు రోలాండ్ గారోస్ కంటే ఆందోళన కలిగించే సంకేతం. నాలుగు ఫ్రెంచ్ ఓపెన్ టైటిళ్లను గెలుచుకున్న క్రీడాకారిణి స్వియాటెక్ మొదటి సెట్‌లో నాలుగుసార్లు బ్రేక్ చేయబడింది. ఈ సారి ఆధిపత్యం సాధించలేని స్వియాటెక్, గతంలో తొమ్మిది సమావేశాలలో ఎనిమిదిసార్లు కాలిన్స్‌తో తలపడింది.

# ముగిసిన ఆర్చరీ ప్రపంచ కప్..

## దీపిక, పార్థ్‌కు కాంస్యాలు.. భారత్ ఖాతాలో మొత్తం 7 పతకాలు



**న్యూఢిల్లీ:** ఆర్చరీ ప్రపంచ కప్ స్టేజ్ 2 టోర్నీలో రెండు స్వర్ణాలు, ఒక రజతం మరియు నాలుగు కాంస్య పతకాలతో భారత్ తన ప్రచారాన్ని ముగించింది. షాంఘైలో ఆదివారం జరిగిన ఆర్చరీ ప్రపంచ కప్ స్టేజ్ 2లో చివరి రోజున వ్యక్తిగత రికర్వ్ ఈవెంట్లలో దీపికా కుమారి, పార్థ్ సలుంఖే కాంస్య పతకాలను సాధించారు. సెమీఫైనల్లో దీపిక కొరియాకు చెందిన లిమ్ సిహియోన్ చేతిలో 1-7 (26-27, 28-28, 28-30, 28-29) తేడాతో ఓడిపోయింది. అయితే, 30 ఏళ్ల భారత క్రీడాకారిణి కాంస్య పతక పోరులో మరో కొరియా మరియు మాజీ ప్రపంచ ఛాంపియన్ కాంగ్ చైయంగ్‌ను 7-3 (27-27, 28-27, 27-30, 30-29, 29-28) తేడాతో ఓడించింది. ఆర్చరీ ప్రపంచ కప్ దశలో నాలుగుసార్లు ఒలింపియన్ మరియు రెండు సార్లు ప్రపంచ ఆర్చరీ ఛాంపియన్‌షిప్ రజత పతక విజేత అయిన దీపికకు ఇది 12వ వ్యక్తిగత పతకం కాగా, మొత్తం మీద 31వ పతకం కావడం విశేషం. ఇక పురుషుల రికర్వ్ వ్యక్తిగత సెమీఫైనల్లో, పార్థ్ తీవ్రంగా పోరాడి 4-6 (26-27, 28-30, 28-27, 29-28, 25-28) తేడాతో ప్రస్తుత ఒలింపిక్ ఛాంపియన్ కొరియాకు చెందిన కిమ్ వూజిన్ చేతిలో ఓడిపోయాడు. కాగా మహిళల వ్యక్తిగత కాంపౌండ్ ఈవెంట్‌లో మధుర ధమన్ గోంకర్ బంగారు పతకాన్ని గెలుచుకోగా, కాంపౌండ్ టీమ్ విభాగంలో అభిషేక్ వర్మ, రిషబ్ యాదవ్ మరియు ఓజాస్ డియోటలేలతో కూడిన భారత పురుషుల త్రయం పోడియంలో అగ్రస్థానంలో నిలిచింది. మహిళల కాంపౌండ్ టీమ్ విభాగంలో వెన్నం జ్యోతి సురేఖ, తనిపర్తి చికిత, మధురలతో కూడిన మహిళల జట్టు రజతం సాధించింది. 2028లో జరిగే లాస్ ఏంజిల్స్ గేమ్స్‌లో కాంపౌండ్ ఆర్చరీ ఒలింపిక్ అరంగేట్రం చేసే కాంపౌండ్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో మధుర మరియు అభిషేక్ కూడా కాంస్యం గెలుచుకున్నారు. పురుషుల వ్యక్తిగత కాంపౌండ్ ఈవెంట్‌లో రిషబ్ కాంస్య పతకాన్ని గెలుచుకున్నాడు. అయితే, దీపిక లాగే, పార్త్ కూడా ఫ్రెంచ్ ఆటగాడు బాప్టిస్ట్ అడిస్‌పై 6-4 (30-28, 28-28, 25-25, 27-30, 29-28) తేడాతో విజయం సాధించి కాంస్యం సాధించగలిగాడు. 21 ఏళ్ల ఈ భారతీయుడు తన తొలి ప్రపంచ కప్ పతకాన్ని గెలుచుకున్నాడు. ఇక ప్రపంచ కప్ యొక్క మూడవ దశ జూన్ 3 నుండి 8 వరకు అంటాల్యలో జరుగనుంది.

# భారత్‌దే ట్రై సిరీస్

## శ్రీలంకపై 97 రన్స్ తేడాతో విక్టరీ

## శతకంతో చెలరేగిన స్మృతి



**న్యూఢిల్లీ:** మహిళల 3జట్ల వన్డే ట్రై సిరీస్ ఫైనల్లో భారత మహిళల జట్టు అద్భుత విజయాన్ని నమోదు చేసింది. శ్రీలంక వేదికగా కొలంబో (ఆర్పిఎస్) స్టేడియంలో శ్రీలంక మహిళల జట్టుతో ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో భారత్ 97 పరుగుల తేడాతో గెలిచి సిరీస్‌ను సొంతం చేసుకుంది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 342 పరుగుల భారీ స్కోర్ చేసింది. ఓపెనర్ స్మృతి మందాన మరోసారి తన తడాఖా చూపించి రెచ్చిపోయింది. ఆమె 101 బంతుల్లో 15 ఫోర్లు, 2 సిక్సులతో చెలరేగి 116 పరుగుల అద్భుత శతకం బాదింది. ఆమెకు తోడుగా హర్లీన్ డియోల్ 56 బంతుల్లో 4 ఫోర్లతో 47 పరుగులు, హర్మన్‌ప్రీత్ కౌర్ 30 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్‌తో 41పరుగులు, జెమీమారోడ్రిగ్స్ 29బంతుల్లో 4 ఫోర్లుతో 44 పరుగులు చేసి సత్తా చాటారు. చివర్లో దీప్తి శర్మ 14 బంతుల్లో 3 ఫోర్లతో 20 పరుగులు చేసి నాటౌట్‌గా ఫినిషింగ్ టచ్ ఇచ్చింది. ఇక శ్రీలంక బౌలింగ్లో మాల్కి మడారా, దెవ్మి విహంగా, సుగంధిక కుమారి తలో రెండు వికెట్లు తీశారు. ఇక 343 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన శ్రీలంక మహిళలు 48.2 ఓవర్లలో కేవలం 245 పరుగులకే ఆలౌట్ అయ్యారు. కెప్టెన్ చమారి అటపట్టు 66 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్‌తో 51 పరుగులు, నీలక్షిక డి సిల్వా 58 బంతుల్లో 5 ఫోర్లతో 48 పరుగులు చేసి రాణించారు, మిగతా ఆటగాళ్లు పెద్దగా ఆకట్టుకోలేకపోయారు. వంశీ గుణరత్నే 41బంతుల్లో 36 పరుగులు, హర్షిత సమరవిక్రమ 32 బంతుల్లో 26 పరుగులు, అనుష్క సంజీవని 41 బంతుల్లో 28 పరుగులుతో జట్టు స్కోరును పెంచారు. ఇక భారత్ బౌలింగ్లో స్నేహ రానా 9.2 ఓవర్లలో 38 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టింది. అమన్జోత్ కౌర్ 3 వికెట్లు తీయగా, శ్రీ చరణి ఒక వికెట్ తీసింది. దీనితో 97 పరుగుల తేడాతో భారత మహిళా జట్టు వన్డే ట్రై సిరీస్ ను కైవసం చేసుకుంది. ఇక ప్లేయర్ అఫ్ ది మ్యాచ్ గా స్మృతి ఎంపిక అవ్వగా, ప్లేయర్ అఫ్ ది సిరీస్ గా స్నేహ రానా ఎన్నికైంది. ఇక ఈ మ్యాచ్ లో స్మృతి మందాన సెంచరీ చేయడంతో వన్డేలలో అత్యధిక సెంచరీలు చేసిన మూడో మహిళగా రికార్డ్ సాధించింది.

# ఛాంపియన్స్ లీగ్‌కు మార్సెయిల్లే, మొనాకో అర్హత



**న్యూఢిల్లీ:** మార్సెయిల్ కంటే ఒక పాయింట్ వెనుకబడి, మొనాకో తన 18వ విజయాన్ని నమోదు చేసుకుంది, లియాన్‌ను 2-0 తేడాతో ఓడించింది. అలాగే లెస్ ఫోసీన్స్ లీ హావ్రేపై విజయంసాధించింది. మార్సెయిల్ మరియు మొనాకో వచ్చేసీజన్‌లో యూనియన్ ఆఫ్ యూరోపియన్ ఫుట్‌బాల్ అసోసియేషన్స్ (యుఇఎఫ్ఎ) ఛాంపియన్స్ లీగ్‌లో స్థానాలను ఖరారు చేసుకుంది. పారిస్‌లో ఆదివారం జరిగిన లీగ్ 1 ఛాంపియన్ పారిస్ సెయింట్ జర్మైన్ (పిఎస్‌జి) గొంకాలో రామోస్ హ్యాట్రిక్‌తో చివరి స్థానంలో ఉన్న మోంట్ పెల్లియర్‌ను 4-1తో ఓడించింది. రెండుసార్లు గోల్ చేయడంతో లీగ్ 1 జట్టు వచ్చే సీజన్ ఛాంపియన్స్ లీగ్‌లో స్థానం సంపాదించింది. సీజన్ చివరి మ్యాచ్ రోజున, 85వ నిమిషంలో మాసన్ గ్రీన్‌వుడ్ 19వ లీగ్ గోల్ చేయడంతో రెండవ స్థానంలో ఉన్న మార్సెయిల్ జట్టు కష్టాల్లో ఉన్న లెహావ్రేపై తిరిగి ఆధిక్యంలోకి వచ్చింది. అమీన్ గౌరి రెండు సార్లు గోల్ చేయగా, మార్సెయిల్ 3-1 తేడాతో గెలిచింది. మార్సెయిల్ కంటే ఒక పాయింట్ వెనుకబడి, మొనాకో తన 18వ విజయాన్ని, 2-0 తేడాతో లియోన్‌పై సాధించింది, టకుమి మినామినో మరియు డెనిస్ జకారియా గోల్స్ చేశాడు. ఇక హాఫ్ టైం తర్వాత మార్సెయిల్ జట్టుకు గౌరి ఓపెనర్‌గా గోల్ చేశాడు, వచ్చే సీజన్‌లో అగ్రస్థానంలో కొనసాగాలని పట్టుదలతో, లె హావ్రే ఈక్వలైజర్ కోసం తీవ్రంగా ప్రయత్నించాడు మరియు జోసు కాసిమిర్ సహాయంతో ఇస్సా సౌమారే గోల్ కీపర్ గెరోనిమో రుల్లిని ఓడించినప్పుడు ఆ గోల్ సాధించాడు. బాక్స్ వెలుపల నుండి గ్రీన్‌వుడ్ చేసిన అద్భుతమైన కర్ల్ స్ట్రైక్ తిరిగి ట్రాక్‌లోకి తెచ్చింది మరియు విరామ సమయంలో అదనపు సమయంలో గౌరి విజయానికి మరింత మెరుపును అందించాడు. కాగా ఛాంపియన్స్ లీగ్ యొక్క గ్రూప్ దశలకు మొదటి మూడు స్థానాల్లో నిలిచిన జట్టు అర్హత సాధిస్తుంది. మరియు నాల్గవ జట్టు అర్హత రౌండ్లలో స్థానం సంపాదించుకుంటుంది.

# విజయానికి వారెన్ బఫెట్ చెప్పిన 5 సూత్రాలు

**ముంబై, మే 11:** మన కళ్ల ముందే విజయాలు సాధించిన వ్యక్తులు మనకు ఆదర్శంగా నిలుస్తారు. వారిలో అమెరికాకు చెందిన వ్యాపారవేత్త వారెన్ బఫెట్ ఒకరు. ఆయన పెట్టుబడిదారుడు, పరోపకారి, బెర్క్ షైర్ హాత్ వే కంపెనీ చైర్మన్. ప్రపంచంలోని అత్యంత ధనవంతుల్లో ఒకరు. మంచి పెట్టుబడులు పెట్టాలంటే తెలుసుకోవాల్సిన ఐదు విషయాలను ఆయన వెల్లడించారు. ఆ విషయాలను ఇప్పుడు తెలుసుకుందాం. మూలధనాన్ని రక్షించుకోవడం పెట్టుబడిదారుల ప్రధాన బాధ్యతని బఫెట్ తెలిపారు. డబ్బును



పోగొట్టుకుంటే మీరు రేసులో వెనుకబడిపోతారు. దాని నుంచి కోలుకోవడం కష్టంగా మారుతుంది. ఒక స్టాక్ లో 50 శాతం నష్టపోతే, మరో దానిలో లాభాలు సంపాదించాలి. ముఖ్యంగా పెట్టుబడి లో నష్టాలను నివారించడానికి కష్టబడి పనిచేయడమే సరైన మార్గమని ఆయన నమ్మకం. ఎక్కువ డబ్బులు పెట్టి ఒక మంచి కంపెనీని కొనడం కంటే, తక్కువ డబ్బులతో మధ్యస్త కంపెనీ కొనడం ఉత్తమమని బఫెట్ చెబుతారు. దీని వల్ల తక్కువ ధరకు నాణ్యత కలిగిన కంపెనీలో పెట్టుబడి పెట్టే అవకాశం కలుగుతుంది. ఇది వ్యాపార రంగంలో పెద్ద మార్పును తీసుకువస్తుంది. దీర్ఘకాలంలో లాభాల బాటలో పయనించే అవకాశం కలుగుతుంది. భావోద్వేగాలను దూరంగా ఉండడం పెట్టుబడి దారుడి ప్రధాన లక్షణం. దీనినే బఫెట్ వ్యతిరేక పెట్టుబడి కళగా అభివర్ణించారు. మార్కెట్ బాగున్నప్పుడు ధరలు పెరుగుతాయి. దీని వల్ల నష్టాలు కలుగుతాయి. అయితే భయాందోళనలు తలెత్తినప్పుడు స్టాక్ ల ధరల తగ్గే అవకాశం ఉంది. ఆ సమయంలో మంచి డీల్‌లను అందుకోవచ్చు. పెట్టుబడిదారుడికి ఓర్పు అనేది చాలా అవసరం. పెట్టుబడి పెట్టిన వెంటనే లాభాల కోసం ఆలోచించడం సరి కాదు. మంచి కంపెనీలో ఏళ్ల తరబడి డబ్బులను నిల్వ ఉంచాలి. అసహనంగా ఉండే వారు తరచూ అధిక ధరలకు స్టాక్‌లను కొనుగోలు చేసి, మార్కెట్లు పెరిగినప్పుడు తక్కువ ధరకు అమ్మేస్తారు. తద్వారా ఓపికతో వేచి ఉండే ఇన్వెస్టర్లు లాభాలు పొందుతారు. డబ్బులను సంపాదించడానికి నిరంతరం కొత్త మార్గాలను అన్వేషించాలి. ఒక రకంగా చెప్పాలంటే నిద్ర పోతున్నప్పుడు కూడా డబ్బు సంపాదించడానికి మార్గం ఆలోచించాలి. లేకపోతే మీరు చనిపోయే వరకూ పని చేస్తూనే ఉంటారని వారెన్ బఫెట్ చెప్పారు. అంటే స్టాక్‌లు, డివిడెంట్లు, మ్యూచువల్ ఫండ్స్‌లో డబ్బులను ఇన్వెస్ట్ చేయాలి. మీరు నిద్రపోతున్నప్పుడు కూడా అవి పెరుగుతూనే ఉంటాయి. కొత్త మార్గాలను అన్వేషించడం పెట్టుబడి దారుడికి చాలా అవసరం.

# యుద్ధంలో మరణిస్తే బీమా క్లెయిమ్ చేసుకోవచ్చు..

**ముంబై, మే 11:** ఉగ్రవాదం ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్యగా మారింది. ప్రపంచంలోని సగానికి పైగా ప్రజలు ప్రతిరోజూ ఈ సంక్షోభాన్ని చూస్తున్నారు. కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై జరిగిన కాల్పుల్లో 29 మంది మరణించగా, చాలా మంది గాయపడ్డారు. 26/11 ముంబై ఉగ్రవాద దాడుల్లో దాదాపు 166 మంది అమాయకులు మరణించారు. ఆ తరువాత కూడా దేశంలోని వివిధ ప్రదేశాలలో ఉగ్రవాద దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. అయితే, ఇలాంటి దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన వారికి లేదా గాయపడిన వారికి జీవిత బీమా పాలసీ వర్తిస్తుందా అనే ప్రశ్న తలెత్తుతుంది. నిజానికి, గత కొన్ని సంవత్సరాలుగా ఇన్సూరెన్స్ నిబంధనలలో మార్పులు వచ్చాయి. దీంతో ఉగ్రవాదం వల్ల కలిగేనష్టాలు ఎక్కువగా జీవిత బీమా పాలసీలో కవర్ అవుతున్నాయి, అంటే బీమా క్లెయిమ్ చేసుకోవచ్చు అని. కానీ దీనికి కొన్ని షరతులు ఉన్నాయి. ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ప్రకారం, ఇప్పుడు జీవిత బీమా పాలసీలలో ఉగ్రవాదం కారణంగా మరణాలు కూడా కవర్ చేస్తాయి. అంటే, ఒక వ్యక్తి ఉగ్రవాద బుల్లెట్ కారణంగా మరణిస్తే అతను లేదా ఆమె సాధారణ ఇన్సూరెన్స్ పరిధిలోకి వస్తారు. కానీ ఒక వ్యక్తి ఉగ్రవాద దాడుల్లో మరణిస్తే ప్రమాదవశాత్తు మరణానికి పేర్కొన్న అదనపు మొత్తం లభించదు. ఉదాహరణకు, ఒక వ్యక్తి రూ.50 లక్షల బీమా తీసుకొని ప్రమాదం జరిగితే రూ.10 లక్షల అదనపు బీమా ఉంటే ఆ వ్యక్తి ఉగ్రవాద దాడిలో మరణిస్తే కుటుంబానికి రూ.50 లక్షల బీమా మాత్రమే చెల్లిస్తారు. ఈ ప్రమాదాలకు అదనపు బీమా 10 లక్షల రూపాయల వర్తింపు ఉండదు. చాలా బీమా కంపెనీలు సాధారణ జీవిత బీమా పాలసీలలో ఉగ్రవాద దాడుల నుండి ఆర్థిక రక్షణ కూడా అందిస్తాయి. ఈ రోజుల్లో జీవిత బీమాతో పాటు ప్రజలు ఆరోగ్య బీమా, ఇల్లు ఇంకా ఆస్తి బీమా పై కూడా దృష్టి పెట్టాలి. చాలాసార్లు, ఉగ్రవాద దాడుల్లో మొత్తం ఇళ్ళు కూడా ధ్వంస మవడం ఇంకా వాహనాలు కూడా కాలిపోతుం టాయి. మీరు మీ ఇంటికి ఇంకా కారుకు బీమా చేస్తే మీరు క్లెయిమ్ చేసిన వెంటనే మీకు మొత్తం లభిస్తుంది. డాకుమెంట్స్ గురించి మాట్లాడుకుంటే బాధితుడి కుటుంబానికి బీమా క్లెయిమ్‌ల కోసం ఎక్కువగా పోలీసు రిపోర్ట్, డెత్‌సర్టిఫికెట్ అవసరం. ఉగ్రవాదదాడిలో మరణిస్తే ఇన్సూరెన్స్ క్లెయిమ్ చేసే పద్ధతి చాలా ఈజీ.




# వాణిజ్యం

## పాత పన్ను విధానం నుంచి కొత్త పన్నుకు మారాలంటే..

**న్యూఢిల్లీ, మే 11:** భారతదేశంలో ఆదాయపు పన్ను రిటర్న్ ఫారం డిఫాల్ట్‌గా కొత్త విధానానికి వర్తిస్తుంది. అయితే పన్ను చెల్లింపుదారుల సెక్షన్ 115 బీఏసీ ద్వారా మళ్లీ పాత విధానాన్ని ఎంచుకునే సౌలభ్యం ఉంటుంది. ఈ మేరకు ఆదాయపు పన్ను మార్గదర్శకాలు స్పష్టంగా పేర్కొంటున్నాయి. జీతం పొందే పన్ను చెల్లింపుదారులు తమ పన్ను రిటర్న్‌ను దాఖలు చేసేటప్పుడు పాత లేదా కొత్త పన్ను విధానాన్ని ఎంచుకోవచ్చు. ఒకవేళ మీ మీ యజమాని పాతపథకంపై పన్ను తగ్గించిన మీరు మీ రిటర్న్‌ను దాఖలు చేసే సమయంలో కొత్త విధానాన్ని పొందే అవకాశం మీకుఉంటుంది. అలాగే పాత పథకం నుంచి పన్నును తగ్గించుకునే అవకాశం కూడా మీకు ఉంటుంది. కొత్త పన్ను విధానం నుంచి పాత పన్ను విధానంలోకి మారాలంటే మీరు కచ్చితంగా గడువు తేదీకి లేదా అంతకు ముందు మీ ఐటీఆర్ దాఖలు చేస్తేనే పాత పన్ను విధానాన్ని ఎంచుకోవచ్చు. మీరు గడువును కోల్పోయి ఆలస్యంగా రిటర్న్ దాఖలు చేస్తే, ఆదాయపు పన్ను పోర్టల్ పాత పన్ను విధానాన్ని ఎంచుకోవడానికి మిమ్మల్ని అనుమతించదు. అప్పుడు మీ ఐటీఆర్ డిఫాల్ట్ కొత్త పన్ను విధానం కింద ప్రాసెస్ చేయబడు తుంది. సెక్షన్ 115 బీఏసీ అనేది ఆదాయపు పన్ను చట్టంకొత్త పన్ను విధానం కింద పన్ను స్లాబ్లు, నిబంధనలతో వ్యవహరిస్తుంది. ఈ నిబంధన ద్వారా తక్కువ పన్ను రేట్లను అందిస్తుంది. కానీ చాలా తగ్గింపులు, మినహాయింపులను తీసివేస్తుంది. మీ ఆదాయపు పన్ను రిటర్న్ (ఐటీఆర్) దాఖలు చేసే తేదీ మీరు పన్ను చెల్లింపుదారుల రకాన్ని బట్టి మారుతుంది. ఆడిట్ చేయాల్సిన అవసరం లేని ఖాతాలు లేని సాధారణ వ్యక్తులు, హెచ్‌యూఎఫ్‌లు, ఏఓపీలు, బీఓఐల కోసం, ఐటీఆర్ దాఖలు చేయడానికి గడువు తేదీ జూలై 31గా ఉంది. ఖాతాలను ఆడిట్ చేయాల్సిన సంస్థలు, కంపెనీలు అక్టోబర్ 31 లోపు తమ ఐటీఆర్‌ను దాఖలు చేయాలి. సెక్షన్ 92ఈ కింద ఉన్నవారికి నవంబర్ 30 వరకు సమయం ఉంటుంది. మీరు ఈ గడువు తేదీలోపు ఆదాయపు పన్ను రిటర్న్ దాఖలు చేయకపోతే మీరు డిసెంబర్ 31 లోపు ఆలస్యమైన లేదా సవరించిన ఐటీఆర్ సమర్పించవచ్చు. అలాగే సంబంధిత అసెస్మెంట్ సంవత్సరం ముగిసినప్పటి నుంచి నాలుగో సంవత్సరం మార్చి 31 వరకు సవరించిన రిటర్న్‌ను సమర్పించవచ్చు.




# రోడ్డు ప్రమాద బాధితులకు నగదు రహిత చికిత్స..

**న్యూఢిల్లీ, మే 11:** భారతదేశం అంతటా రోడ్డు ప్రమాదబాధితులు నియమించిన ఆసుపత్రుల్లో మొదటి ఏడు రోజులు రూ.1.5 లక్షల వరకు నగదు రహిత చికిత్స పొందేందుకు అర్హత ఉంటుందని కేంద్ర స్పష్టం చేసింది. రోడ్డు ప్రమాద బాధితులకు నగదు రహిత చికిత్స పథకం మే 5, 2025 నుంచి అమల్లోకి వచ్చిందని పేర్కొంటూ రోడ్డు రవాణా మరియు రహదారుల మంత్రిత్వ శాఖ ఇటీవల ఓ నోటిఫికేషన్ జారీ చేసింది. రోడ్డు ప్రమాదాల సమయంలో వైద్యం అందించడానికి జరిగే జాప్యం కారణంగా ఎక్కువ మరణాలు నమోదు అవుతున్నాయి. దేశంలోని ఏదైనా రహదారిపై మోటారు వాహనాల వల్ల ప్రమాదానికి గురైన ఏ వ్యక్తి అయినా ఈ పథకానికి సంబధించిన నిబంధనలకు అనుగుణంగా నగదు రహిత చికిత్సకు అర్హత ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. కేంద్రం విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం రాష్ట్రరోడ్డు భద్రతామండలి ఆ రాష్ట్రం లేదా కేంద్రపాలిత ప్రాంతానికి పథకాన్ని అమలు చేయడానికి నోడల్ ఏజెన్సీగా ఉంటుంది. అలాగే ఆసుపత్రులను ఆన్బోర్డింగ్‌చేయడానికి, బాధితులకు చికిత్స చేయడానికి, నియమించిన ఆసుపత్రికి చికిత్స, సంబంధిత విషయాలపై చెల్లింపు కోసం పోర్టల్‌ను స్వీకరించడం, ఉపయోగించడం కోసం జాతీయ ఆరోగ్య అథారిటీతో సమన్వయం చేసుకునే బాధ్యతను కలిగిఉంటుంది. ఈపథకం అమలును పర్యవేక్షించడానికి ప్రభుత్వం రోడ్ సెక్రటరీ ఆధ్వర్యంలో 11 మంది సభ్యుల స్టీరింగ్ కమిటీని కూడా ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో నేషనల్ హెల్త్ అథారిటీ సీఈఓ, ఎంఓఆర్‌టీహెచ్ అదనపు కార్యదర్శి సభ్యులుగా ఉంటారు. 2023లో 4.80 లక్షల రోడ్డు ప్రమాదాలు జరిగాయని ఫలితంగా 1.72లక్షల మంది మరణించారని రోడ్డు రవాణా,రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ ఇటీవల పేర్కొన్నారు. అయితే ఆయన వ్యాఖ్యలు తర్వాత ఈ పథకం అమల్లోకి రావడం గమనార్హం.



# ఇన్‌కమ్ టాక్స్ ఫైల్ చేసేటప్పుడు చేసే తప్పులు ఇవే..

**న్యూఢిల్లీ, మే 11:** ఐటీఆర్ ఫైలింగ్ గురించి చాలా మందికి తెలిసే ఉంటుంది. అయితే త్వరలోనే ఉద్యోగులకు ఫారం16 నింపాల్సి ఉంటుంది. ఆదాయపు పన్ను రిటర్న్ (ఐటిఆర్) ఫెయిల్ చేసేటప్పుడు తప్పులు లేకుండా చూసు కోవడం ముఖ్యం. ఇంకా చివరి తేదీకి ముందే ఐటీఆర్ ఫైల్ చేయడం ద్వారా జరిమానాలు, పన్ను నోటీసులు లేకుండా చూసుకోవచ్చు. 2025-26 అసెస్‌మెంట్ సంవత్సరానికి మీరు పే స్లిప్, వడ్డీ సర్టిఫికేట్, పెట్టుబడి సంబంధిత పేపర్స్ వంటి డాకుమెంట్స్ రెడీ చేసుకోవాలి. ఐటీఆర్ ఫైల్ చేయ డం అంటే కేవలం ఫామ్ నింపడం కాదు, కొన్నిసార్లు చిన్న చిన్న తప్పులకి కూడా పెనాల్టీ కట్టాల్సి రావొచ్చు. ఇలా తప్పులు లేకుండా ఉండాలంటే కొని విషయాలు గుర్తుంచుకోవాలి. చాలా మందికి ఐటీఆర్ ఫైల్ చేయడానికి చివరి తేదీ జూలై 31. మీరు ఈ డేట్ మిస్ అయితే రూ. 5 వేల వరకు జరిమానా కట్టాల్సి రావచ్చు. ఇంకా ఆలస్యం చేయడం వల్ల కొన్ని ట్యాక్స్ బెనిఫిట్స్ కోల్పోవచ్చు. ఈ సమస్యలన్నీ నివారించడానికి మీ ఐటీఆర్ టైంకి ముందే ఫైల్ చేయాలి. సరైన ఐటిఆర్ ఫామ్ సెలెక్ట్ చేసుకోక పోతే మీ ఐటీఆర్ క్యాన్సల్ కావచ్చు లేదా ప్రాసెసింగ్ ఆలస్యం కావచ్చు. ఉదా హరణకు మీకు జీతం వస్తుందా, రూ.50 లక్షల కంటే తక్కువ సంపాదిస్తున్నారా, షేర్స్‌పై ఇన్వెస్ట్ చేస్తుంటారా అయితే ఐటిఆర్1 ఫామ్ తీసుకోవాలి. ఈసారి, స్టాక్ మార్కెట్ నుండి ఉద్యోగులతో పాటు డబ్బు సంపాదించే వారు కూడా ఐటిఆర్-1 ఫామ్ నింపాల్సి ఉంటుంది. మీకు ఎ రకమైన ఆదాయం ఉన్న అంటే చిన్న మొత్తమైన లేదా పెద్ద మొత్తమైన ఐటీఆర్ ఫామ్‌లో ప్రకటించాలి. ఇందులో సేవింగ్స్ అకౌంట్, ఎఫ్‌డి డిపాజిట్లపై వడ్డీ, అద్దె ఆదాయం, డివిడెండ్‌లు, షేర్లు లేదా మ్యూచువల్ ఫండ్ల లాభాలు తెలియజేయాలి. మీ ఆదాయం గురించి దాచడం లేదా మర్చిపోవడం చేస్తే పన్ను శాఖ మీకు నోటీసు జారీ చేయవచ్చు ఇంకా మీకు పెనాల్టీ విధించవచ్చు. ఐటీఆర్ ఫెయిల్ చేసే ముందు ఫారం 26ఎఎస్, అన్యువల్ ఇన్ఫర్మేషన్ స్టేట్మెంట్ (ఎఐఎస్) చెక్ చేయండి. ఈ ఫామ్ మీ సంస్థ లేదా బ్యాంక్ తగ్గించిన పన్నులు ఇంకా ఏడాదిలో ఆర్థిక లావాదేవీల గురించి సమాచారాన్ని అందిస్తుంది. దీనికి ఇంకా మీ ఐటీఆర్ మధ్య ఏదైనా తేడా ఉంటే ముందుగా చెక్ చేసుకోండి. ఈ చిన్న తప్పులు లేకుండా ఐటీఆర్ ప్రాసెసింగ్‌లో లోపాలు, జాప్యాలను తగ్గిస్తాయి.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at Plot Nos. 56&58, 9th line, Ramnagar, Ongole - 523001, ph: 2312451, Fax: 08592-236879, RNI No, 64847/96, Editor.Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act, Regd. No.H/SD/337/12-14 Air Surcharge:Delhi:40 Ps